
మే 2016

# స్థానిక పాలన

## గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 8 సంచిక : 4
పేజీలు : 68
వెల: రూ.20/-




## ఇంటింటికి ఇంకుడుగుంతలను ఏర్పాటుచేసుకుందాం !
## భూగర్భ జలాలను పరిరక్షించుకొందాం !!



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వనసంరక్షణ, హార్టికల్చర్ పై టిసిపార్డులో
ప్రాజెక్ట్ డైరెక్టర్స్‌తో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న శ్రీమతి అనిత రామచంద్రన్, ఐఏఎస్



పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి ఉద్యోగులకు ఆఫీస్ మేనేజ్‌మెంట్ మరియు డిస్ట్రిక్ మాన్యువల్‌పై
జరిగిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రామీణాభివృద్ధి జాయింట్ డైరెక్టర్ (అడ్మిన్) శ్రీ పూర్ణచంద్రరరావు కార్యక్రమంలో
పంచాయతీరాజ్ డిప్యూటీ కమీషనర్ శ్రీ పి.రామరావు



యుఎన్ ఉమెన్ పేజ్-2లో భాగంగా టిసిపార్డుకు విచ్చేసిన యుఎన్ అధికారిణి రెబెక్కాట వారెస్ (నార్వే) మరియు
టిసిపార్డు అధికారులు

టిసిపార్డ్

TSIPARD

స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి : 8 సంచిక : 4

మే 2016



ఎడిటర్

**అనిత రామచంద్రన్,** ఐ.ఏ.ఎస్.

కమీషనర్, టిసిపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

**కె.యాదయ్య**

**డా॥కె.అసయ్య**

**ఎ.నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్, ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్, టిసిపార్డ్**

**నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్



ప్రచురణ

**టిసిపార్డ్**

రాజేంద్రనగర్

హైదరాబాద్ - 500 030

తెలంగాణ, ఇండియా.

ఫోన్ : 040 - 24018656

ఫ్యాక్స్ : 040 - 24017005

E-mail:editorsthanikapalana@gmail.com

Website: www.tsipard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికిగాని, టిసిపార్డ్‌కిగాని చెందినవిగా భావించనక్కరలేదు


# విషయ సూచిక


సంపాదకీయం ..... 4

పంచాయతీల బలోపేతానికి కృషి ..... 5

ఇంకుడు గుంత... తీరుస్తుంది వేసవిలో నీటిచింత ..... 6

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం ..... 8

"పచ్చదనం" కోసం పాటుపడుతున్న ఓరుగల్లు ..... 10

జిల్లా ప్రజాపరిషత్ ఆదాయ వనరులు ..... 12

లైఫ్ ప్రాజెక్ట్ - మార్గదర్శకాలు జి.ఓ. ..... 14

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం - ఒక పరిశీలన ..... 16

పంచాయతీ వ్యవస్థలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు తీరు ..... 18

విద్యావిధానంపై డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ విజన్ ..... 20

అభివృద్ధి అంతా భూమి చుట్టే ..... 22

ప్రాణాయామం పెంచుతున్న ఆరోగ్యం ..... 24

జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జడ్‌పిసి) సభ్యుల విధులు - అధికారాలు ..... 25

ఉద్యాన పంటలకు భరోసానిస్తున్న పలు పథకాలు ..... 27

త్రాగునీరు ..... 29

గ్రామాభివృద్ధి సాధనకు ప్రజలు భాగస్వాములు కావాలి ..... 33

పేదరికము - నిర్మూలనా కార్యక్రమాలు ..... 35

నీటి పొదుపు నిత్యం జరగాలి ..... 38

వివిధ రాష్ట్రాలలో పంచాయతీ ప్రభుత్వాల పనితీరు ..... 40

గ్రామపంచాయతీ ఆదాయ వనరుల సమీకరణ ..... 42

భూసేకరణ చట్టం 2013 ..... 43

కరువు సహాయక చర్యలు ముమ్మరం ..... 45

సబ్సిడీల హేతుబద్ధికరణ - ఆధార్ ..... 47

వెర్మికంపోస్ట్ తయారుచేయు పద్ధతి మరియు వినియోగంలో మెళకువలు ..... 48

బడుగు బలహీనవర్గాల పాలిటి పెన్నిధి ఎస్.ఆర్.శంకరన్, ఐఏఎస్ ..... 50

భద్రతకు పూర్తి భరోసా ..... 51

ఫ్లోరైడ్ నీరు జన జీవితాలపై ప్రభావం ..... 52

భగీరథ ప్రయత్నానికి పునాది ..... 56

అంతర్జాతీయ స్థాయిలో డా॥బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలకు గౌరవం ..... 57

తెలంగాణ రాష్ట్రంలో బహిరంగ మలవిసర్జన లేని జిల్లాగా కరీంనగర్ సాధించే దిశగా ప్రగతిలో మొదటిస్థానం ..... 59

రాంప్యారీ - పైడిజయరాజ్, మూకీయుగంలో ముంబాయిలో మన తారలు ..... 62

పాడిపశువుల మేపులో అజోల్లా ప్రాముఖ్యత ..... 65

# అసంఘటితరంగ కార్మికుల సౌకర్యం

ఏ దేశ ప్రగతైనా ఆదేశపు శ్రామికుల శ్రేయస్సుపైనా, వారి ఉత్పాదకతపైనా చాలా వరకు ఆధారపడి ఉంటుందనే విషయం నిర్వివాదాంశం. మనదేశంలోని శ్రామికులలో చాలా తక్కువ శాతం సంఘటితరంగంలో ఉండి వారి హక్కుల కోసం పోరాడేందుకు వేదికలు కలిగి వ్యవస్థీకృత వాతావరణములో ఉండి ఒక మోస్తరు సంక్షేమ పథకాలకు కూడా నోచుకోని వారు ఉన్నారు. కాని కార్మికులలో సుమారు 94 శాతము అసంఘటిత రంగంలో ఉన్నారు. నిర్మాణ రంగ కార్మికుల, రిక్షా కార్మికులు, వడ్రంగులు, కంసాలీలు, హోటల్ కార్మికులు, వ్యవసాయ కూలీలు, డ్రైవర్లు, మోటారు కార్మికులు, దుకాణాల్లోని కార్మికులు, ఇత్యాది ఎన్నో రకాలుగా ఉన్నారు. వీరికి ఆరోగ్యం ఇతర సంక్షేమ పథకాలు అందుబాటులో ఉన్నా సంపూర్ణంగా లేవు.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వము, మన తెలంగాణా ప్రభుత్వము అసంఘటిత కార్మికుల పరిస్థితి మెరుగుపరచటానికి ముమ్మరమైన ప్రయత్నాలు చేస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వము తన ఈఎస్ఐ, పిఎఫ్ వ్యవస్థల ద్వారా కొంత వరకు ఈ రంగం కార్మికులనాదుకొనే ప్రయత్నాలు కొనసాగిస్తూ ఉంది.

కాగా మన తెలంగాణా ప్రభుత్వము తన కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా వివాహం, విద్య, వైద్య సహాయం, ఆక్సిడెంట్లు, అంగవైకల్యం, ప్రసూతిలాంటి అంశాలపై అసంఘటిత రంగంలోని కార్మికులకు చేయూతనిస్తోంది. తెలంగాణాలోని నిర్మాణ కార్మికుల కోసము వివాహము, ప్రసూతి, ప్రమాదాలు, అంగవైకల్యం విషయాల్లో చేయూతనిచ్చేందుకు ప్రత్యేక పథకం కూడా అమలయింది.

కాగా ఇటీవలే కేంద్ర కార్మికశాఖ, తెలంగాణా ప్రభుత్వము, ఈఎస్ఐ పథకంలో ఉన్నా అసంఘటిత కార్మికుల కోసం తెలంగాణా ప్రభుత్వ స్పెషలిస్ట్ ఆసుపత్రులలో ప్రత్యేక వార్డులు / బెడ్‌లు కేటాయించటానికి సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చాయి.

ఈ సమస్యను పూర్తిగా అధిగమించడం కష్టతరమే కాకుండా సమయం కూడా పడుతుంది. కాబట్టి తెలంగాణా ప్రభుత్వము నైపుణ్యాతా మెరుగుదల కార్యక్రమాలకు శ్రీకారము చుట్టింది.

ఈ పరిస్థితులలో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలతో ముఖ్యంగా మహాత్మాగాంధీ గ్రామీణా ఉపాధి పథకంతో సంబంధించిన వారందరు మరింత చిత్తశుద్ధితో పనిచేసి "నరేగా" ఉపాధి హామీ పథకం క్రింద అసంఘటిత గ్రామీణ కార్మికులకు మరింత ఎక్కువ మంది లబ్ధిపొందేందుకు అవకాశాలు కల్పించాలి.

కార్మికోద్యమ స్ఫూర్తితో చైతన్యంతో అసంఘటితరంగ కార్మికులకు తెలంగాణా ప్రభుత్వం అందించే పథకాలు, ప్రతిఫలాలు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులు, అధికారులు గ్రామీణాభివృద్ధి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు రాష్ట్రంలో అసంఘటిత కార్మికుల పటిష్టతకు కృషి చేయాలి.

(అనిత రామచంద్రన్)

సంపాదకీయం



పంచాయతీరాజ్ &
గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి

## శ్రీ జూపల్లి కృష్ణారావు

సీనియర్ రాజకీయవేత్త శ్రీ జూపల్లి కృష్ణారావుగారు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా ఏప్రిల్ 28న బాధ్యతలు స్వీకరించారు. దీనికి ముందు తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. వారికి వివిధ శాఖలలో మంత్రిగా పనిచేసిన అపారమైన అనుభవముంది. శ్రీ జూపల్లి కృష్ణారావుగారు 1955లో పెద్దాదగాడలో వేపనగండ్ల మండలం మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. ఆయన బి.ఏ. డిగ్రీ హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పొందారు. కొంత కాలము ఉద్యోగిగా పనిచేశారు. పిదప శ్రీ కృష్ణారావుగారు మహబూబ్‌నగర్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గం నుండి 1999, 2004, 2009 మరియు 2012లో ఉప ఎన్నికలలో ఎం.ఎల్.ఏ.గా గెలిచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014 ఎన్నికలలో కొల్లాపూర్ నియోజకవర్గం నుండి ఐదవసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన శ్రీమతి సుజనా, వారికి ఇద్దరు కుమారులు.



# పంచాయతీల బలోపేతానికి కృషి



గ్రామీణ ప్రాంతాల్లో సమూల మార్పులు తీసుకురావడం ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఏప్రిల్ 28న సచివాలయంలో జూపల్లి కృష్ణారావు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేయడానికి గ్రామ, మండల, జిల్లా పరిషత్తు స్థాయిలో ప్రజాప్రతినిధులను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడానికి తన వంతు కృషి చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వందశాతం ప్రజలకు అందేలా చూస్తామన్నారు. సుదీర్ఘ పోరాటం ద్వారా సాధించిన తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా పనిచేస్తానని చెప్పారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా 100 శాతం పని కల్పించడానికి చర్యలు తీసుకుంటానని జూపల్లి వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్పి సింగ్, టిసిపార్దు గ్రామీణాభివృద్ధి కమీషనర్ అనిత రామచంద్రన్, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంత... తీరుస్తుంది వేసవిలో నీటిచింత

**జ**లం లేక జనం గొంతులు ఎండిపోతున్నాయి. వేసవి కాలం వస్తే చాలు గంగ కోసం భగీరథ ప్రయత్నం చేయవలసి వస్తుంది. పల్లెలు నుండి పట్టణాలు వరకు ఎక్కడ చూసినా నీటి కష్టాలే కనిపిస్తున్నాయి. చిన్నపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకూ నీళ్ళ కోసం పదరాని పాట్లు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం భూగర్భ జల్లాలు అట్టడుగు స్థాయికి పడిపోవడం. దాదాపు 1500 అడుగుల క్రిందకు బోర్లు వేసినా చుక్కనీరు దొరకని పరిస్థితి. ఫలితంగా వేసవికాలం వస్తే నగరం, గ్రామం అనే తేడా లేకుండా త్రాగునీటికి, గ్రామాల్లో సాగునీటికి కటకట ఏర్పడుతుంది.

సృష్టిలో ఏ జీవికైనా జలమే జీవనాధారం ఆ జలం విలువ తెలుసుకుని మసులుకుంటే ఎవరికైనా మనుగడ. ప్రతి వర్షాకాలం ప్రకృతి మనకు సరిపోయే నీటిని ఇస్తున్నా మనం ఆ నీటిని ఒడిసిపట్టుకునే ప్రయత్నం చేయకపోవడం దురదృష్టకరమైన విషయం. ఆధునిక జీవన విధానంలో వర్షపు నీరు మరియు గృహస్థాయిలో వృధానీరు భూమిలోకి ఇంకించే ప్రయత్నాలు సాగకపోవడంతో రోజు రోజుకీ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వర్షపు నీటిలో కేవలం 20 శాతం మాత్రమే భూమిలోకి ఇంకుతుంది. అది మాత్రమే భూగర్భ జలంగా మారుతుంది. మిగిలిన 80 శాతం కాలువలు ద్వారా నదుల్లోపడి కడలిలో కలిసిపోతుంది. ఫలితంగా బోర్లు ఎండి నీటి ఎద్దడి మొదలవుతుంది.

అందుకే ప్రతి ఒక్కరూ జలసంరక్షణకు నడుం బిగించాలి. భావితరాలకు సరిపడ త్రాగునీరు అందాలంటే ఇప్పుడున్న ప్రధాన మాత్రం ఇంకుడుగుంతలు తవ్వకం ఒక్కటే. ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే పెద్ద మొత్తంలో వర్షపునీటిని, చిన్న మొత్తంలో గృహ సముదాయ వృధా నీటిని భూగర్భజలంగా మార్చుకునే అవకాశముంది. తద్వారా భూగర్భ జలాలు పెరిగి వేసవి కాలంలో నీటి ఎద్దడి తరుగుతుంది.

## ఇంకుడు గుంత నిర్మాణం

గుంతను ఇంటి ఆవరణలో బాగా పల్లంగా ఉన్న చోట తవ్వుకోవాలి. (అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి కొలతలు నిర్ణయించుకోవచ్చు) తదనుగుణంగా ఇంటి నుండి వచ్చే వృధానీరు, ఇంటిపైకప్పుపై పడి వచ్చే వర్షపునీరు, ఇంటి ఆవరణలో పడే వర్షపునీరు గుంతలోకి మళ్లించే విధాంగా చిన్న చిన్న కాలువలు తవ్వుకోవాలి.


- గోతిలో అడుగున మూడింటిలో ఒక వంతు వరకు పెద్ద సైజు రాళ్ళను (మీ అరచేయి సైజు) వేయాలి.




- వాటిపై మరోమారు చిన్న సైజు రాళ్ళను వేయాలి.
- వాటిపై మరో చిన్న సైజు గులకరాళ్ళు లేదా చిన్న చిన్న ఇటుక ముక్కలు వేయాలి.
- తరువాత పైన ఇసుకను వేయాలి.
- మిగిలిన గుంతలో కొంత ఖాళీ ప్రదేశాన్ని ఖాళీగానే ఉంచుకోవాలి.

పైన పేర్కొన్న విధానాలలో ఏఏ విధానాలు ఎవరెవరికి అనుకూలమో ఆయా విధానాలను ఆయా గృహస్తులు అమలు పర్చుకోవచ్చు. ఒక మహాయజ్ఞంగా ఇలా ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు తవ్వకం జరగాలి. ఇంకుడు గుంతలు తవ్వకంతో భూగర్భ జలాలును పెంచగలమనే వాస్తవాన్ని ప్రజలు గ్రహించాలి. ప్రతి ఒక్కరూ నీటిని





# ఇంకుడుగుంత గెలిపించింది...

మురుగు నీరంతా భూమిలోకి.. • మచ్చుకైనా కన్పించని దోమలు • పెరుగుతున్న భూగర్భజల మట్టం
అదే స్ఫూర్తితో ఇంటింటికీ మరుగుదొడ్డి.. ఊరంతా పచ్చదనం • అభివృద్ధిలో ఆదర్శంగా ఇబ్రహీంపూర్

ఇబ్రహీంపూర్ ఏం సాధించిందంటే..

పురస్కారాలు వరించాయి..

అన్ని విధాల అభివృద్ధి

నికర ఆదాయం.. తదుపరి లక్ష్యం

నేను మా ఊరి గైడ్‌ను

ఆదా చేయడం, నీటి దుర్వినియోగాన్ని అరికట్టడం, నీటి నిల్వల పెంపుదల చర్యలు చేపట్టడం వంటి పనులను బాధ్యతగా తీసుకోవాలి. త్రాగునీటి బోర్లు వద్ద, నీటి కుళాయిలు వద్ద పోయే నీటిని అడ్డుకట్టవేసి నీటిని సంరక్షించుకోవాలి. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు ఇంకుడు గుంతలుపై విస్తృతంగా గ్రామాల్లో, పట్టణాల్లో ప్రచారం చేసి ప్రజలను చైత్యనపరచాలి. ప్రతి ఒక్కరూ జలసంరక్షణ తమ బాధ్యతగా తరువాత తరాలుకు నీటి ఎద్దడి కష్టాలు లేకుండా చేయ్యాలి.

73,74వ రాజ్యాంగ సవరణ చట్ట ప్రకారం గ్రామపంచాయతీలు ప్రజలకు త్రాగునీరు సౌకర్యాలు కల్పించవలసి వుంది. కాబట్టి నీటి సంరక్షణ బాధ్యులు కూడా గ్రామ పంచాయతీలపై ఉంది. కనుక ప్రతి గ్రామ పంచాయతీ గ్రామంలో ఇంకుడు గుంతల్ని ప్రోత్సహించాలి. గ్రామ పంచాయతీ ప్రజల్లో చైతన్యాన్ని నింపి తరిగిపోతున్న భూగర్భజలాల్ని పెంపొందించడానికి కృషి చేయాలి. అందుకు ప్రతి గ్రామం పంచాయతీ గృహస్థాయిలో వృధానీరు, వర్షపునీరు నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించడం ఎంతో అవసరం. దీనివల్ల గ్రామపంచాయతీలకు వృధానీరు రోడ్లపైకి రాకుండా వర్షపునీరు నిల్వ ఉండకుండా వాటి నిర్వహణ సులభతరం అవుతుంది. గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించడంతోపాటు గృహస్తులు కూడా తమ, తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకునే విధంగా ప్రతి ఇంటి గృహస్తురాలుని ప్రోత్సహించాలి. ఇంకుడు గుంతలుతోపాటు గృహస్తులుకు వృధాగా వచ్చే నీటితో పెరటి తోటలు పెంపకం లీచ్‌పిట్ నిర్వహణ మొదలుగు అంశాలుపై అవగాహన పెంచాలి. (కేరళలోవలె)

అదేవిధంగా వ్యవసాయదారులకు ఇంకుడుగుంతలతోపాటు తమ తమ పొలాల్లో నీటి కుంటలు నిర్వహణపై కూడా అవగాహన పెంచాలి. తద్వారా పొలాల్లో వృధాగా పోయే వర్షపునీటిని కూడా భూమిలోకి ఇంకడం వల్ల పంటలు 70% భూమిలోని తేమను పీల్చుకుని పెరుగుతాయి. ఫలితంగా వ్యవసాయంలో నీటి పారుదల ద్వారా ఆహారోత్పత్తులు రెట్టింపు అవుతాయి.

నగరాల్లో అంతటా కాంక్రీట్ జంగిల్‌గా మారింది. వర్షం నీరు రోడ్లపై ప్రవహించి, కాలువల్లోకి చేరివృధాగా పోతుంది. మరోవైపు నగరంలో విచ్చలవిడిగా బోరుబావులు తవ్వి నీటిని తోడేస్తూ ప్రజలు వారి వారి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఓవైపు నగరాల్లో పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. మరోవైపు రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి నగర ప్రజానీకానికి తాగునీటి కష్టాలు పెరిగిపోతున్నాయి. కావున నగరాల్లో జీవించాలంటే నగర ప్రజానీకం నీటి సంరక్షణ చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. కాలనీల్లో, ఖాళీ ప్రదేశాల్లో అపార్ట్‌మెంట్లు ఖాళీ ప్రదేశాల్లో సొంత ఇంటి ఆవరణల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలి. తద్వారా వర్షపునీరు భూమిలోకి ఇంకింప చేసుకోవలసిన అవసరం నగర ప్రజలపై ఉంది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఇంకుడుగుంతలుపై ప్రచారం మొదలుపెట్టింది. పార్కులు, పాఠశాలలు, కళాశాలలు, కమ్యూనిటీ హాలులు మొదలగు ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని అధికారులకు సూచించింది. అదే విధంగా కొత్తగా నిర్మించుకునే ఇళ్ళకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించింది. ఇంకుడుగుంతలు నిర్మించకుంటే ఆ భవానాలకు అనుమతులు నిరాకరించమని అధికారులకు ఆదేశించింది. గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ పథకం నిధులుతో ఇంకుడు గుంతలు నిర్మాణం పనులు ద్వారా ఉపాధి కల్పన అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇలా ప్రతి ఒకరు ఇంకుడు గుంతలు నిర్మాణంపై దృష్టి సారించాలి. ఈ నిర్మాణం ఒక మహా యజ్ఞంలాసాగాలి. వర్షపునీరు భూమిలోకి ఇంకే చర్యలు చేపట్టాలి. సహజవనరుల్ని కాపాడుకోవాలి. వర్షాకాలం పూర్తిగా ప్రవేశించక ముందే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. దీనికి ప్రభుత్వం కూడా తగిన సహాయం అందిస్తుంది. దాన్ని సక్రమంగా వినియోగించుకుందాం తద్వార భవిష్యత్‌లో నీటికి కటకటలాడే పరిస్థితి నుండి మెరుగుపర్చడం తద్వారా ఆరోగ్యకరమైన ఒక మంచి అడుగు ముందుకు పడి గ్రామాలు, పట్టణాలు నవచైన్యతంతో వెల్లువిరుస్తాయి.

**మంచినీటి సంరక్షణ మానవసంరక్షణ, ప్రపంచ సంరక్షణ**
**నీరు లేనిదే జీవం లేదు నీటితోనే బ్రతుకు...**
**నీరు లేకపోతే భవిష్యత్ లేదు.**

**ఎం.ప్రదీప్‌కుమార్,**
**రీసెర్చ్ అసోసియేట్, టిసిపార్డు**



# పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

గత కొన్ని సంవత్సరాలుగా సాధారణ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రుతువులు, కాలాలు గతి తప్పుతున్నాయి. కరువు నిత్యకృత్యం అవుతున్నది. సృష్టిలో మానవాళికేకాక సమస్త ప్రాణకోటికి ప్రధానమయిన జీవనాధారం గాలి, నీరు, చెట్లను విచక్షణారహితంగా వినియోగించుకోవడం వల్ల వాటి పరిస్థితులలో ప్రకృతిలో మార్పు ఏర్పడి పర్యావరణం దెబ్బతింటున్నది. వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల పంటలపై, ప్రజారోగ్యంపై, జీవావరణంపై ప్రభావాన్ని చూపుతుంది. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడడం, మంచు పర్వతాలు కరిగిపోవడం, గ్లోబల్ వార్మింగ్ వలన భూగోళ ధృవాల వద్ద, మంచు ప్రాంతాల్లో మంచు కరిగిపోయి జలరాశిగా మారిపోయి, సముద్రపు మట్టాలు పెరగడంతో తీర ప్రాంతాలన్నీ నీటిలో మునిగిపోయే ప్రమాదాలున్నాయి. అదే విధంగా పర్యావరణం అసమతుల్యంగా మారుతూ ఒక ప్రాంతంలో అధిక వర్షాలు, ఉధృతమైన వరదలు, తుపానులు, మరికొన్ని ప్రాంతాల్లో అసలు వర్షాలు లేకుండా కరువు కాటకాలు సంభవిస్తున్నాయి. మనిషి సామర్థ్యానికి, సౌఖ్యానికి, దురాశకు ప్రకృతి సమతుల్యత చెడిపోతుంది.

గ్లోబల్ వార్మింగ్, నీటి ఎద్దడి తదితర సమస్యల నేపథ్యంలో భూగోళంపై జీవరాశి మనుగడే ప్రశ్నార్థకంగా కనిపించే ప్రమాదకర దోరణులు కనపడుతున్నాయి. "గ్లోబల్ వార్మింగ్" కారణంగా వీస్తున్న వేడి గాలులతో భూ ఉపరితలం మునుపెన్నడూ లేనివిధంగా వేడెక్కింది.



దీనివల్ల ఎండలు, వడగాల్పుల తీవ్రతతో ప్రజారోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతుండటంతోపాటు వేడి, వడగాల్పుల వల్ల జనం పిట్టల్లా రాలిపోతున్నారు.

ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్ మానవాళికి పెనుముప్పుగా మారుతూ ప్రకృతిలో జీవరాశులన్నింటిపై పెను ప్రభావం చూపిస్తూ ప్రకృతికే ఒక సవాలుగా మారింది. వీటన్నింటి నుండి బయటపడాలంటే పర్యావరణానికి హానికర రసాయనికాలు వినియోగించడానికి బదులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతకడం, సరైన ప్రణాళికలు తయారు చేసి వాటి అమలుకు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులు మొత్తం మానవ సమాజం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంతేకాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ద్వారా అమలు అవుతున్న అన్ని రకాల ప్రాజెక్టు, పరిశ్రమలన్నీ కూడా వాటి అమలులో పర్యావరణంపై ఏ రకమైన ప్రభావం చూపుతున్నాయోనన్న ఒక పర్యావరణ ప్రణాళికను తయారు చేసుకొని, అక్కడున్న వనరులు, వాటి ప్రభావ వివరాలు, చెడు ప్రభావాలను తగ్గించేందుకు లేదా తొలగించేందుకు కావాల్సిన ప్రత్యామ్నాయ పద్ధతులను అమలు పరచాల్సిన అవసరం ఉంది. దీనిని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రత్యేక శ్రద్ధతో, దృఢ సంకల్పంతో చేయాల్సిన అవసరం ఉంది. పర్యావరణాన్ని మనం నిర్లక్ష్యం చేస్తే గనుక మనమంతా పెద్ద మొత్తంలో మూల్యం చెల్లించాల్సిన రోజులు దగ్గరలోనే వస్తాయి.

**మన కర్తవ్యాలు**

ప్రమాదకర స్థితిలో ఉన్న పర్యావరణ పరిరక్షణకై పౌరసమాజం, ప్రజా సంఘాలు, స్థానిక ప్రభుత్వాలు చేయాల్సిన కర్తవ్యాల గురించి ఆలోచించాలి. ప్రజలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, స్థానిక కాలనీ, బస్తీ వాసులు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కాలుష్య నివారణకు కృషి చేయాలి.

ఇప్పుడు ప్రపంచమంతా శాంతిని మాత్రమే కాదు, ఆకుపచ్చ కాంతిని కూడా మనసారా కోరుకుంటున్నారు. పచ్చని పరిసరాలు, స్వచ్ఛమయిన నీటి వనరులు, పరిశుభ్రమయిన ఆహ్లాదభరితమయిన వాతావరణం పెంపొందించి మానవాళి మనుగడకు అనువయిన వాతావరణాన్ని కల్పించే దిశగా ప్రజలు, మేధావులు కోరుకుంటున్నారు. పర్యావరణ సమస్య ఏ ఒక్క ప్రాంతానికో పరిమితమైంది కాదు. విశ్వమంతటికీ చెందిన విషయం. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. ఈ సమస్యపై మానవ సమాజమంతా కుల, మత, ప్రాంత బేదాలు లేకుండా రాజకీయాలకు అతీతంగా పర్యావరణ పరిరక్షణ చర్యలపై ప్రజలలో విస్తృతమయిన అవగాహన కల్పించాల్సిన సందర్భమిది.

- ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, అధికారులు ప్రజలకు పర్యావరణం మీద అవగాహన కల్పించాలి.
- పర్యావరణ పరిస్థితులపై ప్రజలను పూర్తిగా చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలి.
- పంచాయతీ సమావేశాలలో, స్వయం సహాయక సంఘ సమావేశాలలో పర్యావరణంపైన, ముంచుకొస్తున్న పర్యావరణ ప్రమాద పరిస్థితుల వలన ఏర్పడే అనర్థాలపైన చర్చించడం.
- ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలి. ఎక్కడికక్కడ వాన చుక్కలను ఒడిసి పట్టుకుని భూమిలోకి ఇంకించేందుకు ప్రతిగ్రామాన్ని సమాయత్తం చేయాలి. ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పని సరిచేస్తూ ప్రోత్సాహకాలు ప్రకటించడంతో పాటు, ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల లబ్ధికి ఇంకుడు గుంతల నిర్మాణానికి ముడిపెట్టాలి.
- ఒక్కొక్క నీటి బొట్టు కలిస్తేనే సముద్రమవుతుంది. ప్రతి వాననీటి బొట్టును పరిరక్షించ గలిగితేనే మానవాళి నీటి అవసరాలు తీరుతాయి.
- అడవుల సంరక్షణతో పాటు అడవుల పెంపకాన్ని ప్రోత్సహించాలి.
- చెట్లను విరివిగా పెంచాలి. హరితవనాలు పెంచడం. పచ్చిక మైదానాలను పెంచడం.
- వర్షాలు బాగా కురవాలంటే భూమి మీద పచ్చదనం వెళ్ళివిరియాలి. ప్రతి ప్రాంతంలో మూడోవంతు భాగం వృక్షాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.





- మంచి పారిశుద్ధ్యపు అలవాట్లను పాటించే విధంగా ప్రజలను ప్రేరేపించే కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణ చర్యలు అమలు చేయగలిగితే మెరుగయిన ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ జరుగుతాయి.
- స్థానికంగా దొరికే ఆహారాన్ని తీసుకోవాలి. దీంతో ఇతర ప్రాంతాల, దేశాల నుంచి దిగుమతులు తగ్గుతాయి. ట్రక్కులు, విమానాలు, రైళ్ళ ద్వారా వెలువడే కాలుష్యం తగ్గుతుంది.
- పంటలకు అన్ని విధాలుగా పనికి వచ్చే సేంద్రియ ఎరువుగా వర్మి కంపోస్టును ఉపయోగించుకోవాలి.
- ఇష్టం వచ్చిన రీతిగా గొట్టపు బావులు (బోర్‌వెల్స్) తవ్వకానికి అనుమతి ఇవ్వరాదు.
- వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి.
- విద్యుత్తు వాడకాన్ని తగ్గించాలి. CFL బల్బులను వాడాలి మరియు విద్యుత్తు వాడకానికి బదులు ప్రత్యామ్నాయంగా సౌరశక్తిని వినియోగించాలి.
- ప్రజా రవాణా వ్యవస్థనే ఉపయోగించడం. వాహనాలను తగ్గించడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చు.
- ప్లాస్టిక్ నిషేదించడం. మితిమీరుతున్న ప్లాస్టిక్ వినియోగం వల్ల విపరీత పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. శాస్త్రీయంగా జరిపిన పరిశోధనల ఆధారంగా ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలిసిపోవడానికి కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుందని తెలుస్తోంది.

ఇలాంటి చిన్న చిన్న ప్రయత్నాలు అత్యధిక ఫలితాలిస్తాయి. చెట్టు, గాలి, నీరు పరస్పరాధారితాలు. మొత్తం సమాజం ఈ అంశంపై దృష్టి పెట్టాలి. పుడమిపై జీవిస్తున్న ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి.

వాతావరణ వేడిమి నుండి, కాలుష్యాన్నుండి మనం మన ప్రపంచాన్ని కాపాడుకుందాం. ఇందులో మనందరం భాగస్వాములమే. ఈ భూమికి ప్రమాదం సంభవిస్తే మనమెవ్వరం ఈ ప్రమాదం నుంచి తప్పించుకోలేం. రాబోయే తరాలకు పరిశుభ్రమయిన పుడమిని అందిద్దాం.

ఇకనైనా మేల్కొందాం. పర్యావరణ సమస్యలకు చరమగీతం పాడుదాం. ప్రకృతి పరిరక్షణకై పరిసరాల కాలుష్యాలపై సమరం సాగిద్దాం.

**కె. యాదయ్యగౌడ్**
**సంయుక్త సంచాలకులు (పరిపాలన)**




# "పచ్చదనం" కోసం పాటుపడుతున్న ఓరుగల్లు

స్వతంత్ర భారతావనిలో 60 ఏళ్ళ సుదీర్ఘ పోరాటం చేసి, వేలాది మంది యువకుల బలిదానంతో 29వ రాష్ట్రంగా ఏర్పాటు చేసుకొని, అహర్నిశలు కష్టపడిన తెలంగాణ పోరుబిడ్డ, ముద్దుబిడ్డ తెలంగాణకు శ్వాస, నిశ్వాసగా "ఊపిరి"గా మారిన మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావుగారు ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన కాలములో తెలంగాణకు హరిత హారం "పచ్చల హారం" చేయాలనే తలపుంతో, "ప్రాధాన్యత" ఇచ్చి కోట్లాది మొక్కలు నాటించి, పెంచి పోషించే బాధ్యత తీసుకొని, అధికారులకు, ప్రజాప్రతినిధులకు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వర్గాల వారిని కలుపుకొని ముందుకు వెళ్ళుతున్న ముఖ్యమైన కార్యక్రమము, గౌరవ ముఖ్యమంత్రి వరంగల్ జిల్లాలో మొక్కలు నాటిన పిదప, రాష్ట్రంలోని అత్యధికంగా మొక్కలు నాటిన జిల్లాగా వరంగల్ జిల్లా పేరు సంపాదించికుంది.

### ఇంటింటా చెట్టు ఊరంతా వనంగా మారిన రోజు మన బతుకు బాగుపడుతుంది

తెలంగాణ రాష్ట్రం యొక్క భౌగళిక విస్తీర్ణం 114703 చ.కిమీ. అందులో అటవి విస్తీర్ణం 28853.78 చ.కిమీ. అనగా 25.16% మాత్రమే అడవి వుంది. జాతీయ విధానం ప్రకారము 1/3 వంతు అడవులు ఉండాలి. కాని పెరుగుతున్న జనాభా, గృహ నిర్మాణం దర్వాజ, కిటికీలకు కలప వాడటం మరియు ఇంట్లో ఫర్నీచర్‌కు కలప వాడటం మరియు వంట కొరకు చెట్లు నరకడం, జీవనోపాధి నిమిత్తము 'పోడు' వ్యవసాయం చేయడం "అనేక" చర్యల వల్ల అడవులు తరిగిపోయి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఎక్కువ ఉష్ణోగ్రత హెచ్చింపుకు మానవుల ప్రక్రియ మాత్రమే ముందు చూపు లేకపోవడం వల్ల అడవులను ఇంట్లో చెట్లను ఇష్టానుసారముగా నరికివేస్తున్నారు. నరికిన వ్యక్తులపట్ల ప్రభుత్వ అధికారులు ఎలాంటి చర్యలు గైకొనడం లేదు. పేరుకు మాత్రమే 'వాల్టా' చట్టం వున్న అధికార యంత్రాంగం ప్రజలకు సరియైన అవగాహన కల్పించలేకపోయింది. తద్వారా వరంగల్ జిల్లాలో మొక్కలు నాటడం అతి ముఖ్యమైన కార్యక్రమం క్రింద చేపట్టినది. తెలంగాణా పురుడు పోసుకున్న సంవత్సర కాలంలో ఓరుగల్లులో 420 లక్షల మొక్కలు నాటాలని కలెక్టర్ వరంగల్‌గారు ప్రణాళికలు తయారు చేసినారంటే అడవుల పెంపకానికి అధికార యంత్రాంగం ఎంత ప్రాధాన్యత ఇస్తుంది.

గుర్తించిన ప్రదేశాలలో మొక్కలు నాటు జనాభా నిష్పత్తి ప్రకారం తెలంగాణా జిల్లాలో 8.5 % భూభాగంలో మొక్కలు పెంచవల్సిన అవసరము ఉంది. మొక్కలు నాటడానికి అవసరము ఉన్న ప్రదేశములు.

1. గ్రామ పరిధిలోని రోడ్లకు ఇరువైపుల
2. కాల్వ గట్లపైన
3. బోడి గుట్టలు
4. ప్రభుత్వ సంస్థలు / కార్యాలయము
5. ఇంటి ఆవరణ
6. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలములు
7. విద్యా సంస్థలు

## తెలంగాణకు ఎనిమిది అవార్డులు

**పంచాయతీ స్వశక్తీకరణ్, రాష్ట్రీయ గౌరవ్ గ్రామసభ పురస్కారాలు**

**రా**ష్ట్రీయ గౌరవ్ గ్రామసభ పురస్కారం, పంచాయతీ స్వశక్తీకరణ్ పురస్కారం కింద రాష్ట్రానికి ఎనిమిది అవార్డులు లభించాయి. ఏప్రిల్ 24న జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో జరిగే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఆయా స్థానిక సంస్థల అధ్యక్షులకు వీటిని ప్రధాని నరేంద్రమోదీ అందజేశారు. గ్రామసభల నిర్వహణ, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పన్నుల వసూలు, నిధుల సద్వినియోగం వంటి అంశాల ఆధారంగా అవార్డులు కేటాయించారు. దేశవ్యాప్తంగా పంచాయతీ స్వశక్తికరణ్ పురస్కారానికి 29 జిల్లా పరిషత్‌లు, 58 మండల పరిషత్‌లు, 216 గ్రామపంచాయతీలను క్యాటగిరీల వారీగా ఎంపిక చేశారు. రాష్ట్రం నుంచి రాష్ట్రీయ గౌరవ్ గ్రామసభ పురస్కారం 2014-15కు కరీంనగర్ జిల్లా చందుర్తి మండలం చందుర్తి గ్రామపంచాయతీ ఎన్నికైంది. పంచాయతీ స్వశక్తి కరణ్ పురస్కారం 2015-16కు జిల్లా పరిషత్‌ల విభాగంలో వరంగల్ జెడ్పీ, మండల పరిషత్ విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా తలకొండపల్లి, మెదక్ జిల్లా సిద్దిపేటలు ఎంపికయ్యాయి. గ్రామపంచాయతీల విభాగంలో కరీంనగర్ జిల్లా సిరిసిల్ల మండలం బాలుమల్లుపల్లి, ఇదే జిల్లా చందుర్తి మండలం రామన్నపేట్, మెదక్ జిల్లా సిద్దిపేట మండలం లింగారెడ్డిపల్లి, ఇబ్రహీంపూర్‌లు ఎంపికయ్యాయి. పంచాయతీరాజ్ స్వశక్తికరణ్ పురస్కారానికి ఎంపికైన స్థానిక సంస్థలకు కేంద్రం ప్రత్యేక ప్రోత్సాహక నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా సుమారు 2,500 మంది స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు హాజరు అయ్యారు. కేంద్రం నుంచి ఆహ్వానాలు అందిన తెలుగు రాష్ట్రాలకు చెందిన 70 మంది ప్రతినిధులు వెళ్ళారు. **ఎన్.పి.**

8. రైతుల భూములు
9. పొలం గట్లపైన
10. చెరువు గట్లపైన
11. అటవీ భూములలో

రానున్న వర్షాకాలములో లక్షలాది మొక్కలు నాటి 'పుడమితల్లి'కి "పచ్చల హారం" అందించాలని ప్రతి పౌరుడు కంకణబద్ధుడై ప్రతిజ్ఞ చేసి, పుట్టిన రోజు, వర్ధంతి రోజు కూడా మొక్కలు నాటాలనే ప్రేరణ ప్రభుత్వం కల్పించాలి, లేకుంటే పర్యావసనాలు మనం ఇప్పటికి అనుభవిస్తున్నాము.

### అవగాహన లేమితితో అడవుల నరికివేత : పర్యవసనాలు, తీసుకోవలసిన చర్యలు

**1. పేదరికం :**

తెలంగాణలో పేదరికం ఎక్కువగా ఉండి కడుపు నిండి తిండి దొరకక, కష్టం చేసిన పనులు దొరకకపోవడం వల్ల సులభంగా డబ్బు సంపాదించుకోవాలనే ఉద్దేశ్యంతో యువత పోడు వ్యవసాయం చేస్తుంది. అట్టి కలపను స్మగ్లర్లకు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఈ విధానములపై కఠిన చర్యలు గైకొని పోడు వ్యవసాయం చేసి వారు మరియు కలప స్మగ్లర్ల గుర్తించి పిడి ఆక్ట్ కేసులు పెట్టాలి.

**2. కన్‌జర్వేషన్ ఎడ్యుకేషన్:**

పాఠశాలలో విద్యార్థులు యువతకు అడవుల గురించి ప్రాధాన్యత అంశాలు ప్రచారం చేయాలి. పెళ్లిళ్ల రోజున యువ జంటలు తరుపున వచ్చిన వాళ్లు ఏదైనా ప్రదేశం గుర్తించి మొక్కలు నాటించే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేపట్టాలి.

**3. వాటర్ క్వాలిటీ :**

అడవులు ఎక్కువగా ఉంటే వర్షాలు ఎక్కువగా పడతాయి. వర్షాలు పడితే కుంటల, చెరువులు నిండి వ్యవసాయం చేసుకొని పంటలు పండించి రైతులు సౌభాగ్యంగా వుంటారు. భూగర్భంలో 'జలం' ఇనికి భూగర్భం జల మట్టం పెరిగే అవకాశము వుంది. గతంలో మనం చేద బావుల ద్వారా నీటిని తోడుకున్నాము. ప్రస్తుతము 1000/2000 ఫీట్లు బోర్లు వేస్తున్నాము. అయినా చుక్క నీరు రావడం లేదు. నీటి పెంపుదల కోసం ఇంకుడు గుంతలు, మ్యాజిక్ సోక్‌ఫిట్, ఫారం ఫౌండ్స్, మరియు చెరువు శిఖంలో చేపల పెంపకం కోసం గోతులు తవ్వడం వలన ప్రవహించే నీటికి నడక నేర్పించి నీరు భూమిలోకి ఇంకేటట్లు చేయవచ్చు. తద్వారా జలమట్టం పెరిగే అవకాశం ఉంది.

**4. ఏయిర్ క్వాలిటీ:**

అడవులు ఎక్కువగా వుండటం వల్ల ఆక్సిజన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అట్టి ఆక్సిజన్ జనం పీల్చుకొని ఆరోగ్యవంతులు అవుతారు.

**5. క్లైమేట్ మార్పు :**

అడవులు ఎక్కువగా వుండటం వల్ల వాతావరణం చల్లబడుతుంది. జనం చల్లదనంలో ఎక్కువ 'శ్రమ' చేసే అవకాశము వుంది. తద్వారా ఉత్పత్తి ప్రక్రియ పెంచవచ్చును. వాతావరణంలో మార్పులకు మనం ఇప్పుడు గమనిస్తున్నాము.

**6. ఆకటి (పోరాటం) ఆరాటం:**

అడవుల పెంపకం వల్ల అడవిలో ఉన్న 'ఫలం' సేకరించి, తిని బలవర్ధక పోషకాహారం తీసుకొంటారు. అంతేగాకుండా అడవుల్లో ఉన్న ఫలాలు తీసుకువచ్చి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని జీవనోపాధి పొందవచ్చును. ఆకలి తీరుస్తుంది, ఆరోగ్యంగా వుంచుతుంది.

రానున్న రోజుల్లో వరంగల్ జిల్లాలో అత్యధికంగా మొక్కలు నాటి తెలంగాణ అన్ని జిల్లాల కంటే "హరిత హారం"లో మనం ముందుండాలి. ప్రతి ఉద్యోగి / ప్రజాప్రతినిధి/ రాజకీయ / విద్యార్థి / వ్యాపారస్తులు / స్వచ్ఛంద సంస్థలు అన్ని వర్గాల వారిని చైతన్యపరిచి విరివిగా మొక్కలు నాటాలి. నాటిన మొక్క బతకాలి, బతికించాలి అని పట్టుదలతో జిల్లా యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుంది. అందుకు మనమందరం చేయి చేయి కలిపి "పచ్చదనం" కొరకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**మిట్టకోల చంద్రమౌళి**
**ఎం.పి.డి.ఓ.**
**మండల ప్రజా పరిషత్, ఖానాపూర్, వరంగల్ జిల్లా.**

# జిల్లా ప్రజాపరిషత్తు ఆదాయ వనరులు

ఏ ప్రభుత్వం లేదా సంస్థ మనుగడకైనా నిధులు అవసరం. అందునా ప్రజోపయోగ అభివృద్ధి కార్యక్రమాలు చేయు జిల్లా ప్రజా పరిషత్తు నందు ప్రజా ప్రభుత్వాలకు నిధులు ఉంటేనే గాని ఏ కార్యక్రమం జరగదు. తన విధుల నిర్వహణకు జిల్లా ప్రజా పరిషత్తుకు ఈ క్రింది విధంగా ఆదాయ వనరులు సమకూరుతాయి.

**జిల్లా ప్రజా పరిషత్తు నిధులు (సె.197)**

- జిల్లా ప్రజా పరిషత్‌కు వచ్చు ఆదాయాలన్నీ జిల్లా ప్రజా పరిషత్ నిధిగా పరిగణించబడును. ఈ నిధులను పంచాయితి రాజ్ చట్టము ద్వారా నిర్దేశించిన వ్యవహారాలకు నిర్ణయింపబడు పనులు చేయుటకు మరియు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖర్చు చేయవలయును.
- **ట్రెజరీలో జమ చేయుట :–** జిల్లా ప్రజా పరిషత్ నిధులన్నీ ట్రెజరీలో జమ చేయాలి. కేంద్రప్రభుత్వం ద్వారా వచ్చు నిధులను ప్రభుత్వము తెలియజేసిన జాతీయ బ్యాంకుల్లో జమ చేయాలి. (కమీషనర్ పంచాయితి రాజ్ లేఖ 10669/సి.పి.ఆర్ & ఆర్.ఇ./జె1/2004 తేది. 09.12.2005 ప్రకారం.)
- ఆ నిధులు ముఖ్య కార్య నిర్వహణ అధికారి సంతకం చేసిన చెక్కులద్వారా చెల్లించాలి.
- పంచాయితీరాజ్ చట్టము సెక్షన్ 198 ప్రకారం జిల్లా ప్రజాపరిషత్తుకు వచ్చు నిధులు

ఎ) స్వంతవనరులు బి) కేటాయింపు నిధులు

సి) కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుండి వచ్చు నిధులు.

డి) ఇతర వనరులు

**ఎ. స్వంత వనరులు :** ఈ క్రింద పేర్కొన్న మార్గములనుండి చేకూరును.

1. **రేవులనుండి:** జిల్లా ప్రజా పరిషత్ పరిధిలోను లేదా రెండు జిల్లా ప్రజా పరిషత్ లకు ఉమ్మడి గానున్న రేవుల ద్వారా ప్రజలను చేరవేయుటకు, సరుకు రవాణాచేయుటకు గాను పడవలు, లేదా లాంచీలు నడుపుకొని నిర్ణీత సొమ్ము వసూలు చేసుకొనుటకు వేలం ద్వారా వచ్చు సొమ్ము జిల్లా ప్రజా పరిషత్ కు జమ కాబడును.
2. **చెట్లు, మార్కెట్ల ద్వారా:** జిల్లా ప్రజా పరిషత్తుకు చెందిన భూముల్లోని చెట్ల ఫలసాయం ద్వారా వచ్చు ఆదాయము, అలాగే జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజాపరిషత్తు మార్కెట్ల వేలం ద్వారా వచ్చు ఆదాయము.
3. **వాణిజ్య సముదాయాల అద్దె:** జిల్లా ప్రజా పరిషత్తు రోడ్డు మార్జినులలో గల వాణిజ్య సముదాయాలు, అతిధి భవనాలు, ఉద్యోగుల క్వార్టర్లు మీద వచ్చు అద్దె, సమావేశ భవనాలు, ఇతర భవనాలపైన వచ్చు అద్దెలు.
4. **కాలం చెల్లిన ధరావత్తులు:** మూడు సంవత్సరాలు మించి తిరిగి పొందని ధరావత్తులు.

**బి) కేయింపు నిధులు:**

**1. ఆస్థిబదిలీలపై సర్చార్జి :**

పంచాయితీ రాజ్ చట్టంలోని సెక్షను 69 ప్రకారం రిజిస్ట్రేషను శాఖ సేకరించు ఆస్థి బదిలీలపై సుంకము నుండి సర్‌చార్జి సంబంధిత గ్రామ పంచాయితీ, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లకు 1.5:1:1 నిష్పత్తి ద్వారా మూడు నెలలకొక సారి జమచేయబడుతుంది.

**2. సీనరేజిరుసుము :**

- ఆంధ్రప్రదేశ్ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్సు 1966 ప్రకారం లఘు ఖనిజాలపై ప్రభుత్వం వారు పన్ను మరియు రుసుము వసూలు చేయుదురు.
- జి.ఓ.యం.ఎస్ నెం. 335 పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి (పియస్ 3) శాఖ తే. 16/8/96 ప్రకారం వసూలు చేయబడిన రుసుమును గ్రామపంచాయితీ, మండల ప్రజాపరిషత్తులు, జిల్లా ప్రజా పరిషత్తులకు 25:50:25 నిష్పత్తిలో ప్రభుత్వం కేటాయిస్తుంది. (G.O.M.S. No. 255 PR&RD (Pts iii) తేదీ 02/8/2001.
- గ్రామపంచాయతి, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లకుపై నిష్పత్తిలో కేటాయించిన మొత్తం నుండి 35% ఖనిజాలపై వసూలు చేసిన సెస్సు ఆ ప్రాంతంనందే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రోడ్డు పనులకు మొదలగు వారికి ఖర్చు చేయవలెను.

(జి.ఓ.యమ్.యస్.నెం. 28 పి.ఆర్. & ఆర్.డి. (పి.ఆర్.111) డి.30.1.02

**3. ప్రభుత్వం నుండి వచ్చు నిధులు :**

1. రు 4/– తలసరిగ్రాంటు : (2011 జనాభా లెక్కల ప్రకారం మనిషికి రు 4/– చొప్పున జమ కాబడును)
2. జిల్లా ప్రజా పరిషత్తు సిబ్బందికి ఇచ్చు రవాణా భత్యము, ఆగంతక నిధులు
3. జిల్లా ప్రజా పరిషత్తు ద్వారా మండల ప్రజా పరిషత్తు కు కేటాయించవలసిన ఆగంతక నిధులు మరియు రవాణా భత్యములు.
4. జిల్లా ప్రజా పరిషత్తు ఛైర్‌పర్సన్/వైస్ ఛైర్‌పర్సన్/జడ్.పి.టి.సి. సభ్యుల మరియు కోఆప్షన్ సభ్యుల ప్రయాణ భత్యాలు, దినసరి భత్యాలు, గౌరవవేతనాలు.
5. గ్రామ పంచాయితీలకు జిల్లా ప్రజా పరిషత్ ద్వారా పంపిణీ చేయు నిధులు ఉదా: ఉత్తమ గ్రామ పంచాయితీలకు బహుమతి నిధులు.
6. గ్రామ పంచాయితీలకు ఇవ్వవలసిన మ్యాచింగ్ గ్రాంట్లు.
7. జిల్లా ప్రజా పరిషత్తుకు కేయించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు
8. గ్రామీణ ప్రాంతమండలి షెడ్యూల్డ్ కులాల ఆవాస ప్రాంతాలలో గ్రంధాలయాల ఏర్పాటుకు నిధులు.
9. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక కమిషన్ నిధులు
10. 8రూపాయల తలసరి గ్రాంటు: మండల ప్రజాపరిషత్‌లకు పంపిణీకై
11. మండల ప్రజా పరిషత్, యం.పి.పి. యం.పి.టి.సి, సభ్యులకు చెల్లించవలసిన గౌరవ వేతనాలు (మండల ప్రజా పరిషత్‌లకు పంపిణీ చేయుట కొరకు)
12. విద్యానిధి:– జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేయుచున్న బోధనేతర సిబ్బంది జీతభత్యాలు.





# రాజస్థాన్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు టిసిపార్డు సందర్శన

రాజస్తాన్ ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖాధికార్లు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి సంస్థ (టిసిపార్డు)ను సందర్శించి ఆ సంస్థలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను గూర్చి తెలుసుకొన్నారు. టిసిపార్డులో స్థానిక సంస్థల ప్రతినిధులు సర్పంచ్ వద్ద నుండి జిల్లా పరిషత్ అధ్యక్షులు వరకు ఎలాంటి శిక్షణ జరుగుచున్నది అని అంశాలను ఎన్ఆర్ఎం సెంటర్ హెడ్ బి.నరేంద్రనాథ్‌రావు అధికారులకు వివరించారు. 1954లో స్థాపింబచడిన సిఆర్ సంస్థ ఎదిగి నేడు దేశంలోనే ఎస్ఐఆర్‌డి సంస్థల అన్నింటిలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ సంస్థ ప్రప్రథమంగా నిలిచిందని వివరించారు. టిసిపార్డులో జరుగుతున్న శిక్షణ ఎన్నిక కాబడిన స్థానిక సంస్థల ప్రతినిధులు సర్పంచ్‌లు 8,695 మంది, ఎం.పి.పి.లు 438, ఎం.పి.టి.సి.లు 6141 మంది 9 మంది జిల్లా పరిషత్ ఛైర్మన్‌లు జడ్‌పిటిసిలు 438 మందికి శిక్షణనిచ్చి దేశంలోనే తలమానికంగా ఉందని అన్నారు. శిక్షణలో భాగంగా యోగా తరగతులు కూడా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. రాజస్తాన్ గ్రామీణ అధికారులు అనేక ప్రశ్నలు అడగ్గా వివిధ శాఖల వారు వారికి సమాధానాలు ఇవ్వడం జరిగింది. ఇందులో సిడిపిఎ హెడ్ బి.శేషాద్రి, డి.డి.అకౌంట్స్ శ్రీ ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

13. జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ అనుమతితో విధించు పన్నులు, ఫీజుల నుండి వచ్చు సొమ్ము
14. జిల్లా ప్రజా పరిషత్తు నిర్వహించు ధర్మాదాయాలు, ట్రస్టుల నుండి వచ్చు రాబడి.
15. ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా కేటాయించునట్టి జిల్లా బోర్డుల రాబడి.
16. ప్రజావిరాళములు.

**డి) ఇతర వనరులు :**

**1. ఇంజినీరింగు నిధి**

1. ఇంజినీరింగు కార్యాలయాల ఆగంతక ఖర్చులు
2. గ్రామీణ రహదారుల నిర్వహణ కొరకు
3. రహదారి నిర్వహణ కొరకు
4. చెరకు రవాణా చేయు రహదారుల కొరకు
5. రహదార్లకు కరువు పునరావాస గ్రాంటు
6. తుఫాను - వరదల మరమ్మత్తుల గ్రాంటు
7. గ్రామీణ నీటిసరఫరా పధకాల గ్రాంట్లు
8. యం.పి. లాడ్సు, ఎ.సి.డి.పి నిధులు మరియు ప్రభుత్వముచే విడుదల చేయబడు ఇతర నిధులు.

**ఇ) ధరావత్తులు, రుణములు, బయానాలు సాధారణ నిధికి జమ అవుతాయి.**

**ఎఫ్) విరాళాలు :**

1. ఏ రూపంలోనైనా ప్రజలనుండి సేకరించు విరాళాలు
2. ప్రభుత్వ పూర్వానుమతితో జిల్లా ప్రజా పరిషత్తు మండల ప్రజా పరిషత్తులనుండి సేకరించు విరాళము.

**సాధారణ నిధి:**

స్వంతవనరులు, ప్రభుత్వ కేటాయింపులు, తలసరి గ్రాంటు కలసి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ నిధి అంటారు.

**సిడిపిఏ / టిసిపార్డు**

# లైఫ్ ప్రాజెక్ట్ - మార్గదర్శకాలు

## తెలంగాణ ప్రభుత్వం - కమీషనర్, గ్రామీణాభివృద్ధి శాఖ

01-3-1028, డ్వాక్రా బిల్డింగ్, గాంధీనగర్, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్

మెమో నెం. : 999 /ఇ.జి.ఎస్/పి.ఎం(ఎస్.పి)/2015, తేది: 23.07.2015

విషయం : యం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. - తెలంగాణ - "లైఫ్ ప్రాజెక్ట్" ద్వారా 100 రోజులు పని పూర్తి చేసిన కుటుంబాల యువతీ యువకులకు నైపుణ్యాలు పెంచి జీవనోపాధులను బలోపేతం చేయుటం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచడం గురించి - మార్గదర్శకాలు - జారీ.

నిర్దేశం : 1. లేఖ నెం.జె-11060/08/2015 - యం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్.-వి / భారత ప్రభుత్వం - గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, తేది : 15.04.2015

xxx

**మ**హాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న కుటుంబాలకు 100 రోజుల పని గ్యారంటీ కల్పిస్తూ వారి సుస్థిర జీవనోపాధులను మెరుగుపరచడం పథక ముఖ్య ఉద్దేశ్యం. ఈ ఉద్దేశ్యం అనుసంధానంగా ఈ "లైఫ్ ప్రాజెక్టు" ను రూపొందించడం జరిగింది.

ఈ "లైఫ్ ప్రాజెక్ట్" ముఖ్య లక్ష్యం జీవనోపాధుల బలోపేతం, ప్రస్తుతం ఉన్న నైపుణ్యాల పెంపుదల, కొత్త నైపుణ్యాలను అందించడం, తద్వారా ప్రస్తుతం చేస్తున్న ఉపాధి రోజులను మెరుగుపరచడం, కొత్త ఉపాధి అవకాశాలను అందుకునేటట్లు చేయడం, 100 రోజుల కూలి పనితో పాటు సంవత్సరం మొత్తం ఉపాధి లభించేటట్లు స్వయం - స్వావలంబన దిశగా తీసుకెళ్ళడం.

పై లక్ష్యాలను అందుకునేందుకు, పథక ఉద్దేశ్యం అమలు పరిచేందుకు ఈ క్రింద సూచించిన మార్గదర్శకాలను జారీ చేయడమైనది.

**1. అర్హులు :**

- గత 2011-12 ఆర్థిక సంవత్సరం నుండి 2014-15 సంవత్సరం అనగా గత 4 సంవత్సరాలలో నిరంతరం కనీసం ఏదేని 2 సంవత్సరాలకు పైబడి 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాలలో ఉన్న యువతీయువకులు ఈ లైఫ్ పథకానికి అర్హులుగా పరిగణించబడతారు.
- యువతీయువకులు అనగా ఈ అర్హత సాధించిన కుటుంబాలలో ఉన్న 18 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగినవారు అర్హులు.
- ఒక వేళ ఎస్.సి./ఎస్.టి., స్త్రీ ఆధారిత మరియు వికలాంగులు కల్గిన కుటుంబాలకు 10 సంత్సరాల వయస్సు అనగా 18 నుండి 45 సంవత్సరాల వారు అర్హులు.
- ఒక కుటుంబం నుండి ఉత్సాహవంతులైన ఒకరినే ఈ పథకంలో భాగస్వాములు చేయడం జరుగుతుంది.

**2. కుటుంబ సర్వేకంటే ముందు చేయాల్సిన పనులు :**

- గ్రామం వారిగా అర్హత పొందిన కుటుంబాల వివరాలను ఎంజిఎన్ఆర్ఇజిఎస్, వెబ్ రిపోర్టు ఆర్:25 నందు పొందుపర్చడం జరిగింది.
- మండల ఉపాధి హామీ సిబ్బందికి ఈ సర్వేపై జిల్లా / డివిజన్ స్థాయిలో శిక్షణలు ఇప్పించాలి.
- మండల స్థాయిలో ఉన్న అన్ని గ్రామాల క్షేత్ర సహాయకులు / సీనియర్ మేట్లకు సర్వేపై పూర్తి అవగాహన కల్పిస్తూ ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేయాలి.
- ఎంజిఎన్ఆర్ఇజిఎస్, వెబ్ రిపోర్టులో పొందుపరిచిన కుటుంబ సర్వే ఫారాలను ఆర్:25-2 రిపోర్టు ద్వారా గ్రామాల వారిగా కుటుంబానికి ఒక ఫారం చొప్పున ఎంసిసి ప్రింట్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి.
- ఈ "లైఫ్ ప్రాజెక్టు" సర్వే సమర్థవంతంగా నిర్ణయించిన తేదీలలో పూర్తియ్యేటట్లు ప్రాజెక్టు డైరెక్టర్లు మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తయ్యేటట్లు చర్యలు తీసుకోవాలి.

**3. సర్వే ఎలా చేయాలి - సూచనలు :**

- మొదటి రోజు మండల స్థాయి శిక్షణ రోజే క్షేత్ర సహాయకులు / సీనియర్ మేట్లకు వారివారి గ్రామాలలో అర్హత సాధించిన కుటుంబాల సర్వే ఫారాలను అందజేయాలి. అలాగే కోడ్‌మాస్టర్ వారికి అందజేయాలి.
- రెండవ రోజు తమ తమ గ్రామాలలో కుటుంబ సర్వే చేయడం మొదలుపెట్టాలి. ఒక్కో కుటుంబం దగ్గర కనీస సమయాన్ని వెచ్చించి వారికి ఈ "లైఫ్ ప్రాజెక్ట్" ముఖ్య ఉద్దేశ్యాలను వివరించి వారి కుటుంబాలలో ఉన్న యువతీయువకులకు అవగాహన కల్పించి సర్వే ఫారాలలో సూచించిన పూర్తి సమాచారాన్ని నింపాలి.
- కుటుంబంతో చర్చించేటప్పుడు ముఖ్యంగా ఆ కుటుంబంలో ఉన్న యువతీయువకుల నైపుణ్యాల పెంపుదల, స్వయం ఉపాధి గురించిన ఆలోచనలు మరియు ప్రస్తుతం చేస్తున్న జీవనోపాధిని బలోపేతం చేయడం, ఈ మూడు అంశాలను చర్చించాలి.

# తెలంగాణాలో కార్మిక సంక్షేమం



కార్మిక సంక్షేమ పథకాలలో నమోదైన ప్రతి భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ రంగాలలోని నిర్మాణ కార్మికుల తెలంగాణా ప్రభుత్వం చాలా మంచి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నది. అందులో కొన్ని గ్రామీణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు

1. భవన నిర్మాణ కార్మికునిగా నమోదైన 12 నెలల తరువాత అతని భార్యకు రెండు కాన్పుల వరకు ప్రతి కాన్పుకు రూ. 10,000/- చొప్పున ఇవ్వడం జరుగుతుంది. అలాగే అతని ఇద్దరి పిల్లలకు మరియు అతని కూతుళ్ళకు మొదటి కాన్పునకు రూ. 10,000/- ఇవ్వడం జరుగుతుంది.
2. ప్రసూతి సమయంలో వైద్య ఖర్చులు కాక ఇతర వైద్య ఖర్చులకుగాను రూ. 30,000/-ల వరకు ఇవ్వడం జరుగుతుంది.
3. ఇది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో మాత్రమే జమచేయబడుతుంది.
4. రిజిష్టరు కార్మికులకు ప్రమాదవశాత్తు కానీ, సహజ మరణం కాని సంభవించినచో దహన ఖర్చులకు రూ. 20,000/- ఇవ్వబడును.
5. రిజిష్టరు కాని భవన నిర్మాణ మరియు ఇతర కార్మికులకు పనిచేయు ప్రదేశంలో ప్రమాదవశాత్తు చనిపోతే సహాయనిధిగా రూ. 60,000 ఇవ్వబడుతుంది.
6. పైన తెలిపిన మొత్తమును వారసులకు కానీ, నామినీకి కానీ దహన మరియు ఖనన సమయంలో చెల్లించబడును.
7. ఈ పథకం 01.05.2015 నుండి అమలులోనికి వచ్చింది.
8. రిజిష్టరు అయిన లేక రిజిష్టరు కాని కార్మికుడు పనిచేయుచుండగా ప్రమాదవశాత్తు చనిపోతే అతని మృతదేహమును సొంత స్థలం చేర్చుటకు కి.మీ.కు రూ. 20/- చొపున చెల్లించబడును. ఒక వేళ దహన ఖర్చులు సరియైన సమయంలో చెల్లించకపోతే ఇతర భృతి చెల్లించునప్పుడు దానితోపాటుగా చెల్లించాలి.
9. బోర్డులో రిజిష్టరు అయిన కార్మికులు పనిచేసే ప్రదేశంలో కాని, వేరే చోట కాని చనిపోయిన లేక శాశ్వత వికలాంగులుగా మారిన వారికి రూ. 3,00,000/- చెల్లించబడుతుంది.
10. రవాణా వాహన డ్రైవర్‌లకు, హోం గార్డులకు, పత్రికా విలేకరులకు సామాజిక భద్రత పథకం క్రింద ప్రమాద భీమా క్రింద రూ. 5,00,000/- చెల్లించబడుతుంది.

అంతే కాక ఇంకా పలు సంక్షేమ పథకాలు కార్మికుల కోసం అమలు పరుస్తున్నాయి.

- ఈ సర్వే ఫారంలో కుటుంబంలో నమోదు కాబడిన యువతీ యువకుల వివరాలను ప్రింట్ చేయడం జరిగింది. కాని మన "లైఫ్ ప్రాజెక్టు"లో శిక్షణ /నైపుణ్యాల పెంపు ఇతర కార్యక్రమాలను నమోదు చేసుకున్న వారిలో, ఒకరినే అర్హులుగా తీసుకోబడుతుంది.
- సర్వే చేసేటప్పుడు కుటుంబ యజమాని మరియు ఆ కుటుంబంలో ఉన్న యువతీయువకులను కలిపి ఒకేసారి మాట్లాడాలి. (వేరువేరుగా మాట్లాడరాదు).
- ఈ కుటుంబ సర్వే 3 నుండి 4 రోజులలో పూర్తి చేయాలి. ఈ నెల జూలై 31 తేదీలోపు పూర్తి చేసి డాటాఎంట్రీ చేయించాలి.
- ప్రతిరోజు పూర్తి చేసిన సర్వే ఫారాలను సంబంధిత సాంకేతిక సహాయకులు / అదనపు ప్రోగ్రాం అధికారి గ్రామాల నుండి సేకరించి ఎంసిసి నందు కంప్యూటర్‌లో సమాచారాన్ని పొందు పరచాలి. (డాటాఎంట్రీ)

పై మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్ట్ డైరెక్టర్, డ్వామా తగు సూచనలను, మార్గదర్శకాలను క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలి. "లైఫ్ ప్రాజెక్ట్"లో శిక్షణలకు, నైపుణ్యాల పెంపు గురించి, మరియు జీవనోపాధుల మెరుగుదలకు సంబంధించిన పథక లక్ష్యాలను అందుకునేటట్లు ఈ పథకం అమలు చేయవలసిందిగా కోరడమైనది.

**సం/- శ్రీమతి అనితారామచంద్రన్, ఐఏఎస్.,**
**డైరెక్టర్, పి.ఆర్ మరియు ఆర్.డి**



# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం - ఒక పరిశీలన

నేడు భారతదేశంలో నిరుద్యోగం, పేదరికం గణనీయంగా పెరిగిపోయింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో దారిద్ర్యం విపరీతంగా పెరిగిపోతుంది. దీనికి ప్రధాన కారణం గ్రామీణ ప్రాంతంలో ఉపాధి లేకపోవటం, గ్రామీణ పేదరికం ఉండటం మూలంగా దారిద్ర్యం తాండవిస్తున్నది. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి లేకపోవటం, భూమిలేకపోవటం, ఉన్న భూమిలో సరిగ్గా ఉత్పాదకతను సాధించలేకపోవడం, గ్రామాలలో వ్యవసాయ, వ్యవసాయేతర ఉపాధులు తక్కువగా ఉండటం, యాంత్రీకరణ మూలంగా చేతివృత్తులు దెబ్బతిని ఉపాధి కోల్పవటం వంటి కారణాల వల్ల దేశంలో దారిద్ర్యం రూపుమాపటంలో అనుకున్న ఫలితాలను సాధించలేకపోయాయి. నేడు భారతదేశం అభివృద్ధి భారతదేశంగాను, అసంతృప్తి దేశంగాను విభజించబడింది. ఈ అసంతృప్త భారతదేశంలోని సమస్యలు 2004లో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్నికలను, కేంద్ర ఎన్నికలను విశేషంగా ప్రభావితం చేశాయి. దీనితో ఒక్కసారిగా దేశంలోని గ్రామీణ ప్రాంతాలలోని సమస్యలైన వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణ ఉపాధి వంటి అంశాలు భారీ ఎజెండాతో ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన డా॥ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం 2004లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతో గ్రామీణ ప్రజలకు పనిని హక్కుగా కల్పించడానికి ఒక బృహత్తర పథకాన్ని ప్రారంభించింది.

8వ పంచవర్ష ప్రణాళిక కాలంలో మొత్తం జి.డి.పి.లో గ్రామీణ అభివృద్ధికి 14.5 ఖర్చు చేయగా 1991-2004 మధ్య కాలంలో మొత్తం జి.డి.పి.లో 6 % మాత్రమే ఖర్చు చేసింది. దీనిలో గ్రామీణాభివృద్ధికి వ్యయం తగ్గడం మూలంగా వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలో ఉపాధి తగ్గిపోయింది. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలలో చేతివృత్తులు దెబ్బతిన్నాయి. గ్రామీణ అశాంతి పెరిగిపోయింది. గ్రామీణ పేదరికం, నిరుద్యోగం పెరిగి భారత దేశం దారిద్ర్య నిర్మూలనకు చేసిన పథకాలు అన్నీ విఫలమయ్యాయి.

డా॥ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం చేపట్టిన ఈ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనేది ప్రజలకు ఉపాధిని హక్కుగా కల్పించింది. దేశంలో ఇంతకు ముందు ఎన్నో అభివృద్ధి పథకాలు చేపట్టినా కూడా అవి నిధులను బట్టి, సదుపాయాలను బట్టి పనిని కల్పించాయి. కాని ఈ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనేది ప్రతి గ్రామీణ కుటుంబంలో పనిచేయగల సామర్థ్యం గల వారిలో ఒకరికి సంవత్సరంలో 100 రోజుల పనిని కల్పిస్తుంది. ఈ పనిని పొందడం ప్రతి కుటుంబ హక్కుగా చట్టాన్ని తీసుకువచ్చింది. ఇది సార్వత్రిక ఉపాధి హామీ అనే బృహత్ సంకల్పంతో 2006-2007 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 200 జిల్లాలలో అమలు చేసింది. ఈ పథకం ఉపాధిని హక్కుగా కల్పిస్తుంది. స్త్రీ, పురుషుల మధ్య వేతన వ్యత్యాసాలను తగ్గిస్తుంది. ఇది మెరుగైన వేతనాలతోపాటు వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలో వేతనాలకు స్థిరీకరణ కల్గిస్తుంది. కార్మికుల డిమాండ్ పెంచి అన్ని రంగాలలో మెరుగైన వేతనాలతో పాటు ఉపాధి హామికి కృషి చేస్తుంది. అయితే ఈ పథకం ఉపాధి పొందడానికి ఉపాధి హామీ కార్డులను జారీ చేసి, దానిద్వారా ఉపాధి పొందడానికి దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి 15 రోజులలో ఉపాధిని కల్పిస్తుంది. ఉపాధి కల్పించలేక పోయినట్లయితే ఆ కాలానికి నిరుద్యోగ భృతి చెల్లిస్తుంది.

ఈ పథకాన్ని 2006-2007 సంవత్సరంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో 200 జిల్లాలో మొదటి దశలో ప్రారంభించింది. ఈ పనులను వ్యవసాయేతర సీజన్‌లో కల్పించడం ద్వారా ప్రజలకు ఉపాధి, వేతన, సామాజిక, ఆర్థిక భద్రతలకు అవకాశం కల్పించింది. ఇది సంవత్సరంలో ప్రతి కుటుంబంలో ఒకరికి 100 రోజుల పనిని కల్పించాలనే లక్ష్యంతో ప్రారంభించినప్పటికీ ఇందులో రాష్ట్రాలవారీగా

పని దినాలలో అసమానతలు కనిపిస్తున్నట్టు గ్రామీణ ఉపాధి హామీ పథకం వెబ్‌సైట్ నివేదిక ద్వారా తెలుస్తున్నది. దేశంలో త్రిపుర రాష్ట్రంలో అత్యధికంగా 87 రోజులు పని కల్పించగా దేశంలోని అనేక రాష్ట్రాలలో పనిదినాల కల్పనలో వెనకబడి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ 2006-2007 సంవత్సరంలో 28 రోజుల పని కల్పించినట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమంలో యు.పి.ఏ. ప్రభుత్వం జాతీయ సలహా కమిటీ వారు 2006-2007 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 200 కోట్ల పనిదినాలను కల్పించాలని సంకల్పించింది. కాని గ్రామీణ ఉపాధి హామీ పథకం వెబ్‌సైట్ నివేదిక ద్వారా 90 కోట్ల పనిదినాలను 9000 కోట్ల రూపాయలను వెచ్చించినట్టు తెలుస్తుంది. పనిదినాలలో కల్పనలో ఉత్తరాది రాష్ట్రాలు ముఖ్యంగా రాజస్తాన్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, అస్సాం రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని తెలుస్తుంది. దీనికి ప్రధాన కారణం ఆ రాష్ట్రంలో నిరుద్యోగం, పేదరికం కారణాలుగా తెలుస్తుంది. కాని దక్షిణాది రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, రాష్ట్రాలు గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో వెనకబడ్డాయి. దేశంలో ఈ పథకం అమలులో జిల్లాలవారీగా కూడా అసమానతలు గోచరిస్తున్నాయి. బీహార్‌లోని మధుబని జిల్లా 2006-2007 సంవత్సరంలో సగటున ఒకరోజు మాత్రమే పనిని కల్పించింది. అదే రాజస్థాన్‌లో దుంగాల్‌పూర్ 111 రోజులు ఉపాధిని కల్పించింది.

వేతనాల విషయంలో చాలా ప్రాంతాలలో చట్టం నిర్దేశించిన కనీస వేతనాలు అమలు కావడం లేదు, గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేసే రాష్ట్రాలలో ముందంజలో ఉన్న రాజస్థాన్ కనీస వేతనాల విషయంలో వెనకబడింది. ఇక్కడ సగటున ఒక రోజుకు 53 రూపాయలు మాత్రమే వేతనంగా లభిస్తుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనాల విషయంలో కేరళ దేశంలోనే ముందంజలో ఉంది. ఇక్కడ పనికి డిమాండ్ తక్కువగా ఉండటం వల్ల అధిక సగటు వేతనాలు పొందగలుగుతున్నట్లు అవగతం అవుతుంది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని లబ్ధిదారులలో 1/3 వంతు మహిళ భాగస్వామ్యం ఉండాలని నిర్దేశించారు. కాని దేశంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో దాదాపు 40% మహిళలు భాగస్వామ్యం వహిస్తున్నట్లు అమర్త్యసేన్, మరియు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వెబ్‌సైట్ వెల్లడిస్తున్నాయి. కాని మహిళల భాగస్వామ్యం విషయంలో కూడా చాలా అసమానతలు ఉన్నాయి. దేశంలో అత్యధికంగా తమిళనాడుకు 81% మందికి ఉపాధిని కలిగించగా ఆంధ్రప్రదేశ్‌లో 53%, హిమాచల్‌ప్రదేశ్‌లో 12%, ఉత్తరప్రదేశ్‌లో 17%, జమ్ముకాశ్మీర్‌లో 4% మహిళల భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తుంది. అదే విధంగా తమిళనాడులోని అన్ని జిల్లాలలో దాదాపు 80% మహిళలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగస్వామ్యులు అవుతున్నారు. కాని ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో మహిళలు 1% మాత్రమే పరిమితం అయ్యింది. జాతీయ గ్రామీణ హామీ పథకం ద్వారా జరిగే పనులలో యంత్రాలకు, కాంట్రాక్టర్లకు అవకాశం లేకుండా దాదాపు 60% పనిని కార్మికులతోనే చేయించాలి. కాని ఈ విషయంలో కూడా రాష్ట్రాల వారీగా అసమానతలు ఉన్నాయి. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 98% పనులను కార్మికుల భాగస్వామ్యంతో చేస్తుండగా హిమాచల్‌ప్రదేశ్‌లో 52% మాత్రమే కార్మికుల భాగస్వామ్యం కల్పిస్తున్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజల ఆర్థిక భద్రతకు అవకాశం కలిగింది. వ్యవసాయ వేతనాలను పెంచడానికి, మహిళల సామాజిక భద్రతకు, సాధికారతకు అవకాశం కలిగింది. గ్రామీణ ప్రాంతాలలో వలసలు నిరోధించ గలిగింది. గ్రామీణ ప్రాంత పేదలకు పని కల్పన హక్కుగా మారింది. గ్రామీణ పేదరిక నిర్మూలనకు దోహదం చేసింది. ఈ పథకం కింద ఉత్పాదక ఆస్తులను పెంచగలిగింది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమం ద్వారా చెరువులను చేపట్టి ఎక్కువ భూమిని శాశ్వత సాగులోకి తెచ్చింది.

**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో స్త్రీల ప్రాముఖ్యత**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో స్త్రీ, పురుషులకు పనిలో సమానవేతనాలను ఇవ్వడం ద్వారా మహిళల సాధికారతకు ఇది తోడ్పడిందని చెప్పవచ్చు. ఈ పథకంలో దాదాపు 1/3 వంతు మహిళల భాగస్వామ్యం కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కాని ఈ పథకంలో మహిళలకు కేటాయించిన ప్రత్యేక సదుపాయాలవల్ల మొత్తం పథకంలో దేశవ్యాప్తంగా సగటున 40% మంది మహిళలు ఇందులో భాగస్వామ్యం వహించినట్లు తెలుస్తుంది. దానిని బట్టి దేశంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనేది మహిళల సాధికారికతకు దోహదం చేస్తుందనడంలో సందేహించవలసిన అవసరం లేదు. అయితే ఈ మహిళా భాగస్వామ్యంలో దేశవ్యాప్తంగా రాష్ట్రాల మధ్య కొన్ని అసమానతలు కనిపిస్తాయి. దేశంలోని తమిళనాడు రాష్ట్రం అత్యధికంగా 51% మహిళలకు భాగస్వామ్యం వహిస్తున్నట్లుగా తెలుస్తుంది. కాని ఉత్తరప్రదేశ్‌లోని ఐదు జిల్లాల్లో మహిళల భాగస్వామ్యం 1% శాతానికి మాత్రమే పరిమితమైంది. ఏది ఏమైనప్పటికీ, దేశంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనేది సాధికారత విశేషంగా కృషి చేస్తుందనడంలో సందేహం లేదు. దీనికి ప్రధాన కారణం పురుషులతో సమానంగా ఒకే పనికి సమాన వేతనాలను స్త్రీలకు ఇవ్వడం, ఖచ్చితంగా అమలు చేయడం ద్వారా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహిళా భాగస్వామ్యం పెరిగింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మొట్టమొదట 13 జిల్లాలో ప్రవేశపెట్టారు. 2006-2007 సంవత్సరం ఉమ్మడి రాష్ట్రంలో గ్రామీణ అభివృద్ధి నివేదిక ప్రకారం ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలో 50.6 లక్షల మందికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్డులు ఇవ్వడం జరిగింది. ఈ పథకం కింద 20.8 లక్షల కుటుంబాలు లబ్ధిపొందారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 680 కోట్లు వెచ్చించి 763 కోట్ల పనులను పూర్తి చేయడం జరిగింది. ఈ పనులలో 33.46 లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పించారు. ఇందులో 47% పురుషులు, 53% స్త్రీలకు, 0.8% వికలాంగులకు ఉపాధి చేకూరింది. రోజుకు సగటున 80.76 రూపాయల కూలీకి ఉపాధి హామీ పథకంలో అందుకోవడం జరిగింది. ఇది దేశంలో అత్యధిక కూలీ తీసుకున్న రాష్ట్రాలలో ఉమ్మడి ఆంధ్రరాష్ట్రం ఒకటి. మొత్తంగా చూస్తే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్ధవంతంగా వినియోగించుకున్న రాష్ట్రాలలో ఆంధ్రరాష్ట్రం కూడా ఒకటి.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఎంతో మందికి ఉపాధిని చేకూర్చిందని చెప్పవచ్చు. ఈ పథకాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలు కనుక సమర్ధవంతంగా వినియోగించుకుంటే ఆయా రాష్ట్రాలలో ప్రజానీకానికి ఉపాధిని అందించడమే కాకుండా వలసలను నివారించేందుకు అవకాశం ఉంటుంది.

**సి. కృష్ణారావు**
**తెలుగు అకాడమి**

# పంచాయతీ వ్యవస్థలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు తీరు

**భా**రతదేశ పాలనలో ముఖ్యంగా గ్రామ పంచాయతీ వ్యవస్థలలో 73వ రాజ్యాంగ సవరణను అనుసరించి పాలకవర్గంలో సగం సీట్లను మహిళలకు కేటాయించారు. ఈ చట్టాన్ని అమలు చేస్తున్న దక్షిణ దేశ రాష్ట్రాలు తూ.చ. తప్పకుండా మహిళలకు ముఖ్యంగా గ్రామ పంచాయతీ అధ్యక్షులుగా సగం సీట్లను మహిళలకు కేటాయించారు. మొత్తం 2,38,682 గ్రామ పంచాయతీలలో సగం 1,19,341 పంచాయతీలు మహిళలకు రిజర్వ్ చేశారు. అదే రీతిలో బ్లాకు స్థాయిలో నున్న సమతులలో 96,000 సీట్లును మహిళలకు 448 జిల్లాల్లో 224 జిల్లా పరిషత్‌లను మహిళలకు కేటాయించారు. దానితో దేశంలో గ్రామ పంచాయతీ అధ్యక్షులుగాను, బ్లాక్ అధ్యక్షులుగా పోటీ చేసే మహిళల కొరత ఏర్పడింది. మహిళలు అందరు పోటీ చేయరు. చేసిన మహిళల వెనుక పురుషులుంటారు. మహిళలు గెలిస్తే వారి భర్తలు, మామలు, మరదులు మహిళల పేరు మీద పెత్తనం చెలాయిస్తున్నారు. అంటే ఏ లక్ష్యంతోనైతే ఆడవారికి సీట్లు కేటాయించారో ఆలక్ష్యం దెబ్బతింటుంది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి 23 జిల్లాలు అయితే 11 జిల్లా పరిషత్‌లు ఆడవారికి చూపించి కేటాయించారు. కాని రాజకీయ పార్టీలకు మహిళలను తెచ్చి పోటీకి నిలబడవలెనంటే అభ్యర్థులు దొరకక భర్తలను ఒప్పించి పార్టీల అభ్యర్థులుగా భార్యలను పోటీకి దింపటం జరిగింది. ఏ పార్టీకి మహిళ అభ్యర్థులు కొరత ఉంటే ఆ పార్టీ ఊర్ల నుండి రప్పించి పోటీ చేశారు. లోక్‌సభలో వలె మహిళలకు పంచాయతీ సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలని సూచించింది. 1992లో చేసిన 73 రాజ్యాంగ సవరణ ప్రకారం రాష్ట్రాలకు తప్పక ప్రత్యేకం ఆర్థిక సంఘంను ఏర్పాటు చేసుకోవాలి. 2. నిధులు ప్రత్యక్షంగా గ్రామ అధ్యక్షులుకు చేరునట్లు చేయడం వలన 3. మహిళలకు 33% రిజర్వేషన్లు సీట్లు కేటాయించారు. వార్డు మెంబర్లులలో కూడా మహిళలకు సగం ప్రాతినిధ్యం కల్పించబడింది. 4. స్వంతంగా ప్రతి రాష్ట్రం ఎన్నికల కమీషన్‌ను ఏర్పాటు చేసుకొనడం, తద్వారా స్థానిక పరిపాలనను బలోపేతం చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. అదే విధంగా నిధులు రాష్ట్ర స్థాయి నుండి క్రింది స్థాయి వరకు స్వేచ్ఛగా చేరుటకు అవకాశం కలుగుతుంది. ఇవి అన్ని చేయుట ద్వారా రాష్ట్రాలకు కేంద్రం నుండి వచ్చే మ్యాచింగ్ గ్రాంటులు అందెందుకు ఎక్కువ ఆస్కారం ఉంటుంది. దేశ జనాభాలో సగం పైగా వున్న మహిళలకు కూడా పాలనలో భాగస్వామ్యం కల్పించినట్లవుతుంది. 2005లో మొదలైన సమాచార హక్కు చట్టం మరియు పనిని పొందే పనిహక్కు చట్టం 2005. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2005 నుండి అమలు చేస్తున్నారు. కనుక ఈ పనులలో మహిళలను భాగస్వాములుగా చేసి కుటుంబంలో ఒకరికి సంవత్సరం 100 రోజులు పనిదినాలు కల్పించడం ద్వారా కుటుంబానికి జీవన భృతితోపాటు పనికొరకు వేరే ప్రదేశాలకు వెళ్ళకుండా గ్రామంలోనే నిలబెట్టేందుకు ఈ ఉపాధి హామీ పథకం కార్యక్రమం ఎంతోగానో తోడ్పడింది.



గ్రామ పంచాయతీలలో సగం సీట్లు మహిళలకు కేటాయించుట వలన బాధ్యతాయుతంగా పనిచేయుటకు అవకాశం ఉంటుంది. ఉదా: తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థలలో గ్రామపంచాయతీలు 8,695 ఉంటే 4,348 సీట్లు అధ్యక్ష పదవులలో మహిళలను ఎన్నుకొన్నారు. వార్డు సభ్యులు 87,874 ఉంటే అందులో 43,837 మంది మహిళా వార్డు మెంబర్లుంటారు. మండల ప్రజాపరిషత్‌ల్లో 438 ఉంటే 219 మంది మహిలలు. ఎంపిటిసిలు 6141 మంది కాగా 3,060 మంది మహిళలు ఎంపిటిసిలు. జిల్లా పరిషత్‌లు 9 అయితే నలుగురు మహిళా జిల్లా పరిషత్ అధ్యక్షులు అయ్యారు. (వీరిలో కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, వరంగల్) మహిళలున్నారు. జడ్‌పిటిసిలు 438 ఉంటే 219 మంది మహిళ ప్రతినిధులను ఎంపిక చేశారు. ఆ విధంగా మహిళా ప్రాతినిధ్యం పెరుగుట వలన కనీసం ప్రాతినిధ్యం వహిస్తున్న కుటుంబాలు ఆర్థిక స్థితి మెరుగుపడుటకు మంచి అవకాశం కలుగుతుంది.

అదే విధంగా దేశవ్యాప్తంగా పార్లమెంటు ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభలో 62 మంది మహిళా ఎంపిలు 2014 ఎన్నికలలో గెలిచారు. దేశంలో మహిళా ప్రాతినిధ్యం వలన ముఖ్యమంత్రులు టిఎంసి నాయకురాలు మమత బెనర్జీ ముఖ్యమంత్రి అయ్యింది. తమిళనాడు ముఖ్యమంత్రిగా జయలలిత, రాజస్థాన్ ముఖ్యమంత్రిగా వసుంధరరాజే సింధియాలు ముఖ్యమంత్రుల య్యారు.

మహిళను పరోక్షంగా సివిల్ సర్వీసులలో ప్రోత్సహించుట వలన 33% మహిళలను యుపిఎస్‌సి సెలక్షన్‌లతో తీసుకొనడం జరుగుతుంది.

మహిళలు రాజకీయాలు చేయడం ఉన్నత స్థాయిలలో పెద్ద బేధాలు రావు. మధ్య స్థాయిలో తమ పనిని సమర్థవంతంగా నిర్వహించి రావడం ఇబ్బందికరంగా పరిణమిస్తుంది. గ్రామ పంచాయతీ సర్పంచ్‌లను తీసుకొంటే సగం మంది 50%లో దాదాపు 28% విద్యలేనివారు. నిశాని చేయువారు. వీరినందరిని సమన్వయ పరచటం చాలా ఇబ్బందులతో కూడినది. అదేకాక నిరక్షరాస్యులైన సర్పంచ్‌లు తమ జాగ్రత్తలో ఉంటారు.

ఆమెకు చెక్కు పవర్ లక్ష రూపాయలు ఖర్చు చేయడం భర్తల సహాయం తీసుకొంటారు. అందువలన స్థానికంగా గ్రామ రాజకీయాలలో ప్రాతినిధ్యం వస్తుంది.

కనుక స్థానిక మహిళా ప్రతినిధులు పని చేయవలెనన్న వారు పురుషుల మద్దతు తప్పనిసరి. ఈ నేపథ్యంలో మహిళా కుటుంబాలైన తమ పదవులతో పరిపుష్టి సంపాదించుకొని ముందుకు సాగుతాయని ఆశించటం తప్పులేదు. ఎంత కాలం పురుషుల చాటున మహిళలు బ్రతుకు వారిని విముక్తి చేసుకొనుటలో మోడి లోక్‌సభలో అధిక మెజారిటీ ఉంది కనుక మహిళా రిజర్వేషన్ల బిల్లు లోక్‌సభలో పాస్ అవుతుందని ఆశించవచ్చును.

**డాక్టర్ కె.ఆసయ్య**

# సమాచార హక్కు చట్టంలో పౌర హక్కులు

సమాచార హక్కు చట్టం - 2005లోని 6వ చాప్టర్‌లో 31 సెక్షన్లు పొందుపర్చి ఉన్నాయి. సాధారణంగా సమాచార హక్కు చట్టం - 2005 ద్వారా పౌరులకు కల్పించిన హక్కులు ఏమటి అని ప్రశ్నించుకుంటే ఎవరైనా ఒకే సమాధానం చెపుతారు. పౌరులకు సమాచారం పొందే హక్కు కల్పించబడినది.

కాని సమాచార హక్కు చట్టంలోని 31 సెక్షన్‌లలో దాదాపుగా 26 హక్కులు కల్పించటం జరిగింది. ఈ హక్కులపై ప్రజాసమాచార అధికారులకు, అప్పిలేటి అధికారులకు, పౌరులకు సరైన అవగాహన కల్పించడానికే సమాచార హక్కు చట్టం - 2005 లోని పౌర హక్కుల గురించి ఈ వ్యాసాన్ని ఉద్దేశించడం జరిగింది.

పౌరులకు సమాచార హక్కు చట్టం - 2005 కల్పించిన హక్కులు సెక్షన్ 2 నుండి 20 వరకు

1. పౌరులు స్థల పరిశీలన కోరే హక్కు-సెక్షన్ 2 ప్రకారం.
2. సమాచార హక్కు చట్టంలోని నిబంధనలకు లోబడి సెక్షన్ (3) ప్రకారం పౌరులందరికీ సమాచారం తెలుసుకునే హక్కు కల్పించటం జరిగింది.
3. సెక్షన్ 6 (1) ప్రకారం ప్రజా సమాచార అధికారికి దరఖాస్తు చేసుకునే హక్కు కల్పించారు.
4. పౌరులకు తెలిసిన స్థానిక భాషలో దరఖాస్తు రాసుకునే హక్కు సెక్షన్ 6 (1).
5. స్థానిక భాషలో సమాచారం అందించాలని కోరే హక్కు - సెక్షన్ 6 (2)
6. దారిద్ర్య రేఖ దిగువన ఉన్నవారు దరఖాస్తు ఫీజు నుండి మినహాయింపు కోరే హక్కు సెక్షన్ 7(5).
7. దరఖాస్తుదారు చదువురాని వారైతే పౌరుడు చెప్పే అంశాన్ని దరఖాస్తు రూపంలో రాయమని ప్రజా సమాచార అధికారిని కోరే హక్కు 6 (1) (బి).
8. పౌరులకు కావలసిన సమాచారం ఎందుకోసం అనే కారణాలు చెప్పనవసరం లేకుండా ఉండే హక్కు సెక్షన్ 6 (2)
9. తను సంప్రదించిన ప్రజా సమాచార అధికారి వద్ద సమాచారం లేనట్లయితే, ఆ సమాచారం ఎక్కడ లభ్యమవుతుందో, అక్కడికి దరఖాస్తు బదిలీ చేయమని కోరే హక్కు 6 (3) (2).
10. ప్రజా సమాచార అధికారి సమాచారం ఇవ్వడానికి తిరస్కరిస్తే ఎందుకు తిరస్కరిస్తున్నారో కారణాలు అడిగే హక్కు సెక్షన్ 7 (2).
11. సమాచారం పొందడానికి కావలసిన సహాయం చేయమని పౌర సమాచార అధికారిని కోరే హక్కు 7 (4).
12. తమ కోరిన సమాచారానికి ఎంత డబ్బు చెల్లించాలో దాని వివరాలు తెలపాలని కోరే హక్కు 7 (3).
13. సమాచారాని అయ్యే ఖర్చును సమాచారాన్ని తగిన సమయంలో సమకూర్చని పక్షంలో రద్దు చేయమని కోరే హక్కు 7 (5).
14. ప్రజా సమాచార అధికారి సమాచారం ఇవ్వలేని పక్షంలో కారణాలు తెలపాలని కోరే హక్కు 7 (8).
15. సమాచారానికి అయ్యే ఖర్చు మదింపు సక్రమంగా లేదనిపించినప్పుడు, అట్టి మదింపును పున:పరిశీలన చేయమని కోరే హక్కు 7 (4).
16. ఒక వేళ సంతృప్తికర సమాచారం పొందలేనప్పుడు అప్పీలకు ఎలా వెళ్ళాలి అనే వివరాలు పొందే హక్కు 7 (8).
17. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు తమ సమాచారం కోసం అయ్యే ఖర్చు భరించలేమని తొలగించమని అడిగే హక్కు 7 (6).
18. ఏదైన సమాచారం మొత్తం ఇవ్వలేప్పుడు ఇవ్వదగిన సగం సమాచారం ఇస్తూ మిగిలిన సమాచారం ఎందుకు ఇవ్వలేకపోతున్నారో కారణాలను తెలుసుకునే అధికారం 10 (ఇ).
19. మూడవ వ్యక్తికి సంబంధించిన సమాచారం కోరే హక్కు 10(ఇ).
20 సమాచారం ఇవ్వనందుకు ఫిర్యాదు చేసే అధికారం / కంప్లైయింట్ 18 (1).
21. మొదటి అప్పీలు (అప్పిలేట్ అధికారికి) చేసే హక్కు 19(1)
22. రెండవ అప్పీలును రాష్ట్ర సమాచార కమీషనర్ గారికి చేసే హక్కు 19 (3).
23. ప్రజా సమాచార అధికారికి జరిమానా వేయమని కోరే హక్కు 20 (1).
24. ప్రజా సమాచార అధికారి తగిన రీతిలో స్పందించనప్పుడు, ఆ వ్యక్తిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరే హక్కు 20 (2).
25. సమాచారాన్ని స్థానిక భాషలోగాని / ఎలక్ట్రానిక్ రూపంలో గాని ఇవ్వమని కోరే హక్కు 19 (8).
26. నష్టపరిహారాన్ని పొందే హక్కు 19 (8).

పై విధంగా సమాచారా హక్కు చట్టం - 2005లో సెక్షన్ 2 నుండి 20 వరకు పౌరులకు 26 హక్కులను కల్పించారు. వీటి ద్వారా పౌరులు తమకు కావలసిన సమాచారం పొందడంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, పై హక్కుల ద్వారా ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించి, పౌర సేవల మెరుగుదలకు దోహదం చేస్తారని ఆశిద్దాం.

**టిసిపార్థు**

# విద్యావిధానంపై
# డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ విజన్



**వి**ద్యార్థులు గురువులను గౌరవిస్తారు. గురువులు తమ విధి నిర్వహణలో మరింత అభివృద్ధి బాటలను ఏర్పరచుకుంటున్నారు. గురువు నిగర్వంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి.

రాధాకృష్ణగారు స్కూలు టీచరుగా ప్రారంభించి, కాలేజి లెక్చరరుగా, ప్రొఫెసరుగా పని చేశారు. ఆంధ్ర, కాశీ, కోల్‌కత్తా విశ్వవిద్యాలయాలకు కులపతిగా వ్యవహరించారు. ఇంగ్లాండులోని ఆక్స్‌ఫర్డు యూనివర్శిటీవారు వీరిని ఇండియన్ ఫిలాసఫీలో విజిటింగ్ ప్రొఫెసరుగా ఆహ్వానించారు. ఈనాడు ఆక్స్‌ఫర్డు యూనివర్శిటీలో ఇండియన్ ఫిలాసఫీ ఒక ప్రత్యేకమైన విభాగంగా ఉంది. విద్యా రంగంలోను, రాజకీయ రంగంలోను ఎంత పెద్ద పదవులను అధిష్టించినా ఆయన ఆచార్య ప్రవృత్తిలో మార్పులేదు. నిరంతరం గ్రంథపఠనం, బోధించుటం, రచించటం ఆయన జీవన విధానం, ఆయన విషయ పరిజ్ఞానం, భాషాపటుత్వం అపారం. చదివిన దానిని యధాతథంగా స్వీకరించక దానిని తార్కికంగా ఆలోచించటం ఆయన అలవాటు.

రాధాకృష్ణ బ్రిటీష్ పరిపాలనా కాలంలో క్రైస్తవ మిషనరీ స్కూల్‌లో చదువుకొని క్రైస్తవ మతబోధనలను విన్నారు. ఒక కాలంలో క్రైస్తవ మిషనరీలు హిందూమతంలోని లోపాలను ఎత్తిచూపి, ప్రజలకు క్రైస్తవమతమే శరణ్యమనీ, అదే క్షేమకరమనీ బోధించారు. ఈ పరిస్థితి రాధాకృష్ణగారిని ఆలోచింపచేసింది. జ్ఞానపిపాసతో ఆయన ఒక వేద పండితుని వద్దకు వెళ్ళి ఉపనిషత్తులను, వైదికమత ఆంతర్యాన్ని తెలుపమన్నారు. హిందూ మతాన్ని క్రైస్తవమతాన్ని పోల్చి వాటి సామ్యాలను చూపి పరిశోధనా వ్యాసాన్ని సమర్పించారు. రాధాకృష్ణ ఇండియన్ ఫిలాసఫీ అధ్యాపకునిగా ఉన్నంత మాత్రాన మతబోధన ఆయన వ్యక్తిగత వ్యాపారం కాదు. భగవంతుని విగ్రహారాధనం, యాగాలు వ్రతాలు బాహ్యకార్యక్రమాలపై ఆయన ఆసక్తి చూపలేదు. ఏదో ఒక మహత్తరమయిన శక్తి తన వెంట ఉన్నట్లు, మానవతీతమైన ఆ శక్తి తన జీవితాన్ని నిర్దేశిస్తున్న భావన ఆయనకు కలిగేదని చెప్పుకున్నారు. రాధాకృష్ణన్‌గారు పదవి మీద ఆసక్తితో రాజకీయాలలో ప్రవేశించలేదు. భారత స్వాతంత్ర్య సముపార్జన తరువాత ప్రధానమంత్రి అయిన జవహరలాల్ నెహ్రూ ఆయనను సద్గురువుగా గౌరవించి కేంద్రానికి ఆహ్వానించి 'ఉపరాష్ట్రపతి'గా నియమించారు. రెండుసార్లు ఉపరాష్ట్రపతిగా వ్యవహరించి 1960లో ఆయన రాష్ట్రపతి పదవిని అలంకరించారు. గ్రీకు తత్వవేత్త అయిన ప్లేటో వాక్యాలు " Humanity will not see better days until either philosphers become a those who in power been bhilosbhai స్మరించుకోదగినవి.

భారత రాజ్యాంగం బ్రిటిష్ పార్లమెంటరీ విధానాన్ని అనుసరించి, పరిపాలనలో ప్రధాన మంత్రి ఆధిక్యత వచ్చింది. అధ్యక్షుడు నామమాత్ర అధికారాలతో కేవలం సలహాదారునిగా మాత్రమే వ్యవహరించవలసి ఉంది. కాని రాధాకృష్ణ నెహ్రూగార్ల సంబంధం గురుశిష్య సంబంధంగా సాగింది. పరిపాలనలో క్లిష్ట సమస్యలు ఎదురయినప్పుడు గురువుగారే సామరస్య పరిష్కారాన్ని సూచించేవారని వారి అంతరంగికులకు మాత్రమే తెలుసు. బాహ్యంగా రాధాకృష్ణగారు రాజ్యాంగ విధానానికి అనుగుణంగా తన పరిధిలోనే మాట్లాడేవారు. నెహ్రూ పరిపాలించినంతవరకు రాధాకృష్ణగారు రాజగురువే.

ప్రపంచ రాజకీయాలలో అమెరికా కాపిటిలిజాన్ని, రష్యా కమ్యూనిజాన్ని రాధాకృష్ణన్ సంయమనంతో సంధానపరచారు. భారతదేశం స్వతంత్ర రాజ్యమయినప్పటికీ బ్రిటిష్ కామన్ వెల్తులో సభ్యత్వమున్నది. బీద ప్రజలకు ఆహారపదార్థాలను సహాయంగా తీసుకున్నాము. అయితే భారతదేశం ఇంగ్లాండు, అమెరికాలవంటి కాపిటలిస్టు దేశాలతో కుమ్మక్కయి కమ్యూనిజాన్ని అణచివేస్తున్నారని రష్యా అపవాదు వేసింది. ఆ సమయంలో నెహ్రూగారు తన చెల్లెలైన విజయలక్ష్మీ పండిట్‌ని రాయబారిగా పంపారు. అక్కడకు వెళ్లిన తరువాత ఆమె అమెరికన్లతో స్నేహపూరితంగా మెలగటం చూసి, భారతదేశం అమెరికా కూటమికి చెందినట్లుగా కమ్యూనిస్టు రష్యా అపోహపడి శతృత్వాన్ని పెంచుకున్నారు. అమెరికా రష్యాలు కక్షతో ద్వేషంతో రగిలిపోయినాయి. అటువంటి క్లిష్టపరిస్థితులలో నెహ్రూ రాధాకృష్ణన్‌ను రాయబారిగా పంపారు.

రాధాకృష్ణన్ అంతకు ముందెప్పుడూ రష్యాను దర్శించలేదు. ఆయన మొదటి ఉపన్యాసంతోనే అక్కడి ప్రజలను అధ్యక్షుణ్ణి కూడా ఆకట్టుకున్నారు. భారతదేశం అవలంబిస్తున్న స్వతంత్ర అలీన విధానాన్ని సిద్ధాంతం ప్రకారం ప్రజల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచే ప్రయత్నం చేస్తున్నవనీ కానీ మార్క్సిజం పేరిట సాంఘిక విప్లవాన్ని రేకెత్తించే, హింసాకాండ తాను అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. ఆర్థికమార్పులను శాంతియుతంగా తీసుకొని రావటానికి భారతదేశం ప్రయత్నిస్తున్నపటికీ కమ్యూనిజం వలె వ్యక్తి స్వేచ్ఛాస్వాతంత్రాలను అరికట్టి మానసిక వికాసాన్ని (అణచివేస్తుందని) నిరోధిస్తుందని చెప్పారు. భారతదేశం స్వతంత్రదేశం, వ్యక్తి స్వాతంత్రాన్ని గౌరవిస్తుందని నిర్భయంగా చాటారు.

రాధాకృష్ణన్ మాస్కోలో మూడు సంవత్సరాలు ఉన్నారు. అక్కడి ప్రభుత్వం ఆయన చర్యలను అనుక్షణం కనిపెడుతూనే ఉండేది. ఆయన తన విధులను సక్రమంగా నిర్వహించి తన అతిథిగృహాన్ని చేరుకునే వారు. ఎప్పుడూ గ్రంథపఠనంలలో నిమగ్నమై ఉండే రాధాకృష్ణన్ పట్ల రష్యా అధ్యక్షుడయిన స్టాలిన్ ఆయన పట్ల గౌరవాభిమానాలను పెంచుకున్నారు. మూడు సంవత్సరాలు గడిచిన తరువాత రష్యా ఆయనకు సగౌరవంగా వీడ్కోలిచ్చినపుడు స్టాలిన్ లేచి స్వయంగా వచ్చి ఆత్మీయంగా కరచాలనం చేశారు.

మాస్కో నుండి వచ్చిన తరువాత రాధాకృష్ణన్ అమెరికాకు సంధానపరచటం కర్తవ్యమయింది. ఆయన అమెరికా అధ్యక్షుని దర్శించి "రష్యాకు మీ మీద ఏమాత్రం ద్వేషం లేదు. మీరు శక్తివంతులు. గనుక

వారి మీద మీరు దాడి చేస్తారేమోనన్న భయంతో ఉన్నారు. ఒక వేళ మీరు రష్యాతో యుద్ధానికి పాల్పడితే యూరపులోని అనేక దేశాలు రష్యాతో కలుస్తాయని తూర్పు, జైమక చైనా కూడా విజృంభించగలదని అమెరికాను జాగృతపరచారు. పరస్పర వ్యతిరేకతను పరిస్థితులను సమన్వయపరచారు. దీనిని బట్టి ఆయనకు గల రాజకీయ అవగాహన కౌశలాన్ని గ్రహించాలి. రాధాకృష్ణన్‌గారు అన్ని మతములను అధ్యయనం చేసి వానిలోని సారాంశాన్ని ఆకళింపు చేసుకున్న మహాజ్ఞాని. అన్ని మతాలలోని ఏకత్వాన్ని ఆయన దర్శించారు. అన్ని మతాల ధ్యేయమొకటేనని, మార్గాలు వేరయినా వారందరూ పరబ్రహ్మను చేరుకోవటమే అందరి ధ్యేయం. ఆ దివ్యదర్శనం తరువాత బాహ్య విషయాలకులకు ప్రాముఖ్యతనివ్వరని ఆయన అన్నారు. ఆయన అన్ని మతాలను అధ్యయనం చేసి, వాటి సారాంశాన్ని ఆకళింపు చేసుకున్నారు. ఆ అంశాలను కింద పేర్కొనడమైంది.

1. హిందూమతం అతి ప్రాచీనమయినది. దైవంతో సన్నిహిత ప్రత్యక్ష సాంగత్యమొందిన మహాపురుషులెందరో ఉన్నారు. మానవుని అంతరంగంలోని ఆత్మ, ప్రణవశక్తి ఒకటేనని ఉపనిషత్తులు చాటుతున్నాయి. సృష్టికర్త, సృష్టింపబడిన మానవుడు వేరు కాదు. వారు ఒకటే. మనిషిలోని ఆత్మ భగవంతుని అంశం.
2. క్రీ.శ. 6వ శతాబ్ధంలోనే తానో () అపర సత్యస్వరూపుడనీ తావోయే ప్రపంచాన్ని సృష్టించి నడిపిస్తున్నాడని చైనీయులు విశ్వసించారు.
3. హీబ్రూల విశ్వాసానుసరించి భగవంతుడు ప్రవక్తలకు ప్రత్యక్షమవుతాడు. పర్వతాలపైన మోజస్‌కు, గుహలలో ఎలిజాకు భగవంతుడు దర్శనమిచ్చాడు. మధ్యవర్తుల ద్వారానే ప్రజలు భగవంతుడిని చేరుకోగలరు.
4. గ్రీకు మతం తపస్సుతోనే దైవతాదాత్మ్యాన్ని పొందటం సాధ్యమవతుందన్నారు.
5. జొరాష్ట్రియన్ మతం : జూరాతుష్ట్రా రచించిన గథస్‌లో () విశ్వజనీనమయిన సత్యాలను వెలిబుచ్చారు. దుష్టభావాలు బయటనుండి రావు, అవి మానవుని మనస్సులోనే ఉత్పన్నమవుతాయి. మనిషి నడవడిపైననే అతని జీవితం ఆధారపడి ఉంటుంది. ప్రపంచాన్ని సృష్టించి ఆధిపత్యం వహించే పరమశక్తిని అతడు "ఆహార్‌మజ్దా" అని పేర్కొన్నాడు.
6. బౌద్ధమతం: జ్ఞానంతో మనం కోరికలను జయించగలిగితే బ్రహ్మం మీద మనసు నిలపగలం. మంచి నడివడియే నిర్మాణానికి మార్గం. ఉపనిషత్తులు తెలిపిన క్రతుకర్మలకంటే సత్ప్రవర్తనకే బుద్దుడు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చారు. మనసును నియంత్రించే సూత్రంపైనే బుద్ధుని ప్రబోధం నిలిచింది.
7. ఏసుక్రీస్తు వ్యక్తిగతమయిన అనువాలే ఉత్తమ జ్ఞానాన్ని తెలుపుతాయి. అతని వాక్కు నడవడిక భగవంతుని సాన్నిహిత్యాన్ని వ్యక్తపరుస్తుంది. మనిషి తన అంతరంగాన్ని మార్చుకోవాలని క్రీస్తు కోరాడు. అతను కృత్రిమ ఆకర్షణకు లోనుకాకుండా మనసును జయించాడు.
8. నాస్తికత: రష్యనులు దేవుళ్ళ విగ్రహాల పూజలు శుష్కమయినవి తిరస్కరించారు.
9. ఇస్లాం సూఫీమతం: ప్రపంచానికి అధినేత అయిన భగవంతుడిని పూచించడమే ఇస్లాం ముఖ్యసూత్రం. మహమ్మదు మహాజ్ఞాని. దివ్యదృష్టిగల ఒక తపస్వి. ఆ తాపస్వి రచించిన గ్రంథమే ఖురాను.

ఆల్‌హలల్ ప్రవచనం 'నేనేసత్యాన్ని' అనటం ఉపనిషత్తులోని వాక్కు 'అహం బ్రహ్మాస్మి' నేను బ్రహ్మను అనటమూ ఒకటే.

విలియకులా జీవిత పరమార్థానికి భగవంతుడిని ఆరాధించటమే మార్గం. యూదులకు ఒక దేవుడు, హెగెనులకు ఒక దేవుడులేడు. దేవుడొక్కడే. భగవంతుడిని చేరుకునే మార్గాలను బట్టి వివిధమయిన పేర్లు పెట్టుకున్నారు. 15వ శతాబ్దంలో హిందువులకు మహమ్మదీయులకు ఒక్కడే తండ్రి అని కబీర్ అన్నాడు.

కొంత మంది సిద్ధపురుషులు భగవంతుని ఆత్మక్షసాక్షాత్కారం పొంది తాదాత్మ్యాన్ని అనుభవించారు. వారి అనుభవాల పునాదులపైన ఏర్పరచుకున్నదే మతం. అటువంటి మహాయోగులు అన్ని మతాలలోను ఉన్నారు. వారే ప్రజలకు మార్గదర్శకులు అయినారు.

## జాతీయ అంతర్జాతీయ భావాలు

జాతీయతా భావం అప్రస్తుతమయినది. 1909లో మొదటి ప్రపంచ యుద్ధానంతరం వివిధ జాతులు ఏర్పరచుకున్న నానాజాతి సమితి విఫలమయింది. ఆర్థిక, వాణిజ్య సాంఘిక రంగాలలో అంతర్జాతీయతను సంతరించుకున్న నేటి ప్రపంచంలో జాతులు విడివిడిగా మనలేవు. పూర్వకాలంలో మతం కూడా జాతిపరంగా ఉండేది.

అసలయిన మతం ప్రపంచంలోని మనుష్యులందరికీ వర్తించాలి. అన్ని జాతులకు వర్తించాలి. జాతీయ విభజన ఈవిశాల దృక్పథాన్ని అంగీకరించటం లేదు. అమలుపరచడం లేదు. టెక్నాలజీని మంచికయినా చెడకయినా ఉపయోగించవచ్చు. పురోగమనమో అధ:పతనమో మన నిర్ణయంపైన ఆధారపడి ఉన్నది.

ప్రపంచం మారుతున్నది. కాలచక్రంలో మార్పు సహజమైన నేటి మతం ఈ పొద్దుకు తగినట్లుగా తనను తాను మార్చుకోవాలి. విద్య, విజ్ఞానం మతం పురాతనం శాస్త్రీయ చట్రంలో నుండి బటయపడి నూతన విధానంలోకి ప్రవేశించాలి. జాతీయత నుండి అంతర్జాతీయతను సంతరించుకోవాలి.

ప్రజలలోకి వెళ్లి వారిని సరయిన మార్గానికి మళ్లించే నేతలు కావాలి. విద్యావంతులు విద్యాపీఠాధిపతులు చేపట్టవలసిన ప్రణాళిక ఇది. అక్షరాస్యత మీదనే ప్రాముఖ్యతను ఇస్తున్నాము. కాని ధర్మాధర్మాలను పట్టించుకోవటం లేదు. మనకు ధర్మప్రేరణ కావాలి.

ఇతర దేశస్థులతోను, ఇతర మతస్తులతోను రాధాకృష్ణన్‌గారు వ్యవహరించే విధానం అత్యంత సంయమంతో కూడుకున్నది. విదేశీయ రాయబారులతో రాష్ట్రపతిగా ఆయన ఎంతో ఆదరంతో, స్నేహపూర్వకంగా వ్యవహరించేవారు.

పాశ్యాత్యులకు ఆయన అర్యతత్వాన్ని బోధించారు. భారతీయులకు పాశ్చాత్య వైజ్ఞానిక దృక్పథాన్ని, క్రియాత్మకమయిన ప్రగతిపథాన్ని తెలిపారు. భారతదేశం ఆర్ష్యపునాదులపై భావిప్రపంచానికి ఉపయుక్తంగా పురోగమించాలని రాధాకృష్ణన్ కోరుకున్నారు.

మనదవేశంలోని మతవిద్వేషాలకు సర్వేపల్లి నిరసన తెలిపారు. ఆయన అన్ని మతాలకు సభ్యుడే. సర్వమతాల్లో ఆంతర్యం ఒక్కటేనని మతాలపేరేదయినా, విగ్రహాల రూపుఏదయినా ప్రణవమొక్కటే. విజ్ఞులందరు సత్యాన్వేషణకు పూనుకుంటే వ్యక్తిగతమైన విద్వేషాలను మరిచిపోయి విశ్వమానవాళిలో భాగస్థులవుతారు.

ఆయన మానవతావాది. ఆర్షవిజ్ఞానాన్ని పుక్కటబట్టి శాంతిపతాకాన్ని చేతబట్టుకొని ఆయన దేశదేశాలు దర్శించి అక్కడి నేతలకు, ప్రజలకు జ్ఞానబోధ చేశారు. ఆర్షవిజ్ఞానాన్ని బోధించిన ఈ ఆచార్యుడు ఛాందసుడు కాదు. మతమంటే మనకున్న దక్పృథం ఆధునీకరింపబడాలని ఆయన ప్రబోధించాడు.

ఇంతటి మహామహోపాధ్యాయుని సదాస్మరించుకోవటం ఆవశ్యకం. ఆయన దృక్పథం, స్థానం, వ్యక్తిత్వం మనకు ఆదర్శం.

**ఎం.సుధాదేవి**

**తెలుగు అకాడమి**



# అభివృద్ధి అంతా భూమి చుట్టే..

**దేశంలో భూసేకరణ చట్టాలు**

ఆర్థిక వ్యవస్థ (వస్తు సేవలు) పెరుగుదలే ప్రజా సంక్షేమం. అంటే వస్తు సేవలను అందుబాటులో ఉంచినప్పుడే ప్రజా వినియోగం, నెలసరి తలసరి వినియోగ వ్యయం పెరిగి పేదరికం తగ్గుతుంది. తగ్గిన పేదరకం దాదాపు అన్ని ఆర్థిక సమస్యలను నిర్మూలిస్తుంది. అయితే అభివృద్ధిని పెంచడానికి సమస్యలను సృష్టించరాదు. ముఖ్యంగా ప్రాజెక్టుల పేరుతో ప్రజలను స్థానభ్రంశానికి గురి చేయరాదు.

- ప్రాజెక్టుల కోసం ప్రజలను వేరోచోటుకి తరలించాల్సి వస్తే వారికి 100 శాతం న్యాయం చేయాలి. గణాంకాల ప్రకారం దాదాపు 50 మిలియన్ల ఎకరాల భూమి, అంటే భారత భూభాగంలో 6 శాతం ప్రాజెక్టుల కోసం మళ్లించబడింది.
- దాదాపు 50 మిలియన్ల ప్రజలు స్థానభ్రంశానికి గురికావడం విచారకరం. బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన చట్టాలను పట్టుకొని వేలాడటం వల్ల (2013 వరకు) సమస్యలెన్నో తలెత్తాయి. ముఖ్యంగా
- సింగూర్ (Nano car)
- Posco (Steel Factory)
- యమున Express way
- Raigad Marchers
- Nandi Gram
- Maha Mumbai Sez

**1824 భూసేకరణ చట్టం**

దేశంలో మొట్టమొదటి భూసేకరణ చట్టం. దీన్నే Bengal Resolution of 1824గా పిలుస్తారు. ఈ చట్టం బెంగాల్ Provinceకు మాత్రమే వర్తిస్తూ రోడ్ల కోసం, కాల్వల కోసం, ఇతరత్రా ప్రజోపయోగం కోసం ప్రభుత్వభూమి సేకరించే అధికారం కలిగి ఉంటుందని చట్టం పేర్కొంది. ఈ చట్టం The Presidency of Fort William కు మాత్రమే వర్తిస్తుంది.

**1839 భూసేకరణ చట్టం**

బెంగాల్ భూసేకరణ చట్టం తరహాలో Bombay Presidency లో ప్రజోపయోగం కోసం 1839 భూసేకరణ చట్టం ప్రారంభమైంది. Bombay Presidency లో మహరాష్ట్ర, గుజరాత్, కర్ణాటక ఉన్నాయి. దీన్ని Building Act XVIII of 1839గా పేర్కొంటారు.

**1850 భూసేకరణ చట్టం**

మొత్తం కలకత్తాకు 1824 భూసేకరణ చట్టం వర్తించే విధంగా 1850లో మరొక చట్టాన్ని తీసుకొచ్చారు. Act of 1850 ప్రజా ఉపయోగం కోసం కలకత్తాలో ఎవరినుంచైనా భూమిని సేకరించే అధికారం ప్రభుత్వానికి కట్టబెట్టే చట్టమే ఈ 1850 భూ సేకరణ చట్టం.

**1854 భూసేకరణ చట్టం**

1852లో చేపట్టిన ఈ Presidency of Fort st George చట్టాన్ని 1854లో విస్తరించారు. ఈ చట్టం ఒక మద్రాస్‌కే కాకుండా మొత్తం తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, లక్షదీవులకు వర్తిస్తుంది.

**1852 భూసేకరణ చట్టం**

మద్రాస్‌కు సంబంధించి భూసేకరణ కోసం Act of xx 1852ను ప్రారంభించారు. ఇది Presidency of Fort st George కు వర్తించే చట్టం. ఇందులో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, లక్ష దీవులున్నాయి.

**1857 భూసేకరణ చట్టం**

మొత్తం బ్రిటిష్ ఇండియాకు సంబంధించే విధంగా భూసేకరణ చట్టాన్ని 1857లో తీసుకొచ్చారు. అంతకుముందు ఉన్న చట్టాన్ని రద్దు చేశారు. 1857 భూసేకరణ చట్టాన్ని 1861 Act II గా, 1861 Act II చట్టాన్ని 1863 Act XXII గా, చివరికి 1870 Act X గా సవరణ చేశారు.

**1870 భూసేకరణ చట్టం**

నష్టపరిహారం నచ్చకపోయినా, చట్టం నచ్చకపోయినా భూయజమానులు సివిల్ కోర్టుకు వెళ్లే అవకాశాన్ని ఈ చట్టం ద్వారా కల్పించారు. దీంతో కొంత వరకు 'Eminent Domain' ప్రాధాన్యం తగ్గినట్లు గమనించాలి. జిల్లా కలెక్టర్ భూయజమానుల మధ్య ఒప్పందం కుదరనప్పుడు సివిల్ కోర్టుకు వెళ్లే అధికారాన్ని ఈ చట్టం ఇస్తుంది.

- 1824 – మొదటి భూసేకరణ చట్టం
- 1857 – దేశం మొత్తానికి వర్తించే భూసేకరణ చట్టం
- 1870 – సివిల్ కోర్టులకు వెళ్లే అవకాశం కల్పించిన భూసేకరణ చట్టం

**1894 భూసేకరణ చట్టం**

హైదరాబాద్, మైసూర్, ట్రావెన్‌కోర్ కాకుండా మిగిలిన ప్రాంతాలకు వర్తించేవిధంగా 1894లో నూతన చట్టాన్ని (Act of 1894ను) తీసుకొచ్చారు. దీన్నే RajLaw గా పేర్కొంటారు. ఈ Raj Law 2013లో పూర్తిగా రద్దయింది. 1894 చట్టం పాకిస్థాన్‌లో కూడా అమల్లో ఉన్నది. ఈ చట్టం స్పష్టమైన భూయజమానులకు న్యాయబద్ధంగా నష్టపరిహారం ఇవ్వకుండా అడ్డుకుంటుంది. 1947 తర్వాత కూడా అంటే 2013 వరకు ఈ చట్టాన్ని పాటించారు. 1894 చట్టంతో భూయజమానులకు నష్టం జరిగింది. ముఖ్యంగా మార్కెట్ విలువకు సమానంగా నష్ట పరిహారం ఇచ్చిన సందర్భాలు లేవు. మార్కెట్ విలువలో కొద్ది మొత్తం (Fraction of the total Value) నష్టపరిహారంగా ఇచ్చేవారు. ఈ చట్ట ప్రకారం ప్రజోపయోగం కోసం ప్రభుత్వం

ఎవరినుంచైనా అంటే పేదవారి నుంచైనా, ధనికుల నుంచైనా, గ్రామాల నుంచైనా, పట్టణాల నుంచైనా, వ్యక్తులనుంచైనా, సంస్థల నుంచైనా భూమిని సేకరించే అధికారం ఉంటుంది.

1894 చట్టం ప్రకారం సేకరించాలనుకున్న భూమిని ప్రభుత్వం చట్టం ప్రకారం రెండు వార్తా పత్రికల్లో పేర్కొంటుంది. అందులో ఒకటి స్థానిక భాషలో ఉంటుంది. సందేహాలు కలిగినవారు 30 రోజుల్లో జిల్లా కలెక్టర్‌కు సందేహాన్ని తెలియజేస్తే కలెక్టర్ ఆ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తారు. ప్రభుత్వం నష్టపరిహారంలో మార్పులు చేయవచ్చు. ఒకవేళ భూయజమానికి ఒప్పందం నచ్చకపోతే కోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ ప్రజోపయోగం దృష్ట్యా , అత్యవసరం దృష్ట్యా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువడిన సందర్భాలే ఉన్నాయి. 1894 భూసేకరణ చట్టంలో జిల్లా కలెక్టర్‌కు విశేష అధికారాలుంటాయి. నష్ట పరిహారాన్ని నిర్ణయించే అధికారాలను కూడా ఆయనే కలిగి ఉండేవాడు. క్షణాల్లో నోటీస్ ద్వారా ఏ కుటుంబాన్నైనా స్థానభ్రంశానికి గురిచేయగలడు. ఈ చట్టంవల్ల రైతులు చాలా సందర్భాల్లో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. రైతులు తమకు తెలియకుండానే తమ భూముల ఆక్రమణ జరిగిపోయిందని పేర్కొన్న సందర్భాలెన్నో ఉన్నాయి.

**ఒకటో దశ**

కావాల్సిన భూమిని సేకరించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తుంది. ఈ విషయాన్ని రెండు పేపర్లలో వేస్తారు. అందులో ఒకటి స్థానిక భాషా పత్రిక. నోటిఫికేషన్లు ఇచ్చే పేపర్లు రెండూ స్థానిక పేపర్లు అయి ఉండాలి. అదేవిధంగా అధికారిక గెజిట్‌లో కూడా ముద్రిస్తారు.

**రెండో దశ**

నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ఎవరికైనా అభ్యంతరం ఉన్నట్లైతే 30 రోజుల్లో కలెక్టర్‌కు తమ అభ్యంతరాన్ని తెలియజేయాలి. దీన్ని U/S 4(1)లో పేర్కొన్నారు.

**మూడో దశ**

అభ్యంతరాలను కలెక్టర్ అందుకోగానే సరైన పరిశీలన చేసి ప్రభుత్వానికి పంపిస్తారు.

**నాలుగో దశ**

కలెక్టర్ నుంచి వచ్చిన అభ్యంతరాలను ప్రభుత్వం పరిశీలించి నష్టపరిహారంలో ఏదైనా మార్పులు చేయవచ్చు. అయితే భూమి సేకరణ అనేది ప్రజోపయోగం కోసం కాబట్టి ఆ విషయంలో మార్పు ఉండదు.

**ఐదో దశ**

ప్రభుత్వం కలెక్టర్ నుంచి పొందిన అభ్యంతరాలను నివృత్తి చేస్తూ డిక్లరేషన్ ఇస్తుంది. ఈ డిక్లరేషన్‌ను నోటిఫికేషన్ ఇచ్చిన ఏడాదిలో మళ్లీ రెండు స్థానిక పత్రికల్లో ముద్రిస్తారు. Gazette లో కూడా ప్రకటిస్తారు.

**ఆరో దశ**

డిక్లరేషన్ పేపర్ ప్రకటించిన తర్వాత ఎవరికైనా నష్టపరిహారంపై అభ్యంతరం ఉంటే కలెక్టర్‌కు తెలియజేయవచ్చు. ఈ విషయాన్ని పబ్లిక్ నోటీస్ ద్వారా ప్రకటిస్తారు.

**ఏడో దశ**

హైదరాబాద్, మైసూర్, ట్రావెన్‌కోర్‌లకు కాకుండా మిగిలిన ప్రాంతాల్లో డిక్లరేషన్ ఇచ్చిన రెండు నెలల్లో నష్టపరిహారం మంజూరవుతుంది. అంటే నోటిఫికేషన్‌కు డిక్లరేషన్‌కు 12 నెలల సమయం ఉంటే, డిక్లరేషన్‌కు నష్టపరిహారానికి రెండు నెలల వ్యవధి ఉంటుంది.

**ఎనిమిదో దశ**

నష్టపరిహారం ఇచ్చిన తర్వాత కలెక్టర్ భూమిని స్వాధీనం చేసుకుంటారు. అంటే భూమిని స్వాధీనం చేసుకోవడానికి మొత్తం 14 నెలల సమయం పడుతుందని 1894 LAA పేర్కొంది.

**తొమ్మిదో దశ**

కలెక్టర్ తరపున నష్టపరిహారం డిపాజిట్ చెయ్యకపోతే మొదటి ఏడాది సాలీన 9 శాతం, తర్వాత ఏడాదిలో సాలీన 15 శాతం వడ్డీ మంజూరవుతుంది.

**పదో దశ**

ఒకవేళ నష్టపరిహారం నచ్చకపోతే జిల్లా కోర్టును ఆశ్రయించవచ్చు. జిల్లా కోర్టు నష్టపరిహారాన్ని నిర్ణయిస్తుంది. కానీ గతంలో ఉన్న నష్టపరిహారం కంటే తక్కువ నిర్ణయించదు. నష్టపరిహారాన్ని 30 శాతం అదనంగా మార్కెట్ విలువకు చేర్చవచ్చు. అదేవిధంగా అదనంగా 12 శాతం కూడా చేర్చవచ్చు. ఈ 12 శాతం అదనపు నష్టపరిహారం నోటిఫికేషన్ నుంచి భూమిని కలెక్టర్ పొందేవరకు లేదా కలెక్టర్ నష్టపరిహారం ఇచ్చే వరకు వర్తిస్తుంది.

**1894 భూసేకరణ చట్టంలో ఇబ్బందులు**

నష్టపరిహారం ఎంత ఇవ్వాలనే ఒక పద్ధతిని ఎక్కడా పేర్కొనలేదు. Local bodies అయితే కోర్టుకు వెళ్లే అధికారం కూడా లేదు. ఒకవేళ అత్యవసరమని భావిస్తే ఎలాంటి పద్ధతి లేకుండా కలెక్టర్ భూమిని స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. కానీ అత్యవసరం అనే దానికి సరైన అర్థాన్ని మాత్రం ఎక్కడా పేర్కొనలేదు. అంటే కలెక్టర్ ప్రతి విషయాన్ని అత్యవసరంగా భావించి క్షణాల్లో భూములను లాక్కొనే అవకాశం ఈ చట్టం కల్పించింది. అందుకే దీన్ని Raj Law గా పేర్కొన్నారు. ఈ చట్టం ప్రకారం బాధితులకు భూమి విలువలో కొద్ది మొత్తం మాత్రమే నష్టపరిహారంగా ఇచ్చినట్లు సమాచారం. నష్టపరిహారం చెల్లించడంలో విపరీతమైన కాలయాపన కారణంగా ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు.

**1894 భూసేకరణ చట్టం -1947 అనంతరం**

1947 తర్వాత కూడా ఎన్నో లొసుగులున్న 1894 LAA ను కొనసాగించారు. ఈ చట్టాన్ని 2013 వరకు అమలు చేశారు. దీన్ని సమూలంగా మార్చి భూసేకరణలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తూ 2013లో Land Acquisition Rehabilitation and Resettlement (LARR) పేరుతో కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. దీనికి జైరాం రమేష్ అభినందనీయులు.

**భూసేకరణ చట్టం - హైదరాబాద్, మైసూర్, ట్రావెన్‌కోర్**


ఈ మూడు ప్రాంతాలకు 1894-1947 మధ్యలో సొంత భూసేకరణ చట్టాలు ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాలు తప్ప మొత్తం భారతదేశం 1894-1947 మధ్య 1894 LAA ను పాటించినట్లు గమనించాలి.

**1934 జమ్ముకశ్మీర్ భూసేకరణ చట్టం**

1934లో జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకంగా భూసేకరణ చట్టాన్ని తయారుచేశారు. దీన్ని State Land Acquistion Act (SLAA) గా పిలుస్తారు. 1900 నుంచి అందుబాటులో ఉన్న భూసేకరణ చట్టం 1934లో రద్దయింది.

**టిసిపార్టు**

# ప్రాణాయామం.. పెంచుతున్న ఆరోగ్యం



**శ్వా**స సంబంధిత వ్యాధులు మటుమాయం.. బీపీ, షుగర్, గుండె బాధితులకు సంజీవిని

ప్రాణాయామం మనిషికి క్రమపద్ధతిలో ప్రాణవాయువును అందిస్తూ ఆరోగ్యాన్ని రక్షిస్తోంది. సాధారణంగా ఒక మనిషి 500మి.లీ గాలిని మాత్రమే శ్వాసక్రియ ద్వారా తీసుకుంటాడు. కానీ మనిషిలోని ఊపిరితిత్తులు రెండున్నర లీటర్ల గాలిని తీసుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అంతేకాదు ఒక సంకల్పం, ప్రత్యేక పద్ధతిలో ప్రాణవాయువును పీల్చితే సుమారు 5లీటర్ల వరకు గాలిని తీసుకోవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాణాయామం అనేది యోగాభ్యాసంలో ఒక భాగం. యోగాసనాలతో పాటే ప్రాణాయామంలో కూడా పలురకాలు ఆసనాలు ఉన్నాయి.

**ప్రాణాయామంతో శరీరంలో కలిగే మార్పులు**

ప్రాణాయామం అంటే శ్వాసక్రియ ద్వారా ప్రాణవాయువు(ఆక్సిజన్)ను పీల్చడం అన్నమాట. శ్వాస క్రియద్వారా మనం పీల్చే గాలి పరిమాణం పెరిగితే జీవకణాలకు ఆక్సిజన్ ఎక్కువగా అందుతుంది. ఫలితంగా జీవకణాలు శక్తివంతమవుతాయి. జీవకణాలు శక్తివంతమైతే ఇక మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో వర్ధిల్లుతాడని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. ప్రాణాయామం ద్వారా కేవలం గాలిపరిమాణం, ఆక్సిజన్ పెరగడమే కాకుండా కండరాలు పటిష్టమవుతాయి. ప్రాణాయామానికి తోడు శరీరంలోని భాగాలను పైకి, కిందకు కదిలించడం వల్ల అవికూడా శక్తివంతమవుతాయి.

**ప్రాథమిక ఆసనాలు**

ప్రాణాయామ ఆసనాలు చాలా రకాలు ఉన్నట్లు ప్రాణాయామ యోగా అభ్యాసకులు పేర్కొంటున్నారు. అయితే వీటిలో ప్రధానమైన ఐదింటి గురించి సికింద్రాబాద్ ప్రభుత్వ ప్రాణాయామ కేంద్రంలో పనిచేస్తున్న యోగా అధ్యాపకులు ఎం.మురళీకృష్ణ తెలిపారు. సుఖ ప్రాణాయామం, నాడీ శోధన ప్రాణాయామం, సూర్య, చంద్రభేద ప్రాణాయామం, శీతలి ప్రాణాయామం, శిత్కారి ప్రాణాయామం.

**సుఖ ప్రాణాయామం**

ఇది శరీరాన్ని ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా సుఖవంతంగా చేసే ప్రాణాయామం. దీనినే అనులోమ, వినులోమ ప్రాణాయామం అనికూడా అంటారు. ముక్కు కుడి నాసిక రంధ్రాన్ని బొటనవేలుతో మూసి ఎడమ నాసిక రంధ్రంతో గాలి పీల్చాలి. అలాగే ఎడమ పక్కన నాసిక రంధ్రం గుండా చేయాలి. ప్రాణాయామం చేయడం వల్ల ఆస్తమా, శ్వాస సంబంధిత సమస్యలు తీరడంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుంది. ఈ ప్రాణాయామం వల్ల గుండెకు కూడా మంచిదన్నారు.

**నాడీశోధన...**

ఈ ప్రాణాయామం 1:2 నిష్పత్తిలో చేయాల్సి ఉంటుందన్నారు. అంటే సుఖ ప్రాణాయామం మాదిరిగానే గాలిని పీల్చి ఒక నాసికా రంధ్రంతో వదలాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ పీల్చే గాలి సమయానికి వదిలే గాలి సమయానికి తేడా ఉంటుంది. 10సెకెన్ల పాటు గాలిని పీల్చితే ఆ గాలిని 20సెకన్ల పాటు బయటకు వదలాల్సి ఉంటుంది. ఈ ప్రాణాయామం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది.

**సూర్య, చంద్రభేద...**

ఈ ప్రాణాయామంలో కుడి నాసికా రంధ్రం నుంచి గాలి పీల్చి అదే రంధ్రం నుంచి గాలి వదలాల్సి ఉంటుంది. తర్వాత ఎడమ నాసికా రంధ్రం నుంచి పీల్చి అదే రంధ్రం నుంచి వదలాలి. ఈ పద్ధతి వల్ల శరీరంలోని ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు తగ్గి సమతుల్యత ఏర్పడుతుంది. దీనివల్ల శరీరంలో ఉష్ణతాపం తగ్గి శరీరం చల్లబడుతుంది.

**శీతలి...**

వేసవిలో అత్యంత ఉపయుక్తమైన ప్రాణాయామం ఇది. ఈ పద్ధతి వల్ల వడదెబ్బ, రక్తపోటు, కళ్లమంట తగ్గుతుంది. ఇందులో నాలుక బయటకు చాచి మడతపెట్టి, సీ శబ్ధంతో నోటిద్వారా గాలిని పీల్చాలి. అనంతరం నోటిని మూసి రెండు నాసికా రంధ్రాల ద్వారా గాలిని బయటకు వదలాలి. ఇలా చేయడం వల్ల శరీరంలోని ఉష్ణతాపం తగ్గి, వడదెబ్బ నుంచి ఉపశమనం కలుగుతుంది.


**శిత్కారీ...**

నాలుక బయటకు చాచి, మడత పెట్టలేని వారి కోసమే ఈ శిత్కారీ ప్రాణాయామం. ఇందులో నోరు తెరిచి, దంతాలు గట్టిగా బిగుసుపట్టి దంతాల మధ్య నుంచి గాలిని సీ శబ్ధంతో పీల్చాలి. అనంతరం నోటిని మూసి రెండు నాసికా రంధ్రాల ద్వారా గాలిని బయటకు వదలాలి. వీటితో పాటు పలు రకాలు ప్రాణాయామాలతో తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని మురళీ తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో పెద్దలు కూడా కొంత తీరికగానే ఉంటారని ఈ సమయంలో పిల్లలు, పెద్దలు ప్రాణాయామం నేర్చుకోవడం ఉత్తమమని ఆయన సూచించారు.

**ఎక్కడ నేర్పిస్తారు**

సికింద్రాబాద్‌లోని మార్కెట్ రోడ్డు, పాస్‌పోర్ట్ కార్యాలయం వెనుక భాగంలోనే ప్రభుత్వ ప్రాణాయామ అధ్యయన కేంద్రం ఉంది. ప్రతీ నెల రూ.50 నామమాత్రపు ఫీజుతో అక్కడ ప్రాణాయామం నేర్చుకోవచ్చు. ఉదయం, సాయంత్రం సమయాల్లో అక్కడ ప్రాణాయామం నేర్పిస్తారు.

# జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ (జెడ్‌పిసి) సభ్యుల విధులు - అధికారాలు



ఏ స్థాయిలో జరగాల్సిన పనులు ఆ స్థాయిలోనే జరగడానికి వీలుగా పంచాయితీ రాజ్ లో మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేసి, ఆయా సంస్థలకు నేరుగా సభ్యులను ఎన్నుకొనే ఏర్పాటు 73వ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించబడింది. (సెక్షన్ 179)

పంచాయితీ రాజ్ వ్యవస్థలో జిల్లా స్థాయి అయిన జిల్లా ప్రజాపరిషత్తులు, జిల్లా సమగ్రాభివృద్ధికి నడుంకట్టాలి. ఈ బాధ్యతలను నెరవేర్చడానికి తగిన అధికారాలను చట్టం కల్పించింది. ప్రజా స్వామ్యంలో అధికారాలను సమిష్టిగా ఉపయోగించుకొని సంస్థల బాధ్యతలను నెరవేర్చడంలో జిల్లా ప్రజాపరిషత్ సభ్యులు కీలక పాత్ర వహిస్తారు. జిల్లా ప్రజాపరిషత్ చేసే ప్రతి కార్యక్రమం మెజార్టీ సభ్యులు నిర్ణయాల మేరకు జరుగుతుంది. జడ్.పి.టి.సి. సభ్యులకు ఈ క్రింది విషయాలలో ముఖ్య పాత్ర ఉంటుంది.

**1. జిల్లా ప్రజాపరిషత్తు పనులు మొదలగు వాటి గూర్చి సంబంధిత వారి దృష్టికి తీసుకు వచ్చే హక్కు (సె. 194):**

ఏ సభ్యుడైనను జిల్లా ప్రజాపరిషత్తు చేయవలసిన నిర్మాణపు పనిలో ఏవైనా నిర్లక్ష్యము, ఆస్తి ఏదైనా వ్యర్థమగుటగాని లేదా ఏదేని ప్రాంత అవసరాలను జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ లేదా ముఖ్య కార్య నిర్వహణాధికారి దృష్టికి తేవచ్చును మరియు వాటి అభివృద్ధికి తగు సూచనలు చేయవచ్చును.

**2. జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికలో పాత్ర :**

జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌లను ఎన్నుకొనుటకు ఎన్నికైన జడ్.పి.టి.సి. సభ్యులు మాత్రమే ఓటు హక్కు కలిగి ఉన్నారు. అంటే జిల్లా ప్రజాపరిషత్ దిశా నిర్దేశం చేసే టీమ్ లీడర్ల ఎన్నిక బాధ్యత పూర్తిగా జడ్.పి.టి.సి. సభ్యులకు ఇవ్వబడింది. అలాగే మైనారిటీ వర్గానికి చెందిన ఇరువురు సభ్యులను కో-ఆప్ట్ చేసుకునే అధికారం సభ్యులకు ఉంటుంది.

ప్రస్తుతం ఉన్న జిల్లా ప్రజాపరిషత్ పరిపాలన సరిగా లేదని భావించినా, ఛైర్‌పర్సన్ లేదా వైస్ ఛైర్‌పర్సన్ సభ విశ్వాసం కోల్పోయినాడని భావించినా ప్రస్తుత నాయకత్వ మార్పును కోరుతూ నిబంధనల కనుగుణంగా అవిశ్వాస తీర్మానాలను ప్రవేశ పెట్టవచ్చు. అయితే, ఎన్నికైన 4 సం॥ముల వరకు అవిశ్వాస తీర్మానము ప్రవేశ పెట్టుటకు వీలు లేదు (మెమో.నెం.28499/మం-2-ఎ/2008, తేది. 16.03.2009.)

**3. ప్రత్యేక సమావేశం ఏర్పాటు :**

ఒక ప్రత్యేక విషయాన్ని గురించి చర్చించాలని భావించినప్పుడు అప్పుడు జిల్లా ప్రజాపరిషత్‌లో గల సభ్యులలో 1/3 వంతు సభ్యులు వ్రాత పూర్వకంగా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయమని కోరినప్పుడు జిల్లా ప్రజాపరిషత్తు ఛైర్‌పర్సన్ ఏర్పాటు చేయని యెడల సభ్యులందరు కలసి సమావేశం ఏర్పాటు చేసుకొని ఆ ప్రత్యేక విషయాన్ని చర్చించి నిర్ణయాలు తీసుకోవచ్చు. ఈ విధంగా తీసుకొన్న నిర్ణయాలకు చట్ట బద్ధత ఉంటుంది.

**4. జిల్లా ప్రజాపరిషత్ సమావేశాలలో పాల్గొనడం :**

1. ప్రజాస్వామ్య బద్ధంగా జిల్లా ప్రజాపరిషత్ సమావేశంలో జరుగు చర్చలలో చురుకుగా పాల్గొని జిల్లాలోని సమస్యలపై చర్చించి తగిన పరిష్కార మార్గాలు సభ్యుల సహకారంతో కనుగొనవచ్చు. సమావేశాలలో తప్పని సరిగా పాల్గొని నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చు.
2. సమావేశానికి 6 రోజులు ముందుగానే నోటీసు అందుతుంది. కాబట్టి అజెండాలో విషయాలను కూలంకషంగా తెలుసుకొని, అవసరమైనంత మేరకు సంబంధిత సమాచారాన్ని సేకరించుకొని సమగ్ర అవగాహనతో సమావేశాలకు హాజరు అయ్యి, చర్చలలో పాల్గొని నిర్ణయాలు చేయవచ్చు.
3. జిల్లా ప్రజాపరిషత్ కార్యక్రమాలకు సంబంధించిన సమస్యలను ఎజెండాలో చేర్చుటకు ముందుస్తు తీర్మానాల ప్రతిపాదనలు పంపవచ్చును.
4. 15 రోజుల నోటీసుతో ప్రశ్నలను జిల్లా ప్రజాపరిషత్ కు పంపి, వాటిని సమావేశాలలో చర్చించడం ద్వారా సంస్థలలో జవాబుదారీ తనాన్ని తీసుకురావచ్చు.
5. 8 రోజుల నోటీసుతో సమావేశాలలో తీర్మానాలను ప్రతిపాదించవచ్చును.
6. సమావేశాలలో శాఖల/అధికారుల పనితీరును సమీక్షించవచ్చును.
7. ముందస్తు నోటీసుతో జిల్లా ప్రజాపరిషత్ ప్రొసీడింగులను, రికార్డుల నకలును పొందవచ్చును (జి.ఓ.నెం. 224 తేది: 10.4.1995)

**5. జిల్లా ప్రజాపరిషత్ ఆర్థిక వనరుల నిర్వహణలో:**

1. ఆదాయ వనరులను జాగ్రత్తగా పరిశీలించి, అభివృద్ధి కార్యక్రమాలకు తగు నిధులు కేయించడం ద్వారా మంచి బడ్జెట్ రూపకల్పనకు తోడ్పడవచ్చును. ఆ సంవత్సరంలో తాము సాధించదలచుకొన్న పనులన్నీ బడ్జెట్‌లో ప్రతిబింబిస్తుంటాయి.
2. జిల్లా ప్రజాపరిషత్తు ఆదాయ వ్యయాలను మదింపు చేసి, వచ్చిన ఆదాయంతో, ఉన్న వనరులలో ఏఏ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చు అనే కీలక నిర్ణయాలు జిల్లా ప్రజాపరిషత్ సమావేశాలలో తీసుకోవలసి ఉంటుంది. ఈ నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా జిల్లా ప్రజాపరిషత్ ఆర్థిక పరిస్థితి గురించి ప్రతీ 3 నెలలకు సి.ఇ.ఓ. సభ్యులకు ఒక నిర్ణీత ఆర్థిక నివేదిక అందజేయాలి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలి.
3. జిల్లా ప్రజాపరిషత్ వ్యవహారాలు ఎలా జరుగుతున్నదీ లోకల్ ఫండ్ ఆడిటరు ప్రతిసంవత్సరం తన నివేదికను జిల్లా ప్రజాపరిషత్‌కు సమర్పిస్తాడు. ప్రతి సభ్యుడు ఈ నివేదికను పరిశీలించి ఎటువంటి లోపాలు జరుగుతున్నాయో గుర్తించి, భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా జిల్లా ప్రజాపరిషత్తు తగు నిర్ణయాలు తీసుకోవాలి.

**6. వివిధ కమిటీలలో మెంబరుగా**

1. స్థాయీ సంఘంలో మెంబరుగా సంబంధిత సంఘం సమావేశాలలో పాల్గొని వివిధ శాఖల పనితీరును సమీక్షించవచ్చును. జిల్లా ప్రజాపరిషత్తుకు సంబంధించిన ఏ రికార్డునైనా పరిశీలన కొరకు స్థాయీ సంఘం ముందుంచమని కోరవచ్చును. (సెక్షన్ 191)
2. మండల మరియు నియోజక వర్గపు నీటి వినియోగ పరి రక్షణ కమిటీ యందు సభ్యుని హోదాలో నీటి పరిరక్షణకు చర్యలు చేపట్టవచ్చును. (జి.ఓ.నెం. 311 పంచాయితీరాజ్ తేది : 16.8.2003)
3. మండల స్థాయి ఆహార సలహా కమిటీలో సభ్యుడుగా ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరుగుటకు, లోపాల సవరణకు తగు సూచనలు చేయవచ్చును. (జి.ఓ.యం.యస్.నెం. 7 (కన్స్యూమర్ ఎఫైర్స్, ఆహారము మరియు పౌర సరఫరా) తేది : 1.2.2006). మండల ఆహార సలహా సమావేశాన్ని ద్వైమాసికంగా రెండవ సోమవారం నాడు నిర్వహించాలి.
4. ఎసైన్‌మెంటు రివ్యూ కమిటీలో సభ్యుడుగా వ్యవహరిస్తారు.
   జి.ఓ.నెం.590 రెవెన్యూ (భూ సంస్కరణలు) తేది:11.11.95, జి.ఓ.నెం.146 రెవెన్యూ తేది :5.2.96, 3. జి.ఓ.యం.యస్ నెం.227 రెవెన్యూ తేదీ 4.3.96
5. ఎనర్జీ నియోజక వర్గ కమిటీలో సభ్యుడుగా ఉంటాడు. (జి.ఓ.యం.యస్.నెం.145 ఎనర్జీ (పవం III) తేది:9.11.95)

**7. ఇతర అధికారాలు:**

1. జడ్.పి.టి.సి. పరిధిలోని మండల ప్రజాపరిషత్ సమావేశంలో శాశ్వత ఆహ్వానితుని హోదాలో పాల్గొని మండల సమస్యలను చర్చించవచ్చును. వీటిని జిల్లా ప్రజాపరిషత్తు దృష్టికి కూడా తీసుకొని వెళ్ళవచ్చును.
2. అన్ని ప్రభుత్వ మరియు జిల్లా ప్రజాపరిషత్ అధికార ఉత్సవాలకు జిల్లా ప్రజాపరిషత్ సభ్యులను ఆహ్వానించాలి. (మెమోనెం.1289/ మండల్సు III/96 తేది:17-1-96)
3. జిల్లా ప్రజాపరిషత్తు మహిళా సభ్యులకు వసతి గృహాలలో ప్రాధాన్యతా పూర్వక కేటాయింపు జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సభ స్థాయి కమిటీ సమావేశాలు జరిగే రోజున జిల్లా ప్రజాపరిషత్ వసతి గృహాలలో వసతి కల్పించుటకు మహిళా సభ్యులకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. ఇతర రోజులలో వారికి ఎం.ఎల్.ఏ.లకు ఎం.పి.లకు వసతి కేటాయించిన తరువాత ప్రాధాన్యత నివ్వాలి. (జి.ఓ.యం.యస్.నెం.117 మండల్సు III తేది:7-3-1996)
4. జిల్లా ప్రజాపరిషత్ సభ్యులకు గౌరవ భృతి నెలకు రూ.2,250/-లు మరియు సిటింగ్ ఫీజ్ రూ.150/-లు చెల్లించబడతాయి (జి.ఓ.యం.ఎస్.నెం.279, పం.రా& గ్రా.అ, తేది.17.9.09 & జి.ఓ.ఎం.యస్ నెం. 138, పి.ఆర్. & ఆర్. డి (పం.4) శాఖ, తేది.17.04.2010) మరియు ప్రయాణ, దిన భత్యములు ఆంధ్రప్రదేశ్ ప్రయాణ భత్యాల నియమావళి, III వ భాగంలోని 13(ఎ) నియమానుసారంగా చెల్లించవలెనని జి.ఓ.ఎం.యస్.నెం.376, పం.రా. గ్రా.అ (మండలం-III) తేది.14.12.2004 ద్వారా తెలియజేయడమైనది.
5. కో ఆప్ట్ చేసుకోబడిన జిల్లా ప్రజాపరిషత్ సభ్యులకు గౌరవ వేతనం : జడ్.పి.టి.సి. సభ్యులతో సమానంగా కో-ఆప్ట్ చేసుకోబడిన సభ్యులకు కూడా గౌరవ వేతనము మరియు ప్రయాణ భత్యము చెల్లించబడతాయి.
6. జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలల సందర్శన : జిల్లా ప్రజాపరిషత్ ఉన్న పాఠశాలల పరిస్థితులను మెరుగు పరచే ఉద్దేశ్యంతో తమ నియోజక వర్గంలో గల జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలను దర్శించి వాటి పరిస్థితిని, విద్యా స్థాయి పెంచేందుకు తగు సలహాలు ఇచ్చుటకు జడ్.పి.టి.సి. సభ్యులకు అధికారము ఇవ్వబడినది. (జి.ఓ.యం.యస్‌నెం.285 మండల్స్ III తేది:4.7.96)
7. ఆర్.టి.సి. బస్సులలో సీట్ల ప్రాధాన్యత: అన్ని రకాల ఆర్.టి.సి. బస్సులలో శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులకు ప్రత్యేకించిన 4 సీట్లకు నిర్ణీత గడవులో వారు రానప్పుడు ప్రాధాన్యత ప్రాతిపదికపై జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక సభ్యులకు, మండల ప్రజాపరిషత్ సభ్యులకు కేయించాలని, శాసన సభ్యులకు పార్లమెంటు సభ్యులకు ప్రత్యేకించినవి కానట్టి సీట్ల కోసం అడిగినప్పుడు, అందుబాట్లకు లోబడి, వారికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని ఆర్.టి.సి. సంస్థ తెలియజేసింది. (ప్రభుత్వ మెమో నెం.35820 మండల్స్ III తేది: 7.12.1996)
8. సెక్రటేరియేట్‌లో ప్రవేశించుటకు గుర్తింపు కార్డులు:
   జెడ్.పి.టి.సి. సభ్యులు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు సెక్రటేరియేట్‌లో ప్రవేశించుటకు ఆయా జిల్లా ప్రజాపరిషత్ సి.ఇ.ఓ.లు సంతకం మరియు సీలుతో ఇచ్చిన ఫోటో గుర్తింపు కార్డుల ప్రకారం రిసెప్షన్‌లో పాస్‌లు జారీచేయబడతాయి.

– సిడిపిఏ/ టిసిపార్డ్



# ఉద్యాన పంటలకు భరోసానిస్తున్న పలు పథకాలు

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, రాయితీల వివరాలు... రైతుల కోసం..తెలంగాణ రాష్ట్ర సూక్ష్మ నీటిపారుదల పథకంపంటల ఉత్పాదకత, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలుచేస్తున్నది. రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు సబ్సిడీపై సరఫరా చేస్తున్నది. వీటి ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేయొచ్చు. అధిక దిగుబడులు సాధించ వచ్చు. ఫర్టిగేషన్, న్యూట్రిగేషన్ ద్వారా సమర్ధవంతమైన రసాయనిక ఎరువులు వాడే వీలు ఉంటుంది.

**రాయితీలు...**

- దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ ప్రభుత్వం రైతు కేటగిరీ ఆధారంగా బిందు సేద్యం పరికరాలపై ఐదు హెక్టార్లకు రాయితీ ఇస్తున్నది.
- షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతుల రైతులకు 100 శాతం రాయితీ ఇస్తున్నది.
- వెనకబడిన తరగతులు, సన్న- చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ ఇస్తున్నది.
- ఇతర సామాజిక వర్గాలకు చెందిన రైతులకు 80 శాతం రాయితీ ఇస్తున్నది.
- ఒకసారి రాయితీ పొందిన తర్వాత మళ్లీ ఐదేండ్లకు రాయితీ పొందే వెసులుబాటు కల్పించింది.
- జిల్లాకు కేటాయించిన సూక్ష్మ నీటి సేద్య కంపెనీల్లో తనకు నచ్చిన కంపెనీని ఎంపిక చేసుకునే స్వేఛ రైతులకు కల్పించింది.
- స్ప్రింక్లర్లపై మాత్రం 75 శాతం రాయితీని ప్రభుత్వం ఇస్తున్నది.

పత్తి పంటతో అన్నదాతలు ఆగమాగం అవుతున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నది. పండ్ల తోటల విస్తీర్ణంలో దేశంలో తెలంగాణ మూడో స్థానంలో ఉన్నది. ఉద్యాన శాఖకు 646.82 కోట్ల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

**పాలీ హౌజ్‌లు- హరిత గృహాలు**

సీజన్‌తో నిమిత్తం లేకుండా ఏడాదంతా కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు 75 శాతం రాయితీతో ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం





ప్రారంభించింది. 200 చదరపు మీటర్ల నుంచి మూడెకరాల వర కు పాలీహౌజ్‌ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నది. దీంతో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు నాటుకోవచ్చు. తద్వారా దిగుబడి పెరుగుతుంది. సీజన్‌తో సంబంధం లేకుండా కూరగాయలు, పూలు సాగుచేయవచ్చు. చీడ బాధ తక్కువగా ఉంటుంది. నాణ్యమైన దిగుబడి వస్తుంది.

**రాయితీలు:**

డ్రిప్ ఇరిగేషన్, ఫాగర్స్‌తో కలిపి పాలీహౌజ్‌ల నిర్మాణానికి 75 శాతం రాయితీ ఇస్తున్నది. ఎకరానికి 25.32 లక్షలు మించకుండా రాయితీ ఇస్తారు. కొత్తగా పాలీహౌజ్‌లు నిర్మించుకున్న వారికి మొక్కల ఖరీదు, బెడ్స్ తయారీ, ఇతర ఖర్చులపై 75 శాతం రాయితీ ఉంటుంది. ఎకరానికి 4.20 లక్షలు మించ కుండా సబ్సిడీ ఇస్తుంది. ఈ ఏడాది నుంచి ఎస్సీ, ఎస్టీ రైతులకు పాలీహౌజ్‌ల నిర్మాణంపై 95 శాతం రాయితీ ఇవ్వనుంది. పాలీహౌస్‌ల నిర్మాణంతో పాటు షేడ్ నెట్ హౌజ్‌లు, వాక్-ఇన్-టన్నెల్‌పై ఎస్సీ, ఎస్టీలకు 95 శాతం రాయితీ, ఇతరులకు 75 శాతం రాయితీ ఉంటుంది. మల్చింగ్ కోసం షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు 95 శాతం రాయితీ ఇస్తున్నది.

**సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్:**

పండ్లు, పూలతోటల విస్తరణకు ఈ పథకం ద్వారా 40 శాతం రాయితీ లభిస్తుంది. 50 శాతం రాయితీతో పాలీహౌజ్‌లు, మల్చింగ్ నిర్మాణం, వర్షాభావ పరిస్థితుల్లో పండ్ల తోటలు ఎండిపోకుండా తడులు ఇచ్చేందుకు 50 శాతం రాయితీతో నీటి కుంటల నిర్మాణం, పంట కోత అనంతరం కలిగే నష్టాలను తగ్గించటానికి 35 నుంచి 50 శాతం రాయితీతో ప్రాసెసింగ్ యూని ట్లు, శీతల గిడ్డంగుల నిర్మాణం కోసం ఈ పథకం ఉపయోగకరం. 40 నుంచి 50 శాతం రాయితీతో ఉ ద్యాన యాంత్రీకరణను ప్రోత్సహిస్తారు. రైతులకు, అధికారులకు శాస్త్రీయ పద్ధతులపై శిక్షణ, క్షేత్ర సందర్శనతో పరిజ్ఞానం పెంచుటకు ప్రభుత్వం కృషి చేస్తున్నది.

1. టిష్యూ కల్చర్ యూనిట్, విత్తనాల మౌలిక సదుపాయాలు- ప్రాజెక్టు ఆధారిత క్రెడిట్ లింక్‌డ్ బ్యాక్ ఎండెడ్ రాయితీ, ప్రైవేటుకు

గరిష్ఠంగా కోటి, టిష్యూ కల్చర్ యూనిట్‌కు 40 శాతం, విత్తనాల యూనిట్‌కు 50 శాతం రాయితీ ఇస్తున్నారు. 2.మామిడి, అరటి, బొప్పాయి, బత్తాయి, జామ, రేగు, అంజీర తదితర పండ్ల తోటలు– 40 శాతం రాయితీతో మూడేండ్ల వరకు 60:20:20 నిష్పత్తితో పంటల వారిగా రాయితీని ప్రతి రైతుకు గరిష్ఠంగా నాలుగు హెక్టార్ల వరకు ఇస్తారు. 3. కూరగాయలు (క్రాప్ కాలనీలు)– 40 శాతం రాయితీతో హెక్టారుకు 20 వేలు రాయితీ ఇస్తారు. ప్రతి రైతు రెండు హెక్టార్ల వరకు రాయితీ పొందవచ్చు. 4. బంతి, చామంతి, ఆస్ట ర్, కనకాంబరం, గ్లాడియోలస్, లిల్లీస్ తదితర పూలు– 40 శాతం రాయితీతో హెక్టారుకు 16 వేల నుంచి 60 వేల వరకు రాయితీ ఇస్తారు. ఒక రైతు రెండు హెక్టార్ల వరకు రాయితీ పొందవచ్చు. 5.నీటి కుంటల ఏర్పాటు (ఫామ్ పాండ్)– 50 శాతం రాయితీ ఉంటుంది. గరిష్ఠంగా 75 వేల వరకు రాయితీ పొందవచ్చు. 6.పాలీహౌజ్‌లు– 50 శాతం రాయితీతో చదరపు మీటరుకు రూ. 422 చొప్పున ప్రతి రైతు గరిష్ఠంగా నాలుగు వేల చదరపు మీటర్ల రాయి తీ పొందవచ్చు. 7.షేడ్‌నెట్‌లు(ట్యూబులర్)– 50 శాతం రాయితీతో చదరపు మీటరుకు 355 చొప్పున ప్రతి రైతు గరిష్ఠంగా నాలుగు వేల చదరపు మీటర్ల రాయితీ పొందవచ్చు. 8.షేడ్‌నెట్‌లు–50 శాతం రాయి తీ తో చదరపు మీటర్‌కు 142–50 రూపాయల నుంచి 207–50 చొప్పున గరిష్ఠంగా నాలుగు వేల చదరపు మీటర్ల వరకు రాయితీని పొందవచ్చు. 9. పాలీహౌజ్‌లో పెంచే పూలమొక్కలపై రాయితీ– 50 శాతం రాయితీతో చ.మీ.కు 305 చొప్పున గరిష్ఠంగా 4 వేల చ.మీ. వరకు రాయితీ. 10. మల్చింగ్– 50 శాతం రాయితీతో హెక్టారుకు 16 వేల చొప్పున ప్రతి రైతు గరిష్ఠంగా రెండు హెకార్ల వరకు రాయితీ పొందవచ్చు. 11.వర్మి బెడ్స్– 50 శాతం రాయితీతో యూనిట్‌కు 4,500 చొప్పున ప్రతి రైతుకు రెండు యూనిట్లు మంజూరు చేస్తారు. 12. వర్మి కంపోస్టు యూనిట్లు– 50 శాతం రాయితీతో యూనిట్‌కు 50 వేల చొప్పున ప్రతి రైతుకు ఒక యూనిట్ మంజూరు చేస్తారు. 13. శీతల గిడ్డంగులు(టైప్1)– టన్నుకు 2,800 చొప్పున 35 శాతం రాయితీతో గరిష్ఠంగా ఐదు వేల టన్నులకు 1.40 కోట్లు ఇస్తారు. 14. శీతల గిడ్డంగులు(టైప్2)– టన్నుకు 3,50 చొప్పున 35 శాతం రాయితీతో గరిష్ఠంగా 5 వేల టన్నులకు 1.75 కోట్లు ఇస్తారు. 15. రైపెనింగ్ చాంబర్స్(టైప్1)– టన్నుకు 35 వేల చొప్పున 35 శాతం రాయితీతో గరిష్ఠంగా 100 టన్నులకు 35 లక్షలు ఇస్తారు. 16. రైపెనింగ్ ఛాంబర్స్ (టైప్2)– 50 శాతం రాయితీతో గరిష్ఠంగా రెండున్నర లక్షల వరకు ఇస్తా రు. 17. పసుపు బాయిలింగ్ యూనిట్లు– 50 శాతం రాయితీతో గరిష్ఠంగా 1.50 లక్షలు ఇస్తారు. 18.ఉద్యాన యాంత్రీకరణ– ట్రాక్టర్లు, సస్యరక్షణ పరికరాలు, మల్చింగ్ మిషన్‌లకు ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులకు 35 శాతం రాయితీ. 19. ప్రదర్శ న క్షేత్రాల ఏర్పాటు– కొత్త పంటలు, కొత్త రకాలను ప్రోత్సహించటానికి 75 శాతం రాయితీ ఇస్తారు.

**రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం**

ఈ పథకం ద్వారా ఉల్లి, ఆలుగడ్డ, ఇతర హైబ్రీడ్ కూరగాయలకు విత్తనాలు సరఫరా చేస్తారు. తీగజాతి కూరగాయలకు శాశ్వత పందిళ్ల ఏర్పాటు చేస్తారు. కూరగాయల ప్లగ్‌లింగ్ నారు, మినీ కిట్స్, ప్లాస్టిక్ క్రేట్స్ సరఫరా చేస్తారు. కలెక్షన్ సెంటర్‌లు స్థాపిస్తారు. రైతులకు శాస్త్రీయ పద్ధతులపై శిక్షణ ఇస్తారు.

1. సంకరజాతి కూరగాయల విత్తనాలు– 50 శాతం రాయితీతో ఒక హెక్టారుకు మూడు వేల చొప్పున రెండు హెక్టార్ల వరకు రాయితీ ఇస్తారు. 2. ఉల్లి విత్తనాలు– 75 శాతం రాయితీతో రెండు ఎకరా ల వరకు రాయితీ ఇస్తారు. 3. ఆలుగడ్డ విత్తనాలు– 25 శాతం రాయితీతో ఒక ఎకరానికి ఐదు వేల చొప్పున గరిష్ఠంగా ఒక రైతుకు ఐదు ఎకరాలకు రాయితీ ఇస్తారు. 4. కూరగాయ ప్లగ్‌లింగ్ నారు– 50 శాతం రాయితీతో ఒక మొక్కకు 1.80 పైసల చొప్పున గరిష్ఠంగా 10 వేల మొక్కలకు రాయితీ. 5.కూరగాయల మినీ కిట్స్– 90 శాతం రాయితీతో ఒక కిట్‌కు 90 చొప్పున గరిష్ఠంగా ఒక రైతుకు రెండు కిట్లు పంపిణీ చేసే సౌలభ్యం. 6. శాశ్వత పందిళ్లు– 50 శాతం రాయితీతో ఒక హెక్టారుకు 2.50 లక్షల చొప్పున రైతుకు మంజూరు ఇస్తారు. 7. ప్లాస్టిక్ క్రేట్స్– 50 శాతం రాయితీతో ఒక్క ట్రేకు 120 చొప్పున గరిష్ఠంగా ఒక రైతుకు 40 ప్లాస్టిక్ క్రేట్స్ ఇస్తారు. 8. తాజా కూరగాయలు అమ్మే వాహనాలు– 50 శాతం రాయితీతో ఒక వాహనానికి రెండు లక్షల చొప్పున ఇస్తారు. 9. కొనుగోలు కేంద్రాలు– 100 శాతం రాయితీతో 10లక్షల విలువతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చు.

**నూనె గింజలు– ఆయిల్‌పామ్ జాతీయ మిషన్:**

ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఆయిల్‌పామ్ పంట ప్రోత్సాహానికి మొక్కలతో పాటు నాలుగేండ్ల పాటు నిర్వహణ, అంతర పంటల సాగుపై ప్రభుత్వం రాయి తీ ఇస్తున్నది. పనిముట్లకు వాటి విలువపై 50 శాతం రాయితీ ఇస్తూ ప్రోత్సహిస్తున్నది.

**రాయితీ వివరాలు:**

1. మొక్కల సరఫరా– 85 శాతం రాయితీతో ఒక హెక్టారుకు 8 వేల చొప్పున పరిమితి లేకుండా ఎన్ని హెక్టార్ల వరకైనా మొక్కలు ఇస్తారు. 2. తోటల నిర్వహణ– 50 శాతం రాయితీతో ఒక హెక్టారుకు నాలుగు వేల చొప్పున మొదటి నాలుగేళ్లు నిధులు ఇస్తారు. 3. బిందు సేద్యం పరికరాలు– ఒక హెక్టారుకు 23 వేల 200 చొప్పున ఇస్తారు. డీజిల్ పంపు సెట్లు– 50 శాతం రాయితీతో ఒక్క పంపు సెట్‌కు 15 వేల వరకు ఇస్తారు. 5. బోర్ వెల్స్– 50 శాతం రాయితీతో ఒక్క బోర్ వెల్‌కు 25 వేల వరకు ఇస్తారు. 6. అంతర పంటలు– 50 శాతం రాయితీతో ఒక హెక్టారుకు మూడు వేల వరకు ఇస్తా రు. 7. యాంత్రీకరణ– పనిముట్లు– 50 శాతం రాయితీతో కట్టర్, గెల కొరకు వైపుమేష్, చాఫ్, కట్టర్లు, నిచ్చెన, హార్వెస్టర్ సరఫరా చేస్తారు.

**వివిధ ఉద్యాన అభివృద్ధి ప్రోత్సాహకాలు**

ఉల్లి ధరల దృష్ట్యా తెలంగాణలో ఉల్లి సాగు విస్తీర్ణం పెంచటానికి 75 శాతం రాయితీతో ఉల్లి విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది.

ఉద్యాన శాఖ పరిధిలో ఉన్న ఉద్యాన క్షేత్రాల్లో కొత్త సాంకేతిక పద్ధతులను ప్రవేశపెట్టి, నమూనా రైతు శిక్షణ కేంద్రాలుగా మారుస్తారు. వీటి ద్వారా నాణ్యమైన మామిడి, కొబ్బరి వంటి మొక్కలను ఉత్పత్తి చేసి ఉద్యానశాఖ పథకంలో, హరితహారం పథకంలో సరఫరా చేసి ఉ ద్యాన క్షేత్రాల అభివృద్ధి చేయనున్నారు.

రాష్ట్ర జనాభాకు సరిపడా కూరగాయలు, పండ్లు ఉత్పత్తి చేయటానికి 54 పంటల కాలనీలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈఏడాది 13 పంట కాలనీలు ఏర్పాటు చేస్తున్నారు. సంప్రదాయ పంటలకు బదులు ఆయా నేలల స్వభావాన్ని బట్టి తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే ఆధునిక సేద్య పద్ధతులు, రైతులకు శిక్షణ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నది.

**–రాజు వేములపల్లి,**
**నిజామాబాద్**



# త్రాగునీరు





గ్రామ పంచాయితీ స్థాయిలో త్రాగునీటి సరఫరా గ్రామ అభివ ృద్ధిలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రభావం చూపుతుంది. త్రాగునీటి వనరులను గుర్తించడం, త్రాగునీటి సరఫరాకు కావాల్సిన వ్యవస్థలను రూపొందించుకోవడం, సరిపడా పరిమాణాన్ని, తగు నాణ్యతను పాటిస్తూ అన్ని కాలాల్లో నీటి సరఫరా చేయడంలో మన గ్రామ పంచాయితీలు ముందున్నాయన్న మాట వాస్తవం.

అయితే త్రాగునీటి సరఫరా విషయంలో అంతాసవ్యంగా ఉందనుకుంటే పొరపాటే. ఈ విషయంగా మన గ్రామ పంచాయితీలు ఇంకా ఎంతో అభివృద్ధి సాధించవలసి ఉంది. నేటికీ త్రాగునీటి విషయం గా మన పంచాయితీల్లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

- త్రాగునీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలు
- త్రాగునీరు కుళాయిల ద్వారా సమయానికి, తగినంత నీరు సరఫరా కాకపోవడం
- అన్ని కాలాలలో సరఫరా జరగకపోవడం
- నాణ్యత లేని త్రాగునీరు సరఫరా అవ్వడం
- కొన్ని వీధులకు (ఎత్తు ప్రాంతాలకు) నీరు అసలు సరఫరా కాకపోవడం

**అందుకు గల ముఖ్య కారణాలు**

- సాధారణంగా వచ్చే మరమ్మత్తులను నిరోధించలేకపోవడం
- గ్రామ పంచాయితీ పరిధిలో కొన్ని అత్యవసర విడి భాగాలు అందుబాటులో లేకపోవడం
- పైపులైన్లను నిరంతరంగా తనిఖీ చేయకపోవడం
- లీకేజీలను నియంత్రించక పోవడం,
- అనధికార కనెక్షన్లు ఉండటం
- నీళ్ళు వదిలే వ్యక్తి బాధ్యతగా పని చేయకపోవడం
- చేతిపంపుల, బోరుబావుల చుట్టూ శుభ్రత పాటించకపోవడం
- క్లోరినేషన్ చేయడంలో అజాగ్రత్త వహించడం
- కాలానుగుణంగా నీటి నమూనాలను పరీక్షించకపోవడం
- నీరు మరియు పారిశుద్ధ్య కమిటి పనితీరు సరిగా లేకపోవడం
- గ్రామంలో వున్న వివిధ నీటి వనరుల మధ్య కనెక్టివిటీ లేకపోవటం.
- నీటి వనరుల సంరక్షణకు చర్యలు చేపట్టక పోవడం

**తత్ఫలితంగా కలిగే దుష్ప్రభావాలు:**

- దూర ప్రాంతాల నుండి త్రాగునీరు తీసుకు రావడం వల్ల విలువైన సమయం వ ృధా అవడం
- బడికి వెళ్ళే పిల్లల చదువుకు ఆటంకం కలుగడం.
- పబ్లిక్ కుళాయిలు/ ట్యాంకుల దగ్గర పొడవైన క్యూ ఉండటం, కొన్ని సందర్భాలలో అయితే ఆ క్యూ రాత్రి వరకు కొనసాగడం
- ప్రజల ఆరోగ్యం పాడవడం.

ప్రతి గ్రామ పంచాయితీ త్రాగునీటి సరఫరాకై సమగ్ర ప్రణాళిక తయారు చేయునప్పుడు పైన చెప్పిన సమస్యలను దృష్టిలో వుంచుకొని, పరిష్కారాలతో కూడిన ప్రణాళిక తయారు చేయడంతో

పాటు ప్రణాళిక తయారీలో క్రింది ముఖ్య విషయాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

1 నీటి వనరుల లభ్యత (భూ ఉపరితల నీరు/ భూగర్భజలాలు)
2 వనరులు చాలినంతగా ఉండేటట్లు చూసుకోవడం (పరిమాణం)
3 నీరు నాణ్యత కలిగి ఉండడం (రసాయనిక/ బాక్టీరియా రహిత త్రాగునీరు)
4 వనరులు సుస్థిరంగా కొనసాగేలా చూసుకోవడం (దీర్ఘ కాలం పాటు)
5 తగిన నీటి సరఫరా వ్యవస్థ (చేతి పంపు/ సింగిల్ విలేజ్ స్కీమ్/ మల్టీ విలేజ్ స్కీమ్ మొదలైనవి.

**త్రాగునీటి వనరులు - సరఫరా వ్యవస్థలు**

గ్రామాలలో అందుబాటులో ఉండే త్రాగునీటి వనరులను, సరఫరా వ్యవస్థలను గురించి తెలుసుకుందాం.

**1. త్రాగునీటి వనరులు:**

**భూ ఉపరితలంపై లభ్యమయ్యే నీరు:**

నదులు, కాలువలు, వాగులు, వంకలు, సరస్సులు, జలాశయాలు మరియు చెరువులు మొదలగు రూపాలలో లభ్యమయ్యే నీరే భూ ఉపరితల నీరు. ఈ భూ ఉపరితల నీటి పరిమాణం ప్రధానంగా వర్షపాతంపై ఆధారపడి ఉంటుంది. భూ ఉపరితల నీరు కలుషితమయ్యే అవకాశం ఎక్కువ. భూ ఉపరితల నీటిని నిల్వ చేయడానికి ముఖ్యంగా చిన్నచిన్న ఆన కట్టలు, డామ్‌లు, రిజర్వాయర్లు నిర్మిస్తారు.

**భూగర్భజలం:**

భూ ఉపరితలంపై ఉన్న నీరు క్రమంగా భూగర్భంలోనికి ప్రవేశించి భూగర్భజలంగా పిలవబడుతుంది. భూగర్భజలం కొంత వరకూ బాక్టీరియా లేని సురక్షితమైనది, కానీ ఖనిజాలు (మెగ్నీషియం మొదలైనవి మోతాదుకు మించి కలిగి ఉండే అవకాశం ఉంది) ఉన్నాయి. భూ ఉపరితల నీటితో పోల్చితే భూగర్భ జలాలు సురక్షితమైనదిగా చెప్పవచ్చు.

సుమారు 85% గ్రామీణ త్రాగునీటి సరఫరా పథకాలు భూగర్భజలాల పైనే ఆధారపడి ఉన్నాయి. ఈ చర్య వలన అడుగంటుతున్న భూగర్భ జలాలను పునరుద్ధరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**గ్రామీణ త్రాగునీటి సరఫరా వ్యవస్థలు:-**

గ్రామీణ ప్రాంతాల్లో, సాధారణంగా ఈ క్రింది త్రాగునీటి సరఫరా వ్యవస్థలను మనం గమనించవచ్చు

1 నూతి బావులు
2 సాంప్రదాయ నీటి ట్యాంకులు మరియు వర్షపు నీటి ట్యాంకులు
3 స్థానిక బుగ్గలు, ప్రవాహాలు మరియు చెరువులు
4 చేతి పంపులు
5 మోటారు బావులు
6 పైపుల ద్వారా నీటి సరఫరా వ్యవస్థలు - సింగిల్ విలేజ్ స్కీమ్‌లు, మల్టీ విలేజ్ స్కీమ్‌లు, మొదలైనవి



**నూతి బావులు:**

పురాతన కాలం నుండి త్రాగునీటి వనరులకు నూతి బావులను ఉపయోగించడం పరిపాటి. వీటిని ఏర్పాటు చేయడం సులభం కేవలం చుట్టూ గోడ కట్టడానికి మాత్రమే నైపుణ్యత గల కూలీలు అవసరం అయితే ప్రస్తుతం వీటిపై ఆధారపడే కుటుంబాల సంఖ్య చాలా తక్కువనే చెప్పాలి.

- ప్రతి చేతి పంపుకూ చుట్టూ ఫ్లాట్ ఫామ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.
- మన గ్రామాలలో సాధారణంగా చేతి పంపుల కోసం ఇండియా మార్క్-2 మరియు మార్క్-3 పంపులను ఎక్కువగా వాడతారు.

**సాంప్రదాయక నీటి నిల్వ ట్యాంకులు మరియు వర్షపు నీటి ట్యాంకులు:**

నీటి కొరత ఉన్న కాలాలలో నీటి లభ్యత కోసం ప్రతి గ్రామంలో నీటి నిల్వ ట్యాంకులను ఏర్పాటు చేసుకోవడం అనాదిగా వస్తున్నదే ఈ నీటి ట్యాంకుల వలన

- నీటి వనరుల పరిమాణం పెరుగుతుంది
- భవిష్యత్ అవసరాలు తీరుతాయి


**స్థానిక నీటి బుగ్గలు, ప్రవాహాలు, చెరువులు:**

సాధారణంగా కొండ ప్రాంతాలలోని ప్రజల త్రాగు నీటి అవసరాలను ఇవి తీరుస్తాయి. ఈ ప్రదేశాలలో ఎత్తైన ప్రాంతం నుండి దిగువ ప్రాంతానికి నీరు ప్రవహించడం సాధారణం కనుక ఈ వనరులు నుండి పైప్‌లైన్లు ఏర్పాటు ద్వారా నీటిని ఆవాస గ్రామాలకు సరఫరా చేయడం జరుగుతుంది.

**చేతి పంపులు:**

యంత్ర సామాగ్రి సహాయంతో భూమిలోనికి ఒక రంధ్రాన్ని ఏర్పరచి,





ఆ బోరుబావిలోని నీటిని సమీకరించడానికి పంపును ఏర్పాటు చేయడం మనందరికీ తెలుసు అదే చేతిపంపు.

- చేతి పంపు నుండి వెలువడే వ ృధా నీటిని సమర్థవంతంగా నిర్వహించడం కోసం అవుట్‌లెట్‌ను, డ్రైనేజీలోకి కలపాలి. డ్రైనేజీ వ్యవస్థ లేనట్లయితే చేతి పంపుకు కనీసం 3 మీటర్ల దూరంలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసి వృధా నీటిని మళ్ళించాలి లేదా చెట్లకు మళ్ళించాలి.
- ఈ చేతి పంపు విషయంలో భూఉపరితలంపై ఉన్న కలుషితాలు భూగర్భంలోకి చేరకుండా బోరు రంధ్రం చుట్టూ సీల్ చేయడం తప్పనిసరి.

**మోటారు బోరు బావి:**

గ్రామాలలో ప్రస్తుతంఎక్కువగా ఈ మోటారు బావులను ఉపయోగిస్తున్నారు. చిన్న చిన్న ఆవాస గ్రామాలకు, తక్కువ కుటుంబాలున్న కాలనీలకు మోటారు బోరు బావుల ద్వారా నీటి సరఫరా చేటయడం సులభం. ఇందుకు కావలసిందల్లా సబ్ మెర్సిబుల్ పంపు, పైపులైను మాత్రమే. ఈ మోటారు బోరు బావులకు సమీపంలో పంప్‌హౌస్ ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి.

**పైపులైన్ల ద్వారా నీటి సరఫరా వ్యవస్థలు:** ఇవి రెండు రకాలు,

1. భూగర్భజలాల ఆధారిత నీటి సరఫరా వ్యవస్థ
2. భూ ఉపరితల నీటి వనరులు ఆధారిత నీటి సరఫరా వ్యవస్థ

- భూగర్భజల ఆధారిత వ్యవస్థలో మోటారు బోరుబావి నుండి నీరు నీటి నిల్వ ట్యాంకుకు మళ్ళించడం, నిర్ణీత సమయంలో నీటి నిల్వట్యాంకు నుండి గ్రామాలలోని ఇండ్లకు పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేయడం జరుగుతుంది.
- భూఉపరితల నీటి ఆధారిత సరఫరా వ్యవస్థలో
  1. నీటి వనరుల పంపింగ్ వ్యవస్థ,
  2. ముడినీటి శుద్ధీకరణ వ్యవస్థ,
  3. నీటి నిల్వ ట్యాంకులు,
  4. జలాశయాలు,
  5. ప్రసార మరియు పంపిణీ వ్యవస్థ మరియు
  6. ఇంటింటికీ నీటి కనెక్షన్లు మొదలగు దశలు ఉంటాయి.

**మన గ్రామం - మన నీటి ప్రణాళిక**

**గ్రామ నీటి భద్రతా ప్రణాళిక అంటే ఏమి?**

సులభంగా చెప్పాలంటే, గ్రామ పంచాయితీ స్థాయిలో అందుబాటులో ఉండే నీటి వనరులు, నీటి సరఫరా వ్యవస్థలు, గ్రామం వివరాలు, ప్రస్తుత సమస్యలు, అవాంతరాలు, సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు, మరియు ఆర్థిక వనరుల లభ్యత మొదలగు అంశాల సమాహారం, ఇదే త్రాగునీటి భద్రతా ప్రణాళిక.

**గ్రామ నీటి భద్రతా ప్రణాళికలో ఏఏ భాగాలు ఉంటాయి?**

ప్రధానంగా గ్రామ నీటి భద్రతా ప్రణాళికలో

1. గ్రామ నీటి వనరుల ప్రణాళిక
2. గ్రామ నీటి నాణ్యతా ప్రణాళిక
3. నీటి సరఫరా వ్యవస్థల నిర్వహణా ప్రణాళిక మరియు
4. సేవల మెరుగుదల ప్రణాళికలు భాగాలుగా ఉంటాయి.

**గ్రామ స్థాయి నీటి భద్రతా ప్రణాళిక తయారీలో పరిగణనలోనికి తీసుకోవలసిన మార్గదర్శకాలు ఏమిటి?**

గ్రామ నీటి భద్రతా ప్రణాళిక తయారీలో సాంకేతిక సహకారం సంబంధిత శాఖాధికారుల నుండి లభిస్తుంది. ప్రణాళిక తయారీలో

- కుటుంబాల వారీ, గ్రామాల వారీ సమాచార సేకరణ విడబ్ల్యుయస్‌సి



మెంబర్ల ద్వారా చేపట్టాలి. విడబ్ల్యుయస్‌సి మెంబర్లలో మహిళా సభ్యులు ఉండేలా చూడాలి.

- సర్వే నిర్వహించే సమయంలో సబ్-డివిజనల్ లేబరేటరీ నుండి మొత్తం పరికరాలతో వాటర్ టెస్టింగ్‌లు నిర్వహించాలి.
- జిపియస్ మిషన్ సహాయంతో అన్ని నీటి వనరులను గుర్తించి, నీటి వనరుల మ్యాప్‌ను తయారు చేయాలి. (సాంకేతిక నిపుణులు సహకారం తప్పనిసరి)
- నీటి కాలుష్యానికి దారి తీసే అవకాశాలను గుర్తించాలి.
- గ్రామ మహిళా సంఘాలు పూర్తి స్థాయిలో ప్రణాళిక తయారీలో పాల్గొనాలి.
- గ్రామ పెద్దలు వారి చిన్న నాటి జ్ఞాపకాలతో అప్పట్లో ఉన్న సంప్రదాయక నీటి సంరక్షణ విధానాలు/ నిర్మాణాలతో కూడిన నీటి ప్రణాళికను తయారు చేయాలి. ఈ ప్రణాళికను దృష్టిలో ఉంచుకొని గ్రామ నీటి భద్రతా ప్రణాళికను సిద్ధం చేయాలి

**ప్ర. నీటి భద్రతా ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయితీ స్థాయిలో అనువైన నీటి సరఫరా పథకాన్ని ఎలా నిర్ణయించుకోవాలి?**

జ. సర్వే తదుపరి సమాచారాన్ని క్రోడీకరించుకున్న తరువాత గ్రామ స్థాయిలో గ్రామ పంచాయితీ, విడబ్ల్యుయస్‌సి మెంబర్లు, ప్రజలు, సాంకేతిక నిపుణులు మరియు సలహాదారులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలి. సమావేశం నిర్వహించడం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమంటే

- సమస్యలను గుర్తించడం
- పరిష్కారాలను చర్చించడం
- అందుబాటులో వున్న పరిష్కార మార్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- నీటి వనరుల స్థిరత్వానికి తీసుకోవలసిన చర్యలను ఖరారు చేయడం అందుకు కావలసిన పెట్టుబడి మరియు నిర్వహణా వ్యయాన్ని లెక్కించడం ద్వారా

✓ నీటి సరఫరా వ్యవస్థల నిర్వహణకు సమర్థ విధానాన్ని రూపొందించుకోవడం.

✓ అందరికీ సమానంగా నీటి సరఫరాకై ఎలాంటి నియంత్రణా చర్యలు గుర్తించాలి.





✓ నిర్వహణా వ్యయాన్ని భరించడం ఎలా అనే అంశాలను ప్రజా భాగస్వామ్యంతో ఖరారు చేయాలి.

- విడబ్ల్యుయస్‌సి సభ్యులకు, పంపు ఆపరేటర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బందికి అవసరమగు శిక్షణ/ అవగాహనా కార్యక్రమాలను గుర్తించాలి.
- చిట్ట చివరిగా గ్రామ పంచాయితీ తయారు చేసిన ప్రణాళికలకు గ్రామ పంచాయితీ/ గ్రామ సభ ఆమోదం పొందిన తరువాత గ్రామ నీటి భద్రతా ప్రణాళికను అమలు పరచాలి

**జాతీయ గ్రామీణ త్రాగునీటి సరఫరా పథకం**

గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి సరఫరా కోసం అమలవుతున్న ఏకైక ప్రభుత్వ పథకం గ్రామీణ త్రాగునీటి సరఫరా పథకం. ఈ పథకంలో ప్రతి గ్రామానికి సరిపడా పరిమాణంలో నీరు అందించడం (ప్రస్తుతం ఈ పరిమాణం తల ఒక్కింటికి రోజుకు 55 లీటర్లుగా నిర్ణయించారు).

- సరఫరా చేసే నీరు త్రాగుటకు అనువైనదై ఉండాలి (కలుషితం కాని నీరు)
- త్రాగునీటి సరఫరా పథకాల రోజువారీ పనులు మరియు నిర్వహణ
- త్రాగునీటి వనరుల భద్రత లేదా స్థిరీకరణ
- త్రాగునీటి నాణ్యత మూల్యాంకనం
- ఐఇసి (సమాచారం, విద్య మరియు ప్రచారం కార్యక్రమాలు)

పైన పేర్కొనిన అంశాలవారీ కావలసిన ఆర్థిక సహకారాన్ని అందిస్తూ, గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన త్రాగునీటిని గ్రామ స్థాయిలోని వనరుల ఆధారంగా ఏ తరహా నీటి సరఫరా వ్యవస్థ అనుకూలమో అట్టి వ్యవస్థ ఏర్పాటుకు గ్రామ పంచాయితీ స్థాయి నుండి ప్రతిపాదనలు పంపించవలసి ఉంటుంది. అట్టి ప్రతిపాదనలను పరిశీలించి ఆమోదయోగ్యంగా ఉన్నట్లయితే ఆ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తుంది. సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో (ప్రభుత్వ అధికారులు) పథకాన్ని ఏర్పాటు చేయడం. తదుపరి పథక నిర్వాహణా బాధ్యతలు మొత్తం పంచాయితీ రాజ్ సంస్థలకు బదలాయింపు చేయడం జరిగింది.

- ఏ గ్రామాలకు అయితే రక్షిత త్రాగునీటి సరఫరా అందుబాటులో లేదో అట్టి గ్రామాలకు మొదటి ప్రాధాన్యత నివ్వడం జరుగుతుంది.
- ఏ గ్రామాలలో అయితే త్రాగునీరు కలుషితమవుతున్నదని నిర్ధారణ అయినదో అట్టి గ్రామాలకు ఈ జాతీయ గ్రామీణ త్రాగునీటి సరఫరా పథకం క్రింద మొదటగా ప్రాధాన్యతనిస్తారు.

టిసిపార్థు



# గ్రామాభివృద్ధి సాధనకు ప్రజలందరు భాగస్వాములు కావాలి

**తె**లంగాణ రాష్ట్రం చేపట్టిన గ్రామ జ్యోతి కార్యక్రమం గాంధీజీ ప్రతిపాదించిన గ్రామంలో రామరాజ్య స్థాపన వైపు నడక ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలందరిని గ్రామాభివృద్ధిలో భాగం చేస్తూ గ్రామంలో ఆరోగ్యం పెంపొందించేందుకు పారిశుధ్యంను పాటింపచేయడం. అందరికి వైద్య సహాయంను అందునట్లు చూడడం. గ్రామంలో ప్రతివారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం. మన గ్రామంను మనమే బాగు చేసుకొనే దిశగా వ్యవసాయ, పశుపోషణ చేపట్టడం చేయాలి. గ్రామం ప్రజలందరికి సురక్షిత త్రాగునీరు అందజేయడం వంటి కార్యక్రమాలు చేపట్టి అమలు చేయడం గ్రామజ్యోతి కార్యక్రమం ఉద్దేశ్యం.

గ్రామస్థులందరిని గ్రామంలో జరిగే కార్యక్రమాలతోపాలు పంచుకొనేలా చేయడమేకాక పన్నులు కట్టి గ్రామాభివృద్ధికి పురికొల్పేలా తోడ్పడం. గ్రామ జ్యోతి కార్యక్రమం ద్వారా ప్రోత్సహించడం. అందుకు గ్రామస్థులందరిని సర్పంచ్ ఆధ్వర్యంలో ''గ్రామసభ''ను నిర్వహించుకొనుటకు సహాకరించి అధికారులు తమ గ్రామపురోభివృద్ధికి పాటు పడునట్లు చేయడం.

గ్రామంలోని పలు విభేదాలు రాజకీయాలకు స్వస్తి చెప్పి గ్రామాభివృద్ధికి ప్రతిపౌరుడు తమవంతు సహాయ సహాకారాలను అందించులాగా చేయడమే గ్రామజ్యోతి కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం. గాంధీజీ ప్రతిపాదించిన సహకార ఉద్యమంలో గ్రామ పాలన ద్వారా గ్రామపురోభివృద్ధి సాధించుటకు కృషి చేయడం. గ్రామంలో నున్న పౌరులందరిని భాగస్వాములును చేసి పరిశుభ్రత, పారిశుధ్యంను సాధించుట గ్రామానికి కావలసిన అవసరాలను కమిటీలను ఏర్పాటు చేసుకొని గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేయడం. ప్రతి గ్రామంలో ఏడు కమిటీలను ఏర్పాటు చేసి, 63,64 జి.ఓ.లను పంచాయతీరాజ్‌శాఖ ఆదేశించిన మేర విద్యాకమిటీ, త్రాగునీరు కమిటీ, పారిశుధ్య కమిటీ, పౌష్టికాహార సరఫరా కమిటీ, మౌలిక సదుపాయల కల్పన కమిటీ, 6 రోడ్ల నిర్మాణం కమిటీ, 7 సమన్వయ సహాకర కమిటీలను గ్రామంలో

అన్ని పనులు చూడడం. గ్రామసభను సమావేశపరచి గ్రామంలో జరుగుతున్న అంశాలను చర్చించి తగు నిర్ణయాలు చేసి సర్పంచ్, వార్డు సభ్యులను గ్రామాభివృద్ధికి తోడ్పడేలా చేయడమే గ్రామజ్యోతి లక్ష్యం. ఈ లక్ష్యాలను సాధించుటకు గ్రామస్తులందరు కలసికట్టుగా పనిచేయవలసి ఉంటుంది. కాని గ్రామస్తులందర్ని ఒక త్రాటిపై నడిపించడం కత్తిమీద సాములాంటిది. అందరిని గ్రామాభివృద్ధికి చేయూత అందజేయాలగున చేసి అభివృద్ధి పథంలో నడిపించుట చేసినపుడు గాంధీజీ ఆశించిన గ్రామస్వరాజ్యం ఏర్పడినట్లేనని చెప్పవచ్చును.

ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను గ్రామంలోని అర్హులందరికి అందునట్లు చూడాలి. ముఖ్యంగా వృద్ధాప్య పెన్షన్‌లు. ప్రజాపంపిణీ క్రింద అందించే బియ్యం, చక్కెర, గ్యాస్ తదితర సబ్సిడీ వస్తువులు అర్హులందరికి లభించేలా గ్రామ ప్రజాపంపిణీ కమిటీ చూడాలి. గ్రామంలోని బీదబిక్కి జనంను కూడ కలుపుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి. గ్రామంలో గూడులేని వారికి నీడ కల్పించడం. అంటే గృహ నిర్మాణం పేదలకు అందేలా చూడడం. ఇక్కడ సమన్యాయంను పాటించాలి. గ్రామంలో పాఠశాలను క్రమపద్ధతిలో నడిపించాలి. అప్పుడే గ్రామజ్యోతి విజయవంతం అయినట్లు. అందరికి త్రాగునీరు అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామకమిటీలు చూస్తారు. ఇవి అన్ని జరిగేది గ్రామ పంచాయతీలు ఒకతాటిపై నడుస్తు కలిసికట్టుగా ముందుకు నడవాలి అనే నిశ్చయంతో నడవాలి. లేని యెడల పంచాయతీలకు 5 సం॥రాల కొకసారి ఎన్నికలు తప్పనిసరిగా జరుపవలె. అవి రాష్ట్ర ఎన్నికల కమీషన్ ద్వారా నిర్వహించవలెను. పంచాయతీలను చూచేందుకు రాష్ట్ర ఆర్థిక సంఘంను ఏర్పాటు చేయవలె. ఇవి అన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగితేనే 73,74 రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రం ఇచ్చిన నిధులు సర్పంచ్‌లకు అందుతాయి. దేశంలో ప్రప్రథమంగా తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాలు కేంద్ర ఆదేశాలు పాటిస్తున్నాయి. బీహారులాంటి కొన్ని రాష్ట్రాలులో పంచాయతీలకు ఎన్నికలు జరుగనందున కేంద్రం నిధులు అందడం లేదు.

తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖ పరిపుష్టిగా తన కార్యక్రమాలను నిర్వహించుతూ కేంద్రం అందించుతున్న 4వ ఆర్థిక సంఘం నిధులు రూ.282కోట్లు పొందుతుంది. పంచాయతీలు తమ విధులను సక్రమంగా నిర్వహించుతున్న బహుమానం ను 2015కు దక్కించుకొంది. అదే విధంగా గ్రామాలను బాగు చేయుటలో ప్రజల భాగస్వామ్యంను పెంపొందించేందుకు గ్రామ జ్యోతి కార్యక్రమంను నిర్వహించి గ్రామ పంచాయతీ పాత్రను గ్రామాభివృద్ధిలో భాగం పంచుకొనవలెనని పనిచేస్తుంది. ఆ దిశగా వరంగల్ జిల్లాలోని గంగదేవునిపల్లి, కరీంనగర్ జిల్లాలోని ముల్కానూరు, ఆదిలాబాద్ జిల్లాలోని అంకాపూర్‌లు మోడల్ గ్రామాలుగా తీర్చుదిద్దుకొన్నారు.

గ్రామాలుకు సర్పంచ్‌లుగా ఎన్నికైన వారి అవగాహన మీద అభివృద్ధి కార్యక్రమాలు మీద ఆధారపడి ఉంటుంది. కనుక గ్రామస్థులు మంచి వ్యక్తి సర్పంచ్‌గా ఎన్నుకొని తమ గ్రామాన్ని అభివృద్ధి పరచుకొనులాగున చూచుకొనవలెను. గ్రామాన్ని అభివృద్ధి పరచేందుకు ఎవరో ఒకరు లక్ష్యంతో ముందుకు వస్తే ఆ గ్రామం గ్రామ స్వరాజ్యంగా ఏర్పడుతుందనుట నిజం.

## అభివృద్ధి చెందిన గ్రామంకు ఉండవలసిన లక్షణాలు

1. గ్రామ సర్పంచ్ ఎన్నికల అనంతరం సామరస్య పూర్వకంగా కలిసి మెలిసి కలిసికట్టుగా శాంతి – సహజీవనం కొనసాగించడం.

2. గ్రామాభివృద్ధికి ప్రతి ఇంటి యజమాని

- పరిశుభ్రతను పాటించడం.
- మరుగు దొడ్డును ఉపయోగించడం.
- గ్రామంలో రోడ్లు (మట్టిరోడ్డైన) శుభ్రంగా ఉంచుకోవడం. రక్షిత మంచినీరు సదుపాయం కలిగి ఉండుట.
- గ్రామస్థులతో సహకరించడం.
- సకాలంలో పన్నులు చెల్లించడం.
- ఆరోగ్య సూత్రాలను పాటించడం.
- ప్రజాపంపిణీ, త్రాగునీరు సరఫరా పొందడం.
- పెన్షన్ పొందే వారికి లబ్ధి చేకూర్చడం.
- పిల్లలను బడికి పంపించడం. తను అక్షరాస్యుడుగా మారడం.
- సారా, గుట్కాలకు దూరంగా ఉండడం.
- గ్రామరక్షణను కాపాడుకోవడం.
- స్మశాన వాటికను కలిగి ఉండడం.

3. ఆదాయ వనరులను గ్రామస్తులందరు కలిగి ఉండేలా పెంపొందించడం.

4. నిరోద్యగంను తొలగించుకోవడం

5. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందుబాటులో ఉంచడం.

గ్రామ సర్పంచ్ అధికారులతో కూడి గ్రామ సమస్యలను పరిష్కరించుటకు పూనుకొనవలె.

24 శాఖల అధికారులో 1/3 వంత మందిని సమావేశపరచి గ్రామ సభను నిర్వహించడం

కనీస సౌకర్యాలు గ్రామానికి కల్పించుకొనడం పనులు నిర్వహించి లక్ష్యసిద్ధికి ప్రోత్సహించాలి.

జిల్లా పరిషత్, మండల అధికారులతో కలిసి గ్రామవసరాలకు తోడ్పడునట్లు కోరాలి. సమన్వయంతో గ్రామాన్ని ముందుకు నడిపించే సత్తాను సర్పంచులు అలవర్చుకొనవలె. ముఖ్యంగా మొదటిసారి పంచాయతీ సర్పంచ్‌లుగా ఎన్నికైన వారిని మొత్తం కేంద్ర, రాష్ట్ర అభివృద్ధి పథకాల మీద అవగాహన పెంచుకొనులాగున చేసి శిక్షణను యిచ్చి గ్రామజ్యోతి కార్యక్రమాలలో ప్రజలందరిని భాగస్థులుగా చేయడం ద్వారా గ్రామాభివృద్ధిని సాధించడం లక్ష్యంగా పనిచేయవలయును. అంటే తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో పనిచేసి ముందుకు నడవాలి.

ప్రధానంగా గ్రామ ప్రజలలో నున్న అవగాహేన రాహిత్యంను తొలగించి, పూర్తిస్థాయిలో అధికారులను తర్ఫీదు చేసి ప్రజలకు గ్రామ జ్యోతి కార్యక్రమ ఉద్దేశ్యాలను వివరించవలయును. అంతేగాక ప్రజల ముందుకు పాలన వలన కలిగే లక్ష్యాలను చేరే లాగున చూడవలసిన బాధ్యత సర్పంచ్ ప్రభుత్వోద్యోగులపైనున్నది.

**టిసిపార్థు**

# పేదరికము – నిర్మూలనా కార్యక్రమాలు



పేదరికము విషయంలో, భారత ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా, ఇంకా చాలా మంది ప్రజలు పేదరికంలో ఉంటున్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న అనేక దేశాలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలలో పేదరికం ఒకటి. భారతదేశం కూడా పేదరికం సమస్యలతో పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. పేదరికం అనేది ఒక సామాజిక ఆర్థిక లక్షణం. సమాజంలో ఎక్కువ శాతం ప్రజల కనీస అవసరాలైన, ఆహారం, ఉ ఒడటానికి ఇల్లు, ధరించుటకు వస్త్రాలు, లేనటువంటి స్థితిని, పేదరికంగా చెప్పవచ్చును. ప్రణాళిక సంఘం ఏర్పాటు చేసిన ఆరల్ ప్రణాళికా కాలంలో ఉపసంఘం చేసిన మార్గదర్శకాల ప్రకారం ఒక రోజుకు ఒక వ్యక్తి గ్రామీణ ప్రాంతాలలో 2400 కేలరీలు, పట్టణ ప్రాంతాలలో అయిన 2100 కేలరీలు కంటే తక్కువ శక్తినిచ్చే ఆహారం తీసుకునేవారికి పేదరిక రేఖ దిగువన జీవిస్తున్న వారిగా నిర్ధారించవచ్చును.

పేదరికం రెండు రకాలుగా వర్గీకరించవచ్చును. అవి

**1. సాపేక్ష పేదరికం 2. నిరపేక్ష పేదరికం.**

**1.సాపేక్ష పేదరికం :**

పేదరికం అనేది ఆదాయంలో ఉన్న అధిక అసమానతలను సూచిస్తుంది. దేశంలో అధిక ఆదాయం పొందుతున్న వారితో పోలిస్తే తక్కువ ఆదాయం పొందుతున్న వారు పేదరికంలో ఉన్నట్లుగా భావించటం జరుగుతుంది. అధిక ఆదాయం పొందుతున్న వారిపై 5 లేదా 10 శాతం ప్రజలతో అట్టడుగు 5 లేదా 10 శాతం ప్రజలను పోల్చి పేదరికాన్ని నిర్వచిస్తారు.

**2. నిరపేక్ష పేదరికం :**

ఒక వ్యక్తి కనీస జీవన స్థాయి కన్నా తక్కువ స్థితిలో ఉండే దానిని నిరపేక్ష పేదరికం అంటారు. అంటే కనీస అవసరాలు అయినటువంటి ఆహారం, వస్త్రాలు, గృహం పొందలేని పరిస్థితిలో ఉంటే, అవి నిరపేక్ష పేదరికం అవుతుంది. కనీస వ్యయం కూడా చేయలేని పరిస్థితిలో ఉన్న వారిని, పేదరిక రేఖ దిగువ ఉన్నట్లుగా నిర్ధారిస్తారు.

**జనాభా పెరుగుదల :**

దేశజనాభా విపరీతంగా పెరుగుతూ ఉండటం వలన అది పేదరికానికి దారి తీస్తుంది. పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా కనీస అవసరాలు, ఆహారం, గృహం, వస్త్రం మొదలైనవి లభించకపోవటంతో పేదరికం ఏర్పడుతుంది.

**2. నిరుద్యోగం :**

ప్రజలలో ఎక్కువశాతం సరైన ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా జీవిస్తూ ఉంటారు. ఇవి పేదరికానికి దారితీస్తుంది.

**3. ఆర్థిక అసమానతలు :**

భారతదేశ సామాజిక వ్యవస్థలో లోపాలు వలన భూసంస్కరణలు సరిగా అమలు చేయకపోవటం వలన గ్రామీణ ప్రాంతాలలో భూములు గరిష్టంగా కొంతమంది చేతులలోనే కేంద్రీకరింపబడ్డాయి. అలాగే పట్టణ ప్రాంతాలలో కూడా పట్టణీకరణ, పారిశ్రామికరణ వలన ఆస్తుల విలువ పెరిగి ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు ఏర్పడి, ఆస్తులు లేని వారు పేదరికాన్ని అనుభవిస్తున్నారు. ఇవికాక ఇంకా వనరులను సరిగా వినియోగించకపోవటం, అధిక శాతం ప్రజలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయంలో ఉత్పాదక తక్కువగా ఉండటం వలన, కులవ్యవస్థ, ఉమ్మడి కుటుంబ విధానం, వారసత్వ చట్టాలు పేదరికాన్ని తగ్గించటానికి సరియైన విధానాలను అవలంభిచకపోవటం మొదలైనవి కూడా పేదరికానికి కారణాలుగా ఉన్నాయి. వీటన్నిటి మూలంగా భారతదేశంలో పేదరికం ప్రధాన సమస్యగా ఏర్పడిందని చెప్పవచ్చును.

**పేదరిక నిర్మూలనా చర్యలు :**

ఐక్యరాజ్య సమితి మిలీనియం శిఖరాగ్ర సమావేశం 2000 సం॥రం, సెప్టెంబరులో 189 ప్రపంచ దేశాల నాయకులు ప్రపంచ పేదరికానికి ముగింపు పలకాలని కనీవినీ ఎరుగని నిర్ణయాన్ని తీసుకున్నారు. మిలీనియం అభివృద్ధి లక్ష్యాలుగా () భావించే పేదరిక నిర్మూలన, మానవ ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం, ప్రపంచ శాంతిని నెలకొల్పటం, ప్రజాస్వామ్య పర్యావరణ నిలకడగల స్థితిని పెంపొందించటము, మొదలైన 8 లక్ష్యాలను ప్రపంచ వ్యాప్తంగా సాధించటానికి తమవంతు కృషిని చేయాలని ఈ దేశనాయకులు అంగీకరించారు.

ఐక్యరాజ్య సమితి మిలీనియం శిఖరాగ్ర సమావేశానికి మూడు దశాబ్దాల పూర్వమే పేదరికం ఒక శాపమని, దాని నిర్మూలించటానికి, ఆర్థికాభివృద్ధి వంటి పరోక్ష చర్యలు నిరుపయోగమని, భారతదేశం

గుర్తించడం జరిగినది. అభివృద్ధి సిద్ధాంతరీత్యా ప్రతి ఒక్కరు అభివృద్ధి ఫలితాలను పొందుతారు. కానీ ఫలితాలలోని వాటా వారి వారి శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది. శక్తి సామర్థ్యాలు ఆర్థిక, స్థితిగతులపై పరపతి లభ్యత, సాంకేతిక పరిజ్ఞాన సమాచారం ఉద్యమిత్వం మొదలైన కారకాలను సమకూర్చుకోవటముపై ఆధారపడి ఉంటాయి. బలహీనమైన ఆర్థిక స్థోమత వల్ల పేదవారు అటువంటి కారకాలు సమకూర్చుకోలేదు. అందువల్ల ఆర్థికాభివృద్ధి వీరికి ప్రయోజనాత్మకంగా ఉండదు. ఈ విషయాన్ని 1970వ సం॥ ప్రారంభంలో గుర్తించిన భారతదేశ ప్రభుత్వం వివిధ వర్గాలకు చెందిన పేదవారిని లక్ష్యంగా పెట్టుకొని, వారి వ్యూహ్యం ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేసింది.

**కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు**

1. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి భీమా యోజన (పిఎంజిజెబివై)
2. భేటిబచావో భేటీపడావో
3. ప్రధానమంత్రి ముద్ర యోజన
4. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (పి.యం.జి.యస్.వై.)
5. దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన (డి.డి.యు.జి.జె.వై)
6. ప్రధానమంత్రి పంట భీమా పథకం
7. అతల్ పెన్షన్ యోజన (ఎపివై)
8. సర్వశిక్ష అభియాన్ (యస్.యస్.ఎ.)
9. మధ్యాహ్న భోజన పథకం
10. రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై.)
11. సాక్షర భారత్
12. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్)
13. జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం
14. సమగ్రశిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్)
15. ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన
16. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి భీమాయోజన
17. ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన
18. ఆమ్ ఆద్మీ భీమా యోజన
19. రాష్ట్రీయ సాస్థ్య భీమా యోజన
20. సుకన్య సమృద్ధి యోజన
21. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన
22. భవన నిర్మాణము మరియు ఇతర నిర్మాణ కార్మికుల భీమా పథకం
23. స్వచ్ఛభారత్ మిషన్
24. ముద్రా బ్యాంక్

**రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు**

1. కళ్యాణ లక్ష్మి
2. షాదీ ముబారక్
3. ఆసరా



4. ఆరోగ్య లక్ష్మి
5. మిషన్ భగీరథ
6. గ్రామజ్యోతి
7. హరిత హారం
8. మిషన్ కాకతీయ
9. ప్రజాపంపిణీ వ్యవస్థ - వ్యక్తికి 6 కిలోల బియ్యం 1 రూ॥చొప్పున
10. పేదలకు డబుల్ బెడ్‌రూమ్
11. షీ బృందాలు
12. దళిత కుటుంబాలకు 3 ఎకరాల భూమి
13. పల్లె సమగ్ర సేవా కేంద్రాలు
14. కెజి టూ పిజి ఉచిత విద్య
15. రైతులకు ఋణ మాఫీ
16. స్వచ్ఛ తెలంగాణా, స్వచ్ఛ హైదరాబాద్
17. తెలంగాణా పల్లె ప్రగతి
18. విత్తన బండాగారం
19. 5 రూ॥లకు భోజనం
20. డిజిటల్ తెలంగాణా
21. డ్రైవర్ కమ్ ఓనర్ పథకం
22. తెలంగాణ పారిశ్రామిక విధానం

**పేదరిక నిర్మూలనలో స్వయం సహాయక బృందాల పాత్ర**

స్వయం సహాయక బృందాల పాత్ర అత్యున్నత సహాయంగా, మన జాతిపిత గాంధీ భావించారు. స్వయం సహాయం ద్వారా సమాజ సంక్షేమాన్ని పెంపొందించుకోవచ్చుననే అంశాన్ని 1954వ సంవత్సరంలో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సులో డచ్ సామాజిక సహాయ నాయకుడు జె.ఇ.డి. తెలియజేశారు. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల స్త్రీల, పిల్లల అభివృద్ధి అనే పథకం ఆవిర్భవించినది. ఈ పథకం ప్రకారం కొంత మంది స్త్రీలు ఒక బృందంగా ఏర్పడి తమ



# చత్తీస్‌ఘడ్ ప్రజాప్రతినిధులుకు టిసిపార్డులో శిక్షణ

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థ మరియు “టాకూర్ ప్యారేలాల్ ఇన్స్టిట్యూట్” ఆఫ్ రూరల్ డెవలెప్‌మెంట్ (టిపిర్డ్) సంయుక్త సహకారంతో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుండి వచ్చిన ప్రజాప్రతినిధులు మరియు అధికారులు బృందంకు సోమవారం నుండి 7 రోజులు శిక్షణా కార్యక్రమము టిసిపార్డు కమీషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్ ఐ.ఏ.ఎస్. గారి ఆధ్వర్యంలో శ్రీకారం కాబడింది.

బృందంలో సభ్యులైన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్స్, వైస్ ఛైర్‌పర్సన్స్, మండలాధ్యక్షులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, మరియు అధికారులు ఈ ఏడు రోజుల్లో 4 రోజులు తరగతి గదిలో సెషన్స్ మిగిలిన మూడు రోజులు క్షేత్రస్థాయి సందర్శనలో పాలుపంచుకుంటారు.

తెలంగాణ జిల్లాలోని గ్రామీణాస్థాయిల్లో అమలవుతున్న వివిధ పథకాల రూపకల్పన, పథకాలు అమలవుతున్న తీరు, పరిశీలిస్తారు. పథకాలైన గ్రామజ్యోతి, జి.పి.డి.పి. ప్రణాళికలు, డిజిటల్ తెలంగాణ, ఇంకుడుగుంతలు నిర్మాణం, ఓడిఎఫ్, ఐఎస్ఎల్ఎస్, ఓఎఫ్‌డి, చెంచు ప్రిమిటివ్ ట్రైబ్ అభ్యున్నతి కోసం ప్రభుత్వం రూపొందించిన మొదలగు పథకాలపై అధ్యయనం చేశారు. అందులో భాగంగానే టిసిపార్డులో ట్రైనింగ్ తీసుకుంటున్న సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. న్యాయాలు, చట్టాలుపై అవగాహన సమస్యలను సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు ఏ విధంగా స్పందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. చత్తీస్‌ఘడ్‌లో కూడా ఈ వ్యవస్థను రూపొందిస్తామని బృందం సభ్యులకు వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో టిసిపార్డు జాయింట్ డైరెక్టర్ శ్రీ కె.యాదయ్య, సి.డి.పి.ఏ. సెంటర్ హెడ్ శ్రీ శేషాద్రి, కుసుమ మాధిరి మరియు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంల నుండి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షగా కార్యక్రమం సిడిపిఎ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

**టిసిపార్డు**

ఆదాయంలో రోజుకు రూపాయి వంతున పొదుపు చేస్తారు. పొదుపు మొత్తాన్ని బ్యాంకులలో దాచుకొని అవసరం ఉన్న సభ్యులకు రుణాలుగా అందిస్తారు. దీనికి తోడు స్థిరపడిన బృందాలకు బ్యాంకుల ద్వారా బృందం అందించే హామీ ఆధారంగా బృందాలకు పరిపతిని అందిస్తాయి. పొదుపు, బ్యాంకుల రుణాల ద్వారా (వడ్డీలేని) సమకూర్చుకున్న మొత్తంతో స్వయం సహాయక బృందాలు ఉమ్మడిగాను, లేదా వ్యక్తిగతంగాను వివిధ ఆర్థిక కార్యకలాపాలను చేపడతారు. వీటి నుంచి లభించే ఆదాయాన్ని వినియోగ అవసరాలతోపాటు పిల్లల ఆరోగ్యం, విద్య మొదలైన వాటికి వినియోగించటం జరుగుతుంది.

ఈ రకమైన స్వయం సహాయక బృందాలు మహిళల్లోనే కాకుండా వివిధ సామాజిక వర్గాలలోను అనూహ్యంగా ఏర్పడి వృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో స్వయం సహాయక బృందాలు పనితీరు చాలా బాగుంది. బ్యాంకులు ఎలాంటి వ్యక్తిగత హామీలు లేకుండా ఈ బృందాలకు ఋణ సహాయం అందిస్తుంది.

గ్రామీణ ప్రాంతాలలో వడ్డీ వ్యాపారుల ప్రభావం తగ్గటానికి, పేదరిక నిర్మూలనకు విద్య, ఆరోగ్యం పెరుగుదలకు మహిళల్లో చైతన్యం రావటానికి వారు సాధికారత సాధించటానికి ఈ వ్యూహం ఎంతో తోడ్పడుతుంది.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అనుసరించే లక్ష వర్గాల పద్ధతి ఒక స్వల్పకాల చర్యలుగాను, స్వయం సహాయక బృందాల వ్యూహం మాధ్యమికాల చర్యలుగాను భావించవచ్చును. కానీ దీర్ఘకాలిక చర్యలను చేపట్టవలసి ఉంటుంది. భూ సంస్కరణలు, గ్రామీణ పారిశ్రామీకరణ, నిరక్షరాస్యత నిర్మూలన, జనాభా పెరుగుదల నియంత్రణ చర్యలను పేదరిక నిర్మూలనా కొరకు మన ప్రభుత్వం చేపట్టే దీర్ఘకాలిక చర్యలు, పేదరికం త్వరలోనే నిర్మూలనగా భావించవచ్చును.

**టి.యం.కె.గాంధీ**

# నీటి పొదుపు నిత్యం జరగాలె



**ఎండాకాలంలో మాత్రమే నీటి పొదుపు గురించి ఆలోచిస్తే కుదరదు. వర్షాలు పడ్డప్పుడే నీటి పొదుపు గురించి ఆలోచించాలి. ఎలాగైతే మన పూర్వీకులు వర్షాలు పడ్డప్పుడే నీటి పొదుపు కోసం చెరువులు నిర్మించారో మనం కూడా ఒక్క నీటి చుక్క కూడా వృథా కాకుండా చూసుకోవడం అవసరం. అందుకు ఇంటింటా ఇంకుడు గుంతలతో పాటు వాడవాడకు, వీధివీధికి సంపుల్లాంటి నీటి గుంతలు పెద్దఎత్తున కట్టి రోడ్లమీద ప్రవహించే నీరంతా వాటిలో ఇంకే విధంగా రూపకల్పన చేసుకోవాలి. రోడ్లు, ఇండ్లు, ఖాళీ స్థలాలు అన్నీ సిమెంట్, తారు రోడ్లతో, షాబాద్‌రాళ్లతో నింపి మట్టి అంటకుండా చేస్తే నీళ్లు ఎక్కడ ఇంకాలి?**

**క**రువు కాలంలో మాత్రమే నీటి పొదుపు గురిం చి ఆలోచిస్తే చాలదు. వర్షాకాలంలోనే నీటి పొదుపు గురించి ఆలోచించాలి. సంపద అంతా ఖర్చయ్యాక పొదుపు గురించి ఆలోచించే బదులు ఖర్చు పెట్టే ముందే పొదుపుగురించి ఆలోచించినట్లు నీటి పొదు పు గురించి ఆలోచించడం అవసరం. ప్రస్తుతం కరు వు కాలంలోనే నీటి గురించి చర్చించుకోవాల్సి రావ డం విచారకరం. దూరదృష్టితో నూతన ప్రభుత్వం ఆలోచించి మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ప్రణాళికలు చేపట్టినప్పటికీ, అప్పటికే ఆలస్యమైపోయిం ది. గత పాలకుల నిర్వాకం వల్ల దేశం నీటి కటకట ఎదుర్కొంటున్నది. ఇప్పుడు దేశమంతటా ముఖ్యం గా మహారాష్ట్రతో సహా దక్షిణ భారతంలో నీటి కరు వు తాండవిస్తున్నది. నీటి పొదుపు గురించి ఆలోచనల్లో మార్పు రావాల్సిన అవసరముంది. ఈ నేప థ్యంలో నా అనుభవమొకటి మీతో పంచుకుంటాను.

హైదరాబాద్ శివంరోడ్డు బాగ్‌అంబర్‌పేట రెడ్ బిల్డింగ్ ప్రాంతంలో గల మా అపార్ట్‌మెంట్ నల్లా గత కొంతకాలంగా ప్రెషర్ బాగా తగ్గిపోయింది. వాటర్‌వర్క్స్ వాళ్లు మెయిన్ పైప్‌లైన్ నుంచి చెక్ చేస్తూ అన్నీ సరిచేస్తూ ఇక ఇంతకన్నా ఎక్కువ చేసే దేం లేదన్నారు. మా నీళ్ల కొరత తీరలేదు. మా బోరుబావి ఆరేడేళ్లుగా నిరంతరం పనిచేసి, అడుగున ఉన్న నీటి జల ఇంకిపోయింది. 350 అడుగుల లోతు దాకా వేసిన బోరు ఎండిపోయింది. పైప్‌లన్నీ తీసి మట్టి పూడిందేమోనని చెక్ చేశాం. ఎంత చేసినా బోరుబావి ఒట్టిపోయిన ఆవులా మారిపోయింది. మా తరువాత బోరు వేసుకున్న వాళ్లు కొందరు ఇంకా ఎక్కువ లోతుకు బోర్లు వేసుకోవడం కూడా మా బోరు ఎండిపోవడానికి కారణమని కొందర న్నారు. ఏమైతేనేం రోజూ ట్యాంకర్లతో నీళ్లు తెప్పించుకోవాల్సి వస్తున్నది. పొద్దంతా ట్యాంకర్లు ఎప్పు డు వస్తాయో అని అన్ని పనులు మానుకుని ఎదురు చూడాల్సి వస్తున్నది.

బోరున్నంతకాలం నల్లనీళ్లు తక్కువ వచ్చినా ఎక్కువ శ్రద్ధ పెట్టలేదు. బోరు ఎండిపోయాక నీళ్ల కష్టం తెలిసివస్తున్నది. అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఉన్న ఎనిమిది కుటుంబాలకు రోజూ నీటికి కటకట. ఎన్ని ట్యాంకర్లు వచ్చినా సరిపోవడం లేదు. మేం అపార్ట్‌మెంట్ రెసిడెంట్‌ల మీటింగ్‌లు పెట్టుకుని అనేక విధాలుగా చర్చించాం.

దేశంలో రుతుపవనాలను అనుసరించి వ్యవసాయం, జీవన విధానం వేలయేళ్లుగా కొనసాగుతూ వస్తున్నది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భార త ఉపఖండంలో మాన్‌సూన్‌లోనే వర్షాలు పడతాయి. మన పూర్వీకులు దీన్ని గమనించి నీటిని పొదుపు చేసుకోవాలని, వచ్చిన వర్షాకాలపు నీటిని నిల్వ చేసుకుని వాడుకోవాలనే ఆలోచనకు రావడం జరిగింది.

అలా శాతవాహనుల కాలం నుంచి దక్క న్ పీఠభూమిలో చెరువుల నిర్మాణం సాగుతూ వస్తున్నది. చాళుక్యులు, కాకతీయులు, బహమనీ సుల్తాన్‌లు, కుతుబ్‌షాహీలు, నైజాం రాజులు దాన్నే మరింత పటిష్టంగా, శాస్త్రీయంగా కొనసాగిస్తూ గొలుసుకట్టు చెరువుల

నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. చెరువుల టెక్నాలజీ కాకతీయులదైతే.. మోట బొక్కెన, రాటు బొక్కెనతో నీళ్లు చేదే టెక్నాలజీ ముస్లిం పాలకులు అందించిన టెక్నాలజీ అని చాలా మందికి తెలియదు. గొలుసుకట్టు చెరువుల నిర్మాణంలోనే ఒక పొదుపు పథకం ఉంది. ఒక చెరువు నిండితే ఆ చెరువులో అదనంగా చేరే నీరు మరో కింది చెరువులోకి చేరే విధంగా మత్తడి రాతి కట్టడం తో ఏర్పాటు చేసేవారు. మత్తడి దుంకింది అంటే చెరువు నిండిందని అర్థం. మరో చెరువు నిండుతుందని అర్థం.

నదుల వెంట జీవించే ప్రజలకు, నది నుంచి కాలువ తీసుకుని పొలాలకు మళ్లించే వారికి నీటి పొదుపు తెలియదు. జీవ నదుల వల్ల వారికి ఎప్పు డూ నీరు లభ్యమయ్యేది. అందువల్ల నదీ నాగరికతలో చెరువుల నిర్మాణం తక్కువ. నీటి పొదుపు తక్కువ.మన దక్కన్ పీఠభూమిలో చెరువులు నిర్మించడంలోనే నీటి పొదుపు లక్ష్యం కూడా ఉన్నది.

1970 తరువాత పోచంపాడు ప్రాజెక్టు పుణ్యమా అని ఊరూరా వాటర్ ట్యాంక్‌లు కట్టి మంచినీటి సరఫరా పెంచారు. దాంతో ఇంటింటికీ నల్లాలు, పబ్లిక్ నల్లాలు వచ్చాయి. నల్లాలు రావడంతో నీటి పొదుపు మరిచిపోయి, నీటి వృథా పెరిగింది. నోట్లో బ్రెష్ వేసుకుని వాష్ బేసిన్ నల్లా ఓపెన్ చేస్తే నీళ్లు పోతూనే ఉంటాయి. అలాగే నల్లా నీళ్లు కదా అని షవర్ బాత్‌లు, మూడు బక్కెట్ల నీళ్లు స్నానానికి వాడటం పెరిగింది. అంతకుముందు రోజుకోసారి మాత్రమే స్నానం చేసే వాళ్లు కూడా బ్రాహ్మల తీరు రెండుసార్లు కూడా స్నానం చేయడం పెరిగింది. నల్లా నీళ్లు వృథా పోకుండా కూరగాయలు పెంచడం కూడా చేయలేదు. గార్డెనింగ్ మాత్రం కొంత చేసుకున్నారు. కేవలం అది అందానికి మాత్రమే పనికొచ్చింది. అవి కడుపులోకి వచ్చేవి కావు. నల్లా నీళ్లు వచ్చి నీళ్ల కొరత తీరితే కూరగాయలు పండించడం పెరిగే బదులుగా నీటి వ ృథా పెరిగి కూరగాయలు కొనుక్కోవడం పెరిగింది. ఇలా నగర పంచాయతీ లు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ నగరాల్లో, పట్టణాల్లో నీటి వినియోగం ఎక్కువైపోయింది. నీటి పొదుపు లేకుండా పోయింది. నీటి వాడకానికి అదుపులేకుండా పోయింది.

ఇప్పుడు మాకు నీటికి కటకట ఏర్పడడంతో దేనికెంత నీళ్లు ఖర్చవుతున్నాయో లెక్కలు తీశాం. సుమారుగా ఇంటికి, వంటకు, స్నానాలకు 200 లీటర్లు సరిపోతాయి. కానీ రోజుకు ఒక కుటుంబాని కి 600 లీటర్ల నీళ్లు ఖర్చవుతున్నాయి. తిరిగి పాయిం టు వారీగా చర్చిస్తే అనేక విషయాలు గమనంలోకి వచ్చాయి. వాటర్ ఫిల్టర్ పది లీటర్ల నీరు శుద్ధి చేసి 20 లీటర్ల నీళు వృథా చేస్తున్నది. అందుక ని ఆ వ ృథా నీళ్లను బకెట్లలో పట్టుకోవడం, గిన్నెలు కడగడానికి వాడుకుంటున్నాం. ఆటోమెటిక్ వాషిం గ్ మిషిన్‌లు ఘోరంగా నీళ్లు తాగేస్తున్నాయి.

సముద్రపు నీళ్లను శుద్ధి చేసుకుని తాగే టెక్నాలజీ పెరిగింది. మురికి నీళ్లను అనేక దఫాలుగా ఫిల్టర్ చేసి మంచినీళ్లుగా మార్చే టెక్నాలజీ పెరిగింది. కానీ నల్లా ద్వారా వచ్చే మంచినీళ్లను, బోర్‌నీళ్లను ఫిల్టర్ చేసే పేరిట పది లీటర్లకు 20 లీటర్లు వ ృథా చేయడం అనే టెక్నాలజీ నేటి కాలంలో పనికిమాలినది. బురదనీళ్లలో, వర్షపు నీళ్లలో చిల్లగింజ వేసి నీటిని తేటగా మార్చుకున్న వెనకటి కాలం దీనికన్నా నయం. ఇలాంటి ఆక్వాగార్డ్ వాటర్ ఫిల్టర్లను వెంటనే నిషేధించడం అవసరం. అలాగే మూడు రెట్ల నీళ్లను వ ృథా చేస్తున్న వాషింగ్ మిషిన్‌లను నిషేధించడం అవసరం. నీటి పొదుపులో భాగంగా ఈ మిషిన్‌లను కొత్త టెక్నాలజీతో రూపొందించుకోవడం అవసరం. ఉదాహరణకు డ్రైక్లీనింగ్ పేరిట బట్టలు ఉతకడం గమనించవచ్చు.

అందువల్ల పట్టణాలు, నగరాల్లో కేవలం ఇంకుడు గుంతలు ఒక్కటే చాలవు. రోజువారీ నీటి వినియోగంలో మార్పు రావాలి. నీటిని పొదుపుగా వాడుకోవాలి. ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా రోజుకు ఒక గంట మాత్రమే అపార్టమెంట్ల కు, ఇళ్లకు నీళ్లు ఇచ్చే విధంగా కట్టడి చేసుకోవాలి. 150 లీటర్ల డ్రమ్ములో నీళ్లు పట్టుకుని పెట్టుకోవాలి. చేత్తో, మగ్గుతో నీళ్లు వాడతారు కాబట్టి సగం నీళ్లు పొదుపు అవుతాయి. నల్లాతో డైరెక్ట్‌గా వాడినప్పుడు సగం నీళ్లు వ ృథా అవుతున్నాయి. టాయిలెట్ల ద్వారా కూడా ప్రతిసారీ 10 లీటర్ల దాకా వృథా అవుతున్నా యి. విమానాల్లో నీరు లేకుండా గాలి ప్రెషర్‌తోనే టాయిలెట్లను పరిశుభ్రపరిచే టెక్నాలజీ వాడుతున్నా రు. ఇళ్లల్లో ఈ టెక్నాలజీ ఉపయోగించుకునే విధం గా ప్రయత్నం చేయాలి. ఇలా ఆచరణాత్మకంగా అనే క కోణాల్లో నీటి పొదుపు గురించి అందరూ ఆలోచించడం అవసరం.

దూప అయినప్పుడే బావి తవ్వడం సాధ్యం కా దు. ఎండాకాలంలో మాత్రమే నీటి పొదుపు గురిం చి ఆలోచిస్తే కుదరదు. వర్షాలు పడ్డప్పుడే నీటి పొదు పు గురించి ఆలోచించాలి. ఎలాగైతే మన పూర్వీకులు వర్షాలు పడ్డప్పుడే నీటి పొదుపు కోసం చెరువులు నిర్మించారో మనం కూడా ఒక్క నీటి చుక్క కూడా వ ృథా కాకుండా చూసుకోవడం అవసరం. అందుకు ఇంటింటా ఇంకుడు గుంతలతో పాటు వాడవాడకు, వీధివీధికి సంపుల్లాంటి నీటి గుంతలు పెద్దఎత్తున కట్టి రోడ్లమీద ప్రవహించే నీరంతా వాటి లో ఇంకే విధంగా రూపకల్పన చేసుకోవాలి. రోడ్లు, ఇండ్లు, ఖాళీ స్థలాలు అన్నీ సిమెంట్, తారు రోడ్లతో, షాబాద్‌రాళ్లతో నింపి మట్టి అంటకుండా చేస్తే నీళ్లు ఎక్కడ ఇంకాలి? మనం 1200 అడుగుల లోతు బోరు వేసి నీళ్లు తీస్తే తిరిగి భూమిలోకి నీళ్లు ఇంకే అవకాశం పట్టణాలు, నగరాల్లో ఎక్కడ ఉంది? నీళ్లు ఇంకే అవకాశం లేకపోవడం వల్ల మన ఇళ్లకింది భూమి ఎండిపోతున్నది. లోలోపల మట్టి తడి కోల్పో యి ఇసుకగా మారుతున్నది.

మనం తిరిగి మట్టిని ప్రేమించడం అవసరం. వీలైన చోటల్లా షాబాత్ రాళ్లు తీసివేసి సారవంతమైన మట్టివేసి పూల చెట్లు, కూరగాయల చెట్లు పెంచుకుంటూ వర్షపు నీరంతా ఆ మడి ద్వారా భూమిలోకి ఇంకే విధంగా ఎవరికి వారు కృషి చేయడం అవసరం. దానివల్ల ఇంటికి చల్లదనం కూడా. అందం, ఆనందం కూడా. వచ్చే వర్షాకాలం నుంచైనా మనం నీటిని ఎక్కడికక్కడ నిల్వ చేసుకుంటూ,నీటిని పొదుపుగా వాడుకుంటూ భూగర్భ జలాల మట్టం పెరిగే విధంగా, చెరువులు నిండే విధంగా ఇంకుడు గుంతలతో పాటు అన్ని రకాల ప్రయత్నాలు ఇప్పుడే మొదలు పెట్టడం అవసరం. రేపటి కాలంలో నీటికోసం యుద్ధాలు జరుగుతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇలా అనేక కారణాల రీత్యా నీటి వాడకంలో గతం తాలూకు మైండ్ సెట్ పూర్తిగా మార్చుకోవడం అవసరం.

**- బి.ఎస్.రాములు**
**విశ్రాంత ఉపన్యాసకులు**

# వివిధ రాష్ట్రాలలో పంచాయతీ ప్రభుత్వాల పనితీరు



**ఏ వ్యవస్థ అయిన ఫలితాలను సాధించాలంటే ఆ స్థానిక ప్రభుత్వ సంస్థలను నడిపించే వ్యక్తుల అవగాహనా నిర్దేశనాల మీద ఆధారపడి ఉంటుంది. స్థానిక ప్రభుత్వాలు విజయం మీదనే గ్రామీణాభివృద్ధి ఫలితాలు ఉంటాయి. నేటి సంస్కరణల యుగంలో గ్రామీణ పంచాయతీ ప్రభుత్వాలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.**

ముఖ్యంగా సమాచార రంగ వ్యవస్థ ఎంతో త్వరగా గ్రామాలకు పాకినా, అభివృద్ధి ఫలితాలు గ్రామీణులకు చేరడం లేదు. గ్రామీణులకు అభివృద్ధి ఫలితాలను చేరవేయడంలో గ్రామపంచాయతీ ప్రభుత్వాలు ప్రముఖ పాత్రను పోషిస్తాయి. ముఖ్యంగా మన అభివృద్ధికి ప్రతీక అయిన పంచాయతీల పనితీరు మీద గ్రామీణాభివృద్ధి ఆధారపడి ఉంది. అందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు అభివృద్ధి కార్యక్రమాలు అమలు బాధ్యతను అప్పగించి వాటిని అమలు చేయడానికి వికేంద్రీకరణలో భాగంగా కేంద్ర రాష్ట్ర అభివృద్ధి పథకాలను అమలు చేయటానికి ప్రయారిటీ పరంగా అధికారులు అమలు చేయటానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇచ్చింది.

ఈ ప్రభుత్వ అభివృద్ధి పథకాలలో ముఖ్యమైన ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, విద్య, రహదార్లు, రవాణా, మైక్రోఫైనాన్స్‌ను అందజేసి, వాటి ఫలితాలను గ్రామీణులకు అందజేయడంలో తోడ్పడుతుంది. ముఖ్యంగా అభివృద్ధి పథకాలను అమలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్, మండల పరిషత్/ బ్లాక్‌లకు, గ్రామ పంచాయతీ ప్రభుత్వాలకు అధికారులను బదలాయించి వాటిని అమలు చేయటానికి చేయూతనివ్వడం ద్వారా అభివృద్ధి ఫలితాలను సాధించడం జరుగుతుంది.

కేరళలో 1993 రాజ్యాంగ సవరణ ద్వారా వచ్చిన 29 అంశాలను స్థానిక ప్రభుత్వాలకు బదలాయించి అభివృద్ధి సాధించేందుకు దోహదపడింది. ప్రధానాంశాలైన –

1. సామాజిక న్యాయం – అభివృద్ధి
2. మానవ వనరుల అభివృద్ధి
3. మౌలిక సదుపాయాలు
4. ఉపాధి కల్పనా – స్వయం ఉపాధి, వేతన ఉపాధి

**ప్రజాస్వామ్య వికేంద్రీకరణ అవసరం**

మొదటగా ప్రజాస్వామ్య వికేంద్రీకరణ అవసరం తెలియజేయటానికి 'ప్రిన్సిపల్ ఆఫ్ సబ్సిడీ యారిటీ' ప్రజాస్వామ్యంలో వికేంద్రీకరణ ఆవశ్యకతను తెలియజేస్తుంది.

***ప్రిన్సిపుల్ ఆఫ్ సబ్సిడీయారిటి:***

ప్రధానాంశం: సమస్య ఎక్కడ పరిష్కరించడానికి వీలుంటుందో అక్కడే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునే వ్యవస్థ ఉండాలి.

**పద్ధతి:** ప్రిన్సిపుల్ ఆఫ్ సబ్సిడియారిటిని విశదపర్చాలి.

**వివరణ**

**కుటుంబం:** కుటుంబంలో కొన్ని అవసరాలు కుటుంబ సభ్యుల సహకారంతో తీరతాయి. ఇంకొన్ని అవసరాలను కమ్యూనిటీ (గ్రామస్థుల) సహకారంతో తీర్చుకోవచ్చు.

**గ్రామం:** గ్రామస్థాయిలో కొన్ని అవసరాలు తీరుతాయి. అన్నీ ఆ స్థాయిలో పరిష్కారం కాకపోవచ్చు.

**మండల్:** గ్రామంలో తీర్చలేనివి మండల్ పరిధిలోనికి వెళతాయి.

**జిల్లా పరిషత్:** మండల్ పరిధిలో లేనివి జిల్లా పరిషత్ పరిధిలోనికి వెళతాయి.

పంచాయతీరాజ్ వ్యవస్థలో 1950 నుండి 73వ రాజ్యాంగ సవరణ వరకు ఎలాంటి మార్పులు వచ్చాయో తెలియజేస్తుంది. ఉదా॥ ముందు ఏ విధంగా పంచాయతీరాజ్ వ్యవస్థలు ఉండేవి, ఏ విధంగా పనిచేసేవి, ఏ విధంగా పనులు జరిగేవి, ఏ విధంగా అభివృద్ధికి దోహదం చేశాయి, ప్రజల భాగస్వామ్యం ఉన్నదా అనేది ప్రశ్న.

**73వ రాజ్యాంగ సవరణ ముఖ్యాంశాలు**

పంచాయతీరాజ్ భావనను వివరించిన తరువాత ఈ సంస్థలను పటిష్టపరచడానికి 73వ రాజ్యాంగ సవరణలో పొందుపరిచిన ముఖ్య అంశాలను తెలియపర్చాలి.

**రాజ్యాంగ 73వ, సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థలో వచ్చిన ప్రధాన మార్పులు:**

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మూడు స్థాయిలలో పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పరచాలి. గ్రామ పంచాయతీలలో గ్రామసభలను ఏర్పాటు చేసి, ప్రతి సంవత్సరం కనీసం నాలుగు సార్లు తప్పనిసరిగా గ్రామసభ జరిపించాలి. ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి స్థానిక సంస్థలకు ఎన్నికలు తప్పనిసరిగా జరపాలి. మధ్యంతర ఎన్నికలు అవసరమైతే 6 నెలల్లోనే నిర్వహించాలి. గ్రామపంచాయతీ నుండి, జిల్లా పరిషత్ వరకు అన్ని స్థాయిలలోను 50 శాతం స్థానాలను మహిళలకు కేటాయించాలి. రాష్ట్ర స్థాయిలో చట్టపరంగా రాష్ట్ర ఆర్థిక కమీషన్ ఏర్పాటుచేయాలి. వనరుల కేటాయింపు ఈ కమీషన్ సూచనల మేరకు చేయాలి. రాష్ట్రస్థాయిలో ఎన్నికల సంఘం ఏర్పాటు చేయాలి. భారత రాజ్యాంగం ఆర్టికల్ 334లో నిర్దేశించిన విధంగా జనాభా ప్రాతిపదికన షెడ్యూల్డు కులాల, తెగల వారికి అన్ని స్థాయిలలో రిజర్వేషన్ కల్పించాలి. ఇందులో కూడా సగం వంతు మహిళలు ఉండాలి. అన్ని స్థాయిలలోను సభ్యుల ఎన్నిక ప్రత్యక్షంగా జరగాలి. మండల, జిల్లా పరిషత్ అధ్యక్ష ఎన్నికలు మాత్రం పరోక్షంగా జరగాలి. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జరగాలనే విషయం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలివేయాలని నిర్ణయించారు. మన రాష్ట్రంలో ఈ ఎన్నిక ప్రత్యక్షంగా జరుగుతుంది. వెనుకబడిన వర్గాల వారికి ఎంతవరకు రిజర్వేషన్ కల్పించవచ్చు అనే విషయాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చూసుకుంటాయి. పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్డు ప్రకారం 29 అంశాలను కేటాయించవచ్చునని సూచించారు.

74వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రతి జిల్లాకు జిల్లా ప్రణాళికా కమిటీ ఏర్పాటు చేయాలి.

**పంచాయతీ రాజ్ సంస్థలకు బదలాయించవలసిన అంశాలు**

ఈ అంశాన్ని చర్చించేటప్పుడు ముందు షెడ్యూల్డు 11లోని 29 అంశాలను చార్టును బట్టి అంశాలలో 17 అంశాలను ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించింది.


29 అంశాలను చార్టు ద్వారా చర్చించిన తర్వాత బదలాయించిన 17 అంశాలను 8 క్లష్టర్లుగా విభజించుకొని వెన్ దయాగ్రామ్ తయారు చేసి నిధులు, విధులు, సిబ్బంది, అంశాలను పూర్తిగా బదలాయించారా, లేదా అనే ప్రాతిపదిక మీద ప్రస్తుత పరిస్థితిని గుర్తింపజేయడం, దీని ద్వారా బదలాయించిన అంశాలను ఏ మేరకు నిర్వహిస్తున్నారు. ఒక వేళ నిర్వర్తించలేకపోతే దానికి కారణాలపై చర్చ జరపాలి.

73వ రాజ్యాంగ సవరణ 1993లో వచ్చిన దగ్గర నుండి కేరళ ప్రభుత్వం 29 అంశాలను స్థానిక ప్రభుత్వాలకు బదలాయించి అభివృద్ధిని సాధించి గ్రామీణ ప్రభుత్వాలతో విజయవంతమయిన అభివృద్ధిని సాధించి దేశంలోనే పంచాయతీరాజ్ వ్యవస్థలో తలమానికంగా నిలిచింది.

ఇదే రీతిలో పశ్చిమబెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం కూడా 29 విషయాలను అమలు చేయటంలో స్థానిక ప్రభుత్వాలకు స్వేచ్ఛనిచ్చింది.

మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 23 సబ్జెక్టులను గ్రామీణ ప్రభుత్వాలకు బదలాయించి అభివృద్ధిని సాధించాయి.

క్లష్టర్లుగా వెన్ దయాగ్రామ్




కర్ణాటక ప్రభుత్వంకు 29 అంశాలను బదలాయించి దేశంలోనే విజయవంతంగా 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఫలితంగా చేసింది.

ఇటీవల 291 జి.ఓ.ఎం.ఎస్.ను 291 విషయాలను గ్రామస్థానిక ప్రభుత్వాలకు బదలాయించుతున్నట్లు జారీ చేసింది. దాని అమలుకు కొంతకాలం పడుతుంది. వేచి చూద్దాం.

## వివిధ రాష్ట్రాలలో పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేయబడిన అధికారాలు

(11వ ఆర్థిక సంఘం మరియు యన్.ఐ.ఆర్.డి. డేటా ఆధారంగా)

| క్ర.స. | పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేయవలసిన అంశాలు | మధ్యప్రదేశ్ | కర్ణాటక | పశ్చిమబెంగాల్ | కేరళ | ఆంధ్రప్రదేశ్ |
|---|---|---|---|---|---|---|
| 1 | 11వ షెడ్యూల్డు ప్రకారము 29 అంశాల బదిలీ | 23 | 29 | 29 | 29 | 17 |
| 2 | 29 అంశాలకు నిధులు బదిలీ | 9 | 29 | 121 | 5 | 02 |
| 3 | 29 అంశాలలో నిర్వహణా సిబ్బంది బదిలీ | 10 | 29 | 12 | 15 | 05 |
| 4 | జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా పరిషత్‌లో విలీనం | చేశారు | చేయబడింది | చేయబడింది | చేయబడింది | చేయబడింది |
| 5 | రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులు అమలు | పూర్తిగా అమలు | ఎక్కువభాగం అమలు | పూర్తిగా అమలు | పూర్తిగా అమలు | పాక్షికంగా అమలు |
| 6 | రాష్ట్ర ప్రణాళికా నిధులలో పంచాయతీరాజ్ సంస్థలకు బదలీ చేయబడుతున్న నిధులు శాతం | 40% | 35% | 50% | 40% | 15% |
| 7 | ఇతర స్టేక్ హోల్డర్ కమిటీలు పం.రా.సంస్థలకు జవాబుదారీతనం | ఉన్నవి | ఉన్నవి | ఉన్నవి | ఉన్నవి | లేవు |
| 8 | అభివృద్ధి శాఖల అధికారులపై పంచాయతీరాజ్ సంస్థల నియంత్రణ ఉందా? | ఉంది | ఉంది | ఉంది | ఉంది | లేదు |
| 9 | లబ్దిదారుల ఎంపికలో గ్రామసభ పాత్ర | ఉంది | ఉంది | ఉంది | ఉంది మాత్రమే | కేవలం సిఫార్సు చేయవచ్చును |
| 10 | బదిలీ చేయబడిన అంశాలలో పం.రా. సంస్థల మధ్య విధులలో స్పష్టత | ఉంది | ఉంది | ఉంది | ఉంది | లేదు |
| 11 | పంచాయతీరాజ్ చట్టంలో స్వపరిపాలన సంస్థలుగా నిర్వచించాబడ్డవా? | ఉంది | లేదు | ఉంది | లేదు | లేదు |

# గ్రామ పంచాయతీ ఆదాయ వనరుల సమీకరణ

## గ్రామ పంచాయతీ ఆర్థిక వ్యవహారాల నిర్వహణ

గ్రామ పంచాయతీ ఆర్థిక విషయాలను తెలుసుకోవాలంటే గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయ వనరులు, గ్రామ పంచాయతీ చేయవలసిన వ్యయాలు, వాటిని బడ్జెట్‌లో ఎలా పొందుపరచాలి, గ్రామపంచాయతీ ఆదాయ వనరుల సమీకరణలో భాగముగా లేఅవుట్లు, భవన నిర్మాణాలు, వేలం పాటలు, ఇంటిపన్ను మదింపుకు సంబంధించిన నియమ నిబంధనలు, పనులు చేసే ప్రక్రియ, చెల్లింపు విధానం, పంచాయతీ ఆస్తులు, రికార్డుల నిర్వహణ, కంప్యూటీకరణ వంటి విషయాలను పూర్తిగా అవగతం చేసుకోవాలి.

**గ్రామ పంచాయతీ ఆదాయ మార్గాలు**

ఏ ప్రభుత్వమైనా, వ్యవస్థ అయినా అభివృద్ధి చెందాలంటే పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ అవసరము. ప్రజా ప్రభుత్వ వ్యవస్థలో ముఖ్యముగా స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీలలో ఆర్థిక వ్యవహారాల విషయములో పారదర్శకత చాలా అవసరము. పారదర్శకత పాటించిన స్థానిక ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకము పెరుగుతుంది. తద్వారా ప్రజల భాగస్వామ్యము పెరిగి అభివృద్ధికి మార్గము సుగమమౌతుంది.

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టము 1994 ద్వారా పన్నులు విధించి, వాటిని తప్పనిసరిగా వసూలు చేసి ఆర్థిక వనరులను సమకూర్చుకునే అధికారము గ్రామ పంచాయతీలకు మాత్రమే ఇవ్వబడినది. గ్రామపంచాయతీ ఆదాయమును స్థూలముగా 4 రకాలుగా వర్గీకరించవచ్చును.

1. సొంత వనరులు
2. కేటాయించబడు వనరులు (సంక్రమిత ఆదాయము)
3. ప్రభుత్వ గ్రాంటులు 4. విరాళాలు, కోరబడని ధరావత్తులు

**సొంత వనరులు రెండు రకాలు**

**పన్నులు :**

**ఎ.తప్పనిసరిగా విధించే పన్నులు :**

1. ఇంటి పన్ను 2. ప్రకటనల పై పన్ను
3. కొలగారము లేక కాటా రుసుము
4. ప్రత్యేక పన్నులు ( ప్రస్తుతము విధిస్తున్న వినియోగ ఛార్జీలు ఈ పద్దు క్రిందకు వస్తాయి )

డ్రైనేజి పన్ను, లైటింగ్ పన్ను, నీటి పన్ను

**బి.ఐచ్ఛికముగా విధించే పన్నులు:**

1. వ్యవసాయ భూములపై పన్ను 2. ఖాళీ స్థలాలపై పన్ను

**పన్నేతరములు**

**ఎ. రుసుములు**

1. లైసెన్సు ఫీజు 2. అక్రమణలపై పన్ను
3. లేఅవుట్ ఫీజు 4. భవన నిర్మాణ రుసుము
5. అపరాధ రుసుము 6. నీటి కుళాయిల పై ఫీజు
7. సంయుక్తముగా నెలకొల్పిన మార్కెటు రుసుము




8. దేవాదాయాల ద్వారా ఆదాయము
9. భూమి అద్దె 10. పెట్టుబడులపై వడ్డీ
11. వారెంటు లేక జప్తు రుసుము 12. ఇతరములు

**బి.వేలములు**

1. వారపు సంత 2. రోజువారి సంత
3. చేపల చెరువుల వేలము 4. పాతపేపర్లు, వస్తువుల వేలములు
5. ఫలసాయము వేలము 6. రేవుల వేలము
7. పోరంబోకు భూములు 8. కంపోస్టు వేలము

**కేటాయించబడు వనరులు (సంక్రమిత ఆదాయము)**


- వృత్తి పన్ను
- వినోదపు పన్ను
- స్టాంపు డ్యూటీపై సర్‌చార్జీ
- ఖనిజ వనరులపై సీనియరేజి రుసుము
- రెవెన్యూ వారు వసూలు చేయు నీటితీరువా పన్నులలో వాటా ఎకరాకు రు.10.00
- చిన్నతరహా నీటి పారుదల శాఖకు చెందిన చెరువులలో చేపల వేలము ద్వారా వచ్చిన మొత్తములో 30% గ్రామపంచాయతీకి మత్స్యశాఖ వారు జమచేయుదురు.
- మెజిస్ట్రీరియల్ ఫైన్స్

**గ్రామ పంచాయతీలకు వచ్చు గ్రాంటు సాధారణ గ్రాంటు**

- పన్నులు వసూలుపై ప్రోత్సాహక గ్రాంటులు
- ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక గ్రాంటులు
- తలసరి గ్రాంటు (పంచాయతీ జనాభాను అనుసరించి ఒక్కొక్కరికి 4 రూపాయల చొప్పున)

టిసిపార్డు

# భూసేకరణ చట్టం 2013




- 1947 నుంచి 2013 వరకు బ్రిటిష్ చట్టం అంటే Raj Law ను మాత్రమే పాటించడం వల్ల స్థానభ్రంశ సమస్యలు తలెత్తాయి. దీంతో 2013కు ముందున్న భూసేకరణ చట్టాలు అన్నింటిని 2013 చట్టంలో కలిపివేశారు. అవి: 1962, 1967, 1984, 2007, 2011 భూసేకరణ చట్టాలు.
- Raj చట్టంతో స్థానభ్రంశానికి గురైన ప్రజలు ఇబ్బందుల పాలయ్యారని భావించి, న్యాయం చేసేందుకు ఒక సమగ్ర చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ చట్టాన్ని Land Acquisition Rehabilitation and Resettlement (LARR) గా పిలుస్తారు. సేకరణ ఆలస్యమవుతుందనే విమర్శ ఉన్న ఈ చట్టం మిగిలిన అన్ని చట్టాల కంటే ఎక్కువ పేరు కలిగి ఉన్నది. ఈ చట్టానికి సంబంధించిన బిల్లును 2011, సెప్టెంబర్ 7న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. 2013 ఆగస్టు 29న లోక్‌సభ ఆమోదించగా, 2013 సెప్టెంబర్ 4న రాజ్యసభ ఆమోదించింది. చివరకు రాష్ట్రపతి 2013 సెప్టెంబర్ 27న సంతకం చేశారు. 2014 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చింది.
- **బలవంతపు భూసేకరణలేని చట్టం – 2013:** 1894 చట్టం పూర్తిగా బలవంతపు చట్టం. దీని ప్రకారం కలెక్టర్ అధికంగా అధికారాలు కలిగి ఉండి అతడు అనుకుంటే క్షణాల్లో కుటుంబాలను ఖాళీ చేయించగలడు. కానీ అలాంటి పరిస్థితి 2013 చట్టంలో లేదు. 2013 చట్టంలో కలెక్టర్ ప్రేక్షకుడి పాత్ర మాత్రమే కలిగి ఉంటాడు.
- **రక్షణగల భూసేకరణ చట్టం – 2013:** ఈ చట్టం భూములు కోల్పోయిన వారికి పూర్తి రక్షణ ఇస్తుంది. ఇలాంటి రక్షణ 1894 చట్టంలో కనిపించదు. 2013 చట్టం స్థానభ్రంశం చెందేవారి అనుమానాలను నివృత్తి చేయడానికి అనేక సందర్భాల్లో సమావేశాలు నిర్వహిస్తుంది.
- **పునరావాసంగల భూసేకరణ చట్టం – 2013:** ఈ చట్టంలో పునరావాస చర్యలు 100 శాతం పేర్కొనబడ్డాయి. ఇలాంటి చర్యలు మనకు 1894 భూసేకరణ చట్టంలో కనిపించవు. 1894 చట్టంలో కలెక్టర్ బలవంతుడిగా ఉండి స్థానభ్రంశ ప్రజల హక్కులను అణిచివేసే ధోరణి కలిగి ఉండేవారు.
- **సంతృప్తికర నష్ట పరిహారంగల చట్టం – 2013:** ఈ చట్టంలో నష్టపరిహార నిర్ణయం న్యాయబద్ధంగా జరిగింది. ఇలాంటి నిర్ణయం 1894 చట్టంలో కనిపించదు. కలెక్టర్, కోర్టులు ప్రజోపయోగం లేదా అత్యవసరం పేరుతో ఎంతోకొంత నష్ట పరిహారం మాత్రమే ఇచ్చేవి.
- **అత్యవసర అంశానికి అర్థం చెప్పిన చట్టం – 2013:** 1894 భూసేకరణ చట్టం అత్యవసరం పేరుతో భూసేకరణకు అవకాశం కల్పించింది. ఐతే అత్యవసరానికి చెప్పలేకపోయింది. దీన్ని వల్ల ప్రతి అంశాన్ని అత్యవసరంగా భావించే అవకాశం ఉండేది. 2013 భూసేకరణ చట్టంలో మాత్రం పార్లమెంటు ఆమోదించిన అంశమే అత్యవసరమని పేర్కొన్నారు. సాధారణంగా రక్షణ దృష్ట్యా దీన్ని

ఉపయోగిస్తారు.

- **భూమి రికార్డులను పరిశీలించే చట్టం - 2013:** 2013 చట్టం ప్రకారం ఎవరూ నష్టపోకుండా స్థానభ్రంశానికి గురైన ప్రజల భూములను కలెక్టర్ రెండు నెలల వ్యవధిలో పరిశీలన చేస్తాడు. భూమి విలువకు గ్రామాల్లో 4 రెట్లు, పట్టణాల్లో 2 రెట్లు నష్టపరిహారం ఇస్తారు. కాబట్టి జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. ప్రజా ఉపయోగానికి పనికి వస్తాయా లేదా అని కూడా తెలుసుకోవడానికి సర్వే నిర్వహిస్తారు.
- **అనేక సమావేశాలు కలిగి ఉన్న చట్టం - 2013:** ఈ భూసేకరణ చట్టం ప్రకారం సేకరణ ప్రక్రియ పూర్తయ్యేసరికి దాదాపు మూడుసార్లు సమావేశాలు నిర్వహించి స్థానభ్రంశ ప్రజలకు న్యాయం చేసే ప్రయత్నం జరుగుతుంది. ఈ అవకాశం పాత చట్టం కల్పించలేదు. అంటే 1894లో ఏకపక్ష నిర్ణయం ఉండేది.
- **సమ్మతిని ఆదరించిన చట్టం - 2013:** భూములు కోల్పోయే వారికి సేకరణ ప్రక్రియలో పూర్తి స్వేచ్ఛ కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (PPP) ప్రాజెక్టుల విషయంలో తప్పకుండా 70 శాతం ప్రజలు తమ సమ్మతిని తెల్పాలి. ప్రైవేట్ ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేస్తే 80 శాతం ప్రజలు ఒప్పుకోవాలి. అంటే మెజార్టీ ప్రజలు ఒప్పుకుంటేనే భూసేకరణ సాధ్యమవుతుంది. భారత భూభాగంపై ప్రభుత్వానికి కాకుండా ప్రజలకే హక్కుందని ఈ చట్టం తెలియజేస్తుంది. అంటే Eminent Domain పదం ప్రాధాన్యం కోల్పోయింది. ఒకరికి న్యాయం చేయడానికి మరొకరికి అన్యాయం చేయవద్దన్న Wilfredo Prieto ఆశయం నెరవేరింది.
- **సాంఘిక ప్రభావ అంచనాగల చట్టం - 2013:** 1894 చట్టంలో సాంఘిక ప్రభావ అంచనా (SIA = Social Impact Assessment) కు అవకాశం లేదు. కానీ 2013 చట్టం మాత్రం భూసేకరణపై సమాజ ప్రభావాన్ని అంచనా వేస్తుంది. అంటే భూసేకరణతో భూములను కోల్పోయేవారికి నష్టం, అదేవిధంగా ప్రాజెక్టుల స్థాపనతో కలిగే లబ్ధి. Simple గా Cost benefit analysis జరుగుతుందని గమనించాలి. SIA నిర్వహణలో గ్రామస్థాయిలో పంచాయతీలు, పట్టణ స్థాయిలో మున్సిపాలిటీ లేదా మున్సిపల్ కార్పొరేషన్ పాల్గొంటుంది. ఇలాంటి సమావేశం (Public hearing) వల్ల లాభనష్టాలను సమర్థమంతంగా అంచనా వేయవచ్చు. ఈ సమావేశంతో భూములు కోల్పోయే వారికి ప్రజోపయోగంపై ఒక అవగాహన వస్తుంది. అవసరమని భావిస్తే వారు తమ భూములను కష్టమైనా సంతోషంగా ఇవ్వడానికి ఒప్పుకుంటారు. ఇలాంటి అవకాశం Raj Act 1894లో లేదు.
- **పర్యావరణ ప్రభావ అంచనా కల్గిన చట్టం - 2013:** ఈ చట్టంలో సమాజ ప్రభావ అంచనా (SIA)తో పాటు, పర్యావరణ ప్రభావ అంచనా (Environment Impact Assessment) ను కూడా పరిగణలోకి తీసుకుంటారు. అంటే SIA ద్వారా ప్రస్తుత సమాజం, EIA ద్వారా ప్రస్తుత, భవిష్యత్తు సమాజం పొందే లాభనష్టాలను కూడా చర్చిస్తుంది.
- **నిపుణుల సంఘాన్ని కలిగి ఉన్న చట్టం - 2013:** ప్రాజెక్టుల వల్ల కలిగే లాభనష్టాలను SIA అంచనా వేస్తుంది. 6 నెలల వ్యవధిలో SIA అంచనా పూర్తికాగానే దానిపై అధ్యయనం కోసం నిపుణుల సంఘం వేస్తారు. ఈ నిపుణుల సంఘంలో ఇద్దరు పునరావాసంపై అవగాహన కల్గిన నిపుణులు, ఇద్దరు అనధికార సాంఘిక శాస్త్రవేత్తలు. ఒక సాంకేతిక నిపుణుడు, ఇద్దరిని గ్రామమైతే పంచాయతీ నుంచి, పట్టణమైతే మున్సిపాలిటీ లేదా మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తీసుకుంటారు.
- **ప్రజోపయోగ చట్టం - 2013:** ప్రజా ఉపయోగానికి ఈ చట్టం సరైన అవగాహన కల్పించింది. నౌకాయానం, మిలిటరీ, విమానయానం, Department of Economic Affairs పేర్కొన్న అవస్థాపన సెక్షన్‌ను ఇందులో పేర్కొన్నారు. అయితే ప్రైవేటు దవాఖానా, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రైవేటు హాస్టళ్లను మినహాయించారు. వ్యవసాయపరమైన ఆహార ప్రక్రియ, గిడ్డంగులు, శీతల గిడ్డంగులు, వ్యవసాయ అనుబంధ అంశాలు , ముఖ్యంగా డెయిరీ, చేపలు, మాంసం మొదలైన వాటిని కూడా ప్రజోపయోగంగా పేర్కొన్నారు. అదేవిధంగా జాతీయ ఉత్పాదక విధానం (NMP)లోని NIMZ అంటే జాతీయ పెట్టుబడి ఉత్పాదక మండలాలు, పారిశ్రామిక కారిడార్లను కూడా ప్రజోపయోగంగా పేర్కొన్నారు.
- నీటి సంరక్షణ చర్యలు, నీటి సాగు చర్యలు, పారిశుద్ధ్యంను కూడా ఇందులో కలిపారు. గనులను కూడా చేర్చారు. ప్రభుత్వ పరిపాలన, ప్రభుత్వ విద్యాసంస్థలు, పరిశోధనను కూడా ప్రజోపయోగంగా పేర్కొన్నారు. క్రీడలు, ఆరోగ్యం, పర్యాటక, రవాణా మొదలైన వాటిని కూడా ప్రజోపయోగంగా పేర్కొన్నారు. స్థానభ్రంశం చెందిన ప్రజల కోసం చేపట్టిన ప్రాజెక్టులు, పేదల ఇండ్ల నిర్మాణాన్ని కూడా ప్రజోపయోగం కింద చేర్చారు. గ్రామాభివృద్ధి, పట్టణాభివృద్ధిని కూడా ప్రజోపయోగంగా పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం కూడా ప్రజోపయోగం కిందకే వస్తుంది.
- **బహుళ పంట భూమి - 2013 చట్టం:** ఆహార భద్రత దృష్ట్యా సారవంతమైన భూములను సేకరించరు. ఒకవేళ తప్పనిసరి అనుకున్నప్పుడు ఎంతైతే సారవంతమైన బహుళ పంట భూమిని సేకరిస్తున్నారో.. అంతే మొత్తం నూతనంగా వ్యవసాయానికి సాగులోకి తీసుకురాగల్గిన భూమిని అభివృద్ధి చేయాలి. అంటే 1947కు ముందున్న సారవంత భూములను వ్యవసాయేతర అవసరాలకు ఇవ్వరాదన్న చట్టాన్ని పరోక్షంగా అమలుచేసినట్లయింది. కాబట్టి ఈ చట్టం సారవంత భూమి పరిమాణాన్ని తగ్గించకుండా జాగ్రత్త పడిందని గమనించాలి.
- **ప్రిలిమినరీ నోటిఫికేషన్ - 2013 చట్టం:** సేకరణలో భాగంగా సాంఘిక ప్రభావ అంచనా, నిపుణుల సంఘం పరిశీలన పూర్తయిన తర్వాత అంశాన్ని ప్రజలకు తెలియజేయడానికి ఒక నోటిఫికేషన్ ఇస్తారు. దీన్నే Premilinary Notification అంటారు.
- రెండు స్థానిక దిన పత్రికల్లో విషయాన్ని ప్రకటిస్తారు. ఈ రెండు పేపర్లలో ఒకటి స్థానిక భాషదై ఉండాలి. అదేవిధంగా వెబ్‌సైట్‌లో, తహసీల్, జిల్లా ఆఫీసులలో ప్రకటిస్తారు. ప్రిలిమినరీ నోటిఫికేషన్ తర్వాత కలెక్టర్ భూమి రికార్డులను పరిశీలన చేస్తాడు. ఎందుకంటే కొన్ని భూములు ప్రజోపయోగానికి సరిపోకపోవచ్చు.
- **సందేహాల నివృత్తి - 2013 చట్టం:** ప్రిలిమినరీ నోటిఫికేషన్ తర్వాత సందేహాలు ఉన్నవారు కలెక్టర్‌కు తమ సమస్యలను చెప్పవచ్చు. ఆ సందేహాలను కలెక్టర్ విని తన రిపోర్టును ప్రభుత్వానికి పంపిస్తాడు. అయితే సందేహాలు ఉన్నవారు ప్రిలిమినరీ నోటిఫికేషన్ తర్వాత 60 రోజుల్లో కలెక్టర్‌కు తమ సందేహాలు ఇవ్వాలని చట్టం పేర్కొంది. అంటే కలెక్టర్ ఈ ప్రక్రియలో ఒక Observer గా మాత్రమే ఉంటాడు. అంతేకాని 1894 చట్టంలోలాగా నియంతగా ప్రవర్తించే అవకాశం లేదు.

**టిసిపార్థు**



# కరువు సహాయక చర్యలు ముమ్మరం

తెలంగాణలో తీవ్రమైన కరువు పరిస్థితి నెలకొంది. మంచినీరు, పశుగ్రాసానికి కూడా ఇబ్బంది ఎర్పడింది. రైతులకు పంటలు లేవు. కూలీలకు పని లేదు. ఈ పరిస్థితిలో కరువుతో బాధపడుతున్న ప్రజలను ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టడం జరిగింది. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కరువు పై జిల్లా కలెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాల వారిగా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చర్యల కోసం ఆదేశించారు. నిధుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా ప్రజలను కరువు నుండి ఆదుకొనేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎండల తీవ్రత జూన్ వరకు ఉంటుందని, వర్షాలు పడే వరకు కరువు సహాయక చర్యలు కొనసాగే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్లు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కరువు పనులు, సహాయక చర్యలతో సంబంధం ఉన్న అన్ని శాఖలు అప్రమత్తమై ప్రజలను, పశువులను ఆదుకొనేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. కరువును తరిమేసే విధంగా సహాయక చర్యలు ఉండాలని సూచించారు. కరువు, ఒడగాలులు, ఎండ వేడిమి, భూగర్భజలాల తగ్గుదల వంటి పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనడానికి యుద్ద ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. మంచినీరు, ఉపాధి, వడదెబ్బబాధితులకు వైద్య సహాయం పై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. తాత్కాలిక సహాయక చర్యలతో పాటుగా, దీర్ఘ కాలిక చర్యలపై కూడా ప్రభుత్వం ప్రణాళికా బద్దంగా వ్యవహరిస్తుందని తెలిపారు. జిల్లాల వారిగా పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు అమలవుతున్నాయని తెలియచేశారు. పశుగ్రాసం విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో రవాణా చేయడానికి కూడా మంచినీరు అందుబాటులో లేదని పేర్కొన్నారు. తాగునీటి అవసరాలతోపాటుగా కూలీలకు పని కల్పించడం ప్రధానంగా కార్యాచరణ అమలవుతుందని తెలిపారు. వ్యవసాయం లేని కారణంగా గ్రామాల్లో పనులకు ఇబ్బందిగానే ఉందని, ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని ఉన్నతాధికారులు వివరించారు. సమగ్ర కార్యాచరణ రూపొందించుకొని నిర్మాణాత్మకంగా సహాయక చర్యలను కరువు బారిన పడిన ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామి పనులను ఉదయం, సాయంత్రం చేయించే విధంగా చర్యలు తీసుకున్నారు. వలసలు నివారించేందుకు వీలుగా ఉపాధి పనులను కల్పించడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. వడదెబ్బతో మరణించిన వారి కుటుంబాలకు ఆపద్బంధు పథకం కింద ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. పరిహారానికి 65 ఏళ్ల నిబంధనలను సడలించారు. నీటి ఎద్దడి ప్రాంతాలకు టాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. భవిష్యత్ లో మంచినీటి సమస్య రాకుండా ఇంటింటా ఇంకుడు గుంతలను ప్రోత్సహిస్తున్నారు, చేరువుల పూడిక తీయడంతో భూగర్భ జల మట్టాలు పెరగడానికి చర్యలను వేగవంతం చేశారు. వర్షపునీటిని ఒడిసిపట్టుకునే చర్యలను ప్రొత్సహించడం జరుతుంది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పనులను వేగంగా పూర్తి చేయడం, ఖరీఫ్ పంటలకు ఇప్పటి నుండే సన్నద్దం కావడానికి చర్యలు తీసుకుంటున్నారు. మంచినీటి ఎద్దడి,



భూగర్భజలాలు అడుగంటి పోవడం వంటి సమస్యలను తీవ్రంగానే పరిగణించి స్వల్ప కాలిక, దీర్ఘాకాలిక చర్యలకు అధికార యంత్రాంగం చర్యలను తీసుకోవడం జరుగుతుంది. అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వం చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. స్వచ్ఛంద సంస్థల ద్వారా చలివేంద్రాలను ఏర్పాటు చేయించింది. కొరత ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయించడం జరుగుతుంది. గ్రామాల్లో వడదెబ్బ నివారణకు ఓఆర్‌ఎస్ తో పాటుగా మందులను అందుబాటులో ఉంచడం జరుగుతుంది. ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాల్లో వడదెబ్బ బాధితులకు ప్రత్యేక వైద్యం అందే విధంగా చర్యలు తీసుకున్నారు. ఏ ప్రాంతంలోనైన ప్రజలు తిండి లేక ఇబ్బంది పడితే వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. అవసరాన్నిబట్టి పశుగ్రాసం సరఫరా, పశువులకు నీటితొట్ల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 443 మండలాలకు



గాను 231 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. ఈ ప్రాంతాలను కేంద్ర అధికారులు పరిశీలించారు. కరువు నష్టం రూ.3000 కోట్లుగా అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2000 కోట్ల సహాయం కోరింది. అందులో రూ. 1500 కోట్లు తక్షణం విడుదల చేయాలని కోరింది. కేంద్రం రూ.791 కోట్లు మంజూరు చేసింది. మహబూబ్ నగర్ జిల్లాలో 64 మండలాలు, మెదక్ లో 46, నిజామాబాద్ లో 36, రంగారెడ్డి జిల్లాలో 33, కరీంనగర్ జిల్లాలో 19, నల్లగొండ జిల్లాలో 22, వరంగల్ జిల్లాలో 11 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినప్పటికీ మార్చి నుండి తెలంగాణలోని అన్ని మండలాలలో దుర్భిక్ష పరిస్థితులు తీవ్రమయ్యాయి. ప్రభుత్వం మంచినీటి అవసరాల కోసం ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయడం జరుగుతుంది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ కార్యక్రమాలతో తాగునీరు, సాగునీటి సమస్య తీరుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాలకు తగిన ప్రాధాన్యతను ఇస్తునే కరువు బారిన పడిన ప్రజలను ఆదుకొనేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటుంది. అనూహ్యమైన ప్రకృతి వైపరీత్యం వల్ల కరువు బారిన పడిన వారందరికి ప్రభుత్వ సహాయం అందడం లేదని విమర్శలు వస్తున్నాయి. రైతులు, రైతు కూలీలు తాగడానికి నీరు లేక, చేయడానిక పని లేక వలసలు వెళుతున్నారు. వర్షాలు లేక పంటలు ఎండిపోవడం, ఉపాధి లేకపోవడంతో వలసబాట పడుతున్నారు. ఉపాధి పనులతో ఆదుకొనే ప్రయత్నం జరగడం లేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేశారు. కరువు బారిన పడిన ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చడానికి కూడా అవకాశం లేని విధంగా నీటి వనరులు పూర్తిగా ఎండిపోయాయని కొన్ని ప్రాంతాల అధికారులు వివరించారు. ఉపాధి పథకంలో కూడా కొన్ని ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. మంచినీరు, పశుగ్రాసం, ఉపాధి పై ప్రధానంగా దృష్టి పెట్టడం జరుగుతుందని అధికారులు వివరించారు...........

**పంతంగి శంకర్, సీనియర్ జర్నలిస్టు**



# సబ్సిడీల హేతుబద్ధికరణ - ఆధార్

**ఆ**ధార్ నేడు పేద ప్రజలకు ఆధారం అయినది. గతంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఏ సంక్షేమ కార్యక్రమానికైన రేషన్‌కార్డు ఉపయోగించారు. కాని నేడు ప్రతి సంక్షేమ కార్యక్రమానికి ఆధార్ ఆధారము అయినది. పట్టణ ప్రాంత ప్రజలకు పాన్‌కార్డు, డ్రైవింగ్‌లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు ఉంటాయి. వీటితో పోల్చినట్లే ఆధార్ భిన్నమైనది. దీని ద్వారా సంక్షేమ కార్యక్రమాలు అనర్హులకు అందకుండా అర్హులకు మాత్రమే అందేటట్లు చేయగలుగుతుంది.

మొట్టమొదటి యన్.డి.ఏ. ప్రభుత్వం వాజ్‌పాయ్ నాయకత్వంలో లాల్‌కృష్ణా అద్వానీ హెూం మంత్రిగా ఉన్నప్పుడు బంగ్లాదేశ్ చొరబాట్లు, పాకిస్థాన్ తీవ్రవాదుల చట్టవ్యతిరేక కార్యక్రమాల, శాంతి భద్రతల సమస్యలను అరికట్టడానికి ప్రతి పౌరునికి గుర్తింపు కార్డు ఇవ్వవలెనని ఆలోచన ప్రారంభమైనది. కాని అది కార్యరూపం దాల్చలేదు.

యు.పి.ఏ.-2 ప్రభుత్వం నందు ఇన్ఫోసిస్ వ్యవస్థాపక అధినేత నందన్ నిలేఖని అధ్యక్షతన విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఏర్పాటైన తర్వాత పని ప్రారంభమైనది. నేటి వరకు 100 కోట్ల మందికి ఆధార్ జారీ అయినది. ఇంక 23 కోట్ల జారీ చేయవలసిన అవసరం ఉన్నది ఇంత పెద్ద బృహత్ కార్యక్రమం ప్రపంచంలో ఏదేశం చేయలేదు. యు.కె.మరియు ఐర్లాండ్ మధ్యలోనే నిలిపివేయడం జరిగినది. 100 కోట్ల మందికి జారీ చేసినందుకు నందన్ నిలేఖని అభినందించవలసిన అవసరం ఉన్నది.

దీనిని వ్యతిరేకించే వారు కోర్టులలో అనేక పిటిషన్‌లు వేయడం జరిగినది. రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో లేనప్పుడు ఒకమాట మాట్లాడుతున్నారు. మొట్టమొదట ఎల్.పి.జి. గ్యాస్ సబ్సిడీలకు ఆధార్ అనుసంధానం చేసినప్పుడు బి.జె.పి. వీధిలో పోరాటం చేసినది. నేడు కాంగ్రెస్ దీనిని వ్యతిరేకిస్తుంది. కాంగ్రెస్ వ్యతిరేకత మరియు పాలకపక్షానికి రాజ్యసభలో మెజారిటీ లేకపోవడం వలన ఆధార్‌ను పార్లమెంట్‌లో ఆర్థిక బిల్లుగా ఆమోదం చేసినారు. ఆర్థిక బిల్లుపైన రాజ్యసభకు నామమాత్రమైన అధికారాలు ఉంటాయి.

దీనిని పాలకపక్షం మద్దతు తెలపడానికి అనేక కార్యక్రమాలు ఉన్నాయి. దేశ బడ్జెట్ నందు 40,000/- నుండి 50,000/- కోట్లు ఆధార్, మొబైల్, బ్యాంక్ అకౌంట్ అనుసంధానం వలన మిగులుతాయి. ప్రధానంగా ఎల్.పి.జి. సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, ఉపాధి హామీ కూలీల వేతనాలు చెల్లింపు, పెన్షన్ చెల్లింపు, ప్రజాపంపిణీ, స్కాలర్‌షిప్‌లు, అతివృష్టి, అనావృష్టి, వలన ఏర్పడిన ప్రభుత్వ సహాయంతో బ్యాంక్ అకౌంట్, ఆధార్ అనుసంధానం, ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా 50,000 కోట్లు మిగులుతాయి. కనుక ప్రభుత్వం ఆధార్‌ను అనుసంధానం మొగ్గుచూపుతుంది.

ఈ విధంగా ఆర్థికపరమైనవి కాకుండా ఆధార్ ఓటర్ కార్డులకు అనుసంధానం వలన ఒక్క హైదరాబాద్ వారు 6 లక్షల బోగస్ ఓట్లు బయటపడినాయి. బోగస్ ఓట్ల వలన ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతున్నది. ఎన్నికలు పారదర్శకంగా జరగడానికి మరియు ప్రజాస్వామ్యం బలపడడానికి ఆధార్ ఉపయోగపడుతుంది.


ప్రతి బ్యాంక్ అకౌంట్‌నకు ఆధార్ అనుసంధానం వలన పన్ను ఎగవేతలు, నల్లధనం వెలికి తీయవచ్చు. భూముల కొనుగోళ్ళు, లక్షపైన ప్రతి కొనుగోళ్ళకు ఆధార్ అనుసంధానం వలన పన్ను ఆదాయము రాబట్టవచ్చు. దీని ద్వారా ఆర్థిక నేరాలు తగ్గుతాయి.

ఆధార్ అనుసంధానం ద్వారా పెన్షన్, ఉపాధి కూలీ చెల్లింపు, స్కాలర్‌షిప్, రేషన్ పంపిణీ నందు వేల కోట్లు అవినీతి బయటకు వచ్చినాయి. ఇలాంటి సాంకేతిక పద్ధతులైన బయోమెట్రిక్, ఆధార్ అనుసంధానం, అవినీతి రహిత మరియు పారదర్శక పాలకులకు తొలిమెట్లు. సుపరిపాలనకు ఆధార్‌ను త్వరితిగతిన అమలు చేయాలి. ఎన్నికల సంఘం ప్రతి ఓటర్‌కు ఆధార్ అనుసంధానం చేసి బోగస్ ఓట్లు, ఒకో వ్యక్తి రెండు చోట్ల ఓటు వేసే పెద్దలకు స్వస్తి చెప్పవలసిన అవసరం ఉన్నది. పనామాలాంటి పత్రికలు నల్లధనం గురించి చెప్పడం కంటే ఉన్న పద్ధతుల ద్వారా నల్లధనం విదేశాలకు వెళ్ళకుండా అరికట్టాలి.


**బి.శేషాద్రి,**

**సెంటర్ హెడ్, సి.డి.పి.&ఏ.,**

**టిసిపార్డు**



# వెర్మికంపోస్ట్ తయారు చేయు పద్ధతి మరియు వినియోగంలో మెళకువలు

అధిక దిగుబడులను ఆశించి రైతులు విచక్షణారహితంగా వాడు రసాయనిక ఎరువుల వలన మన భూమిలో ఉన్న ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు నశింపబడి మన పంట పొలాలు నిర్జీవంగా మారుచున్నవి. దీనితోపాటు సేంద్రియ పదార్థాల కొరత కూడా ఏర్పడుతున్నది. దీనివలన మొక్కలు సరిగ్గా ఎదగక ఆశించిన పంట దిగుబడి రావడం లేదు. ఆరోగ్యకరమైన పంటకు సారవంతమైన నేలలు కావాలి. భూసారాన్ని పెంచేందుకు కాలుష్య నివారణకు సేంద్రియ ఎరువుల అవసరం ఎంతైనా ఉంది. ఈ సేంద్రీయ ఎరువులలో వెర్మికంపోస్ట్ ముఖ్యమైనది. వానపాముల రైతు నేస్తాలుగా ఎప్పుడో గుర్తించబడినవి. అయితే ఈ వానపాములు సేంద్రీయ ఎరువులు ఎక్కువగా ఉన్న నెలల్లో బొరియలు చేస్తూ నేలను గుల్లపరుస్తాయి. వీటికి సేంద్రీయ పదార్థంతో మిళితమైన మట్టి ఆహారము. అంటే సుమారుగా 70 శాతం మట్టిని మరియు 30 శాతం సేంద్రీయ పదార్థాలను ఆహారంగా తీసుకుంటాయి. కానీ 70-80 శాతం వ్యర్థపదార్థాలను 10-30 శాతం మట్టిని తినే వానపాములను ఉపయోగించి వ్యర్థపదార్థాలను సేంద్రీయ పదార్థాలుగా మార్చవచ్చును. వీటిని వివిధ రకాల సేంద్రీయ వ్యర్థాలను ఆహారంగా తీసుకుని విసర్జన గావిస్తుంటాయి. ఈ విస్తర్జన పదార్థాన్నే వెర్మికంపోస్ట్ లేదా వెర్మి కాస్టింగ్ అంటారు.

**వెర్మికంపోస్ట్‌కు అనువైన వానపాముల రకాలు**

వానపాములను వాటి ఆహారపు అలవాట్లు, జీవన విధానాన్ని బట్టి రెండు వర్గాలుగా విభజించారు. అవి

**1. భూమిపై పొరలలో నివసించే వానపాములు (సర్‌ఫేస్ డ్రిలర్స్)**

**2. భూమి లోపలి పొరలలో నివసించే వానపాములు (డీప్ బర్రోయర్స్)**

**1. భూమిపై పొరలలో నివసించే వానపాములు (సర్‌ఫేస్ డ్రిలర్స్)**

ఈ రకపు వానపాములు భూమిపై పొరలలో నివసిస్తూ 90 శాతం వ్యవసాయ వ్యర్థాలను 10 శాతం మట్టిని ఆహారంగా తీసుకుని చాలా వ్యర్థాలను కంపోస్ట్‌గా మారుస్తాయి.

- వీటి జీవిత కాలం 28 నెలలు
- వీటి ప్రత్యుత్పత్తి సామర్థ్యము చాలా ఎక్కువ.
- ఒక వానపాము యేడాదికి 200 నుంచి 250 వరకు కుటుంబాన్ని అనుకూల పరిస్థితుల్లో వృద్ధి చేసుకోగలదు.
- ఇవి భూమిపై పొరలలో ఉంటాయి. కనుక వీటిని వర్షం, సూర్యకాంతి నుంచి కాపాడుటకు రక్షణగా ఏదన్నా షెడ్‌గాని, పాకనుగాని ఏర్పాటు చేయాలి.
- ఇవి 20-25$^{0}$ సే ఉష్ణోగ్రత వద్ద చురుకుగా పనిచేసి ఎక్కువ ఫలితాలను ఇస్తాయి.

**2. భూమి లోపలి పొరలలో నివసించే వానపాములు (డీప్ బర్రోయర్స్)**

- ఇవి 90 శాతం మట్టిని 10 శాతం వ్యవసాయ వ్యర్థ పదార్థాలను ఆహారంగా తీసుకుంటాయి.
- ఇవి భూమి నుంచి 3 మీటర్ల వరకు తొలుచుకుంటూ వెళ్ళి సేంద్రీయ పదార్థాలను తయారుచేస్తాయి.
- వీటి జీవితకాలం 15 సంవత్సరాలు
- వీటిని షెడ్లలో పెంచి పొలాలలో ప్రవేశపెట్టడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు.

**వెర్మికంపోస్ట్ తయారీకి అవసరమైన వస్తువులు.**

**1. షెడ్ నిర్మాణం :**

ఈ రకం వానపాములు భూమిపై పొరలలో నివసించే వానపాములు కాబట్టి వీటిని ప్రకృతిలోని ఎండ వర్షాల నుండి కాపాడుకునేందుకు సేంద్రీయ పదార్థాల లభ్యతను బట్టి షెడ్లు ఏర్పరచుకోవాలి.

**2. సేంద్రీయ శేష వ్యర్థ పదార్థాలు:**
పంట పొలాలలో లభించే వ్యర్థ పదార్థాలైన చెత్త, కలుపు మొక్కలు, పండ్ల తొక్కలు వెర్మికంపోస్ట్ తయారీకి బాగా ఉపయోగపడతాయి. ఒక టన్ను వెర్మికంపోస్ట్ తయారీకి 2 టన్నుల వ్యర్థ పదార్థాలు అవసరమవుతాయి.

**3. వానపాములు:**
చదరపు మీటరుకు 1000 (1కే) చొప్పున ఒక టన్ను వెర్మికంపోస్ట్ తయారు చేయడానికి సుమారు 3000 (3-కే) వానపాములు అవసరము అవుతాయి.

**4. నీరు, పేడ :**
నీరు, పేడ కూడా తగు మోతాదులో అవసరము అవుతాయి.

**వెర్మికంపోస్ట్ తయారు చేసే విధానం:**

**1. షెడ్ నిర్మాణం:** తూర్పు-పడమర దిశలో ఉండే విధంగా ఏటవాలుగా నిర్మించాలి.

**2. బెడ్ తయారీ :** 5 మీ. పొడవు 1 మీ వెడల్పు 3 అడుగుల ఎత్తు ఉండే విధంగా నాపరాయితో నేలపైన బెడ్ ఏర్పరచుకోవాలి. బెడ్ అడుగు భాగాన్ని మూడు అంగుళాల మందంతో గడ్డి లేదా ఇసుక లేదా మట్టి నింపి తగినంత నీటితో తడిపి గట్టిపరచాలి.

**3. బెడ్ నింపే పద్ధతి :**

**మొదటి పొర :** 2,3 అంగుళాల వరకు వ్యర్థ పదార్థాలు నింపి, వాటిపైన పేడనీటిని చిలకరించాలి.

**రెండవ పొర:** పశువుల ఎరువు, వ్యవసాయ వ్యర్థాలు కలిసి చివికిన పదార్థాన్ని 6 అంగుళాల మందంతో బెడ్ అంతటా సమానంగా తగినంత నీటితో తడిపి ఉంచాలి. అందువల్ల నెమ్మదిగా కుళ్లి మెత్తగా తయారువుతుంది. ఇలా 20-25 రోజుల (3 వారాలు) నీటితో తడపాలి. ఆ తరువాత వానపాములను ప్రవేశపెట్టాలి.

వానపాములు వదిలిన తరువాత 50-60 రోజుల వరకు ప్రతిరోజూ శీతాకాలంలో, వేసవిలో రెండు మూడు సార్లు బెడ్‌ను నీటితో తడపాలి. వేడి నుండి వానపాములను కాపాడుకునేందుకు , షెడ్ ప్రక్కలకు తడిపిన గోనే పట్టాలను వ్రేలాడతీయాలి.

**4. వెర్మికంపోస్ట్ తయారు అయినది తెలుసుకోవడం ఎలా?**

- వెర్మికంపోస్ట్ గోధుమ నుండి నల్ల రంగుకు మారుతుంది.
- వెర్మికంపోస్ట్ వాసనరావు
- గుళికలు ఉంది తేలికగా ఉంటుంది.
- రంగు రూపు మారిన వెర్మికంపోస్ట్ గమనించిన వెంటనే బెడ్ తడపడం ఆపేయాలి. నాలుగు రోజుల తరువాత బెడ్‌లో గల పదార్థాలను కుప్పగా చేసి ఉంచాలి. ఇందువలన వానపాములు బంతిలా చుట్టుకుని కుప్పలోని అడుగుభాగానికి చేరుకుంటాయి. మెత్తగా పైన ఉన్న వెర్మికంపోస్ట్ జల్లెడ లేదా జల్లించే మిషను ద్వారా జల్లించి అరబెట్టి సంచులలో నింపాలి.

**వెర్మికంపోస్ట్‌లో పోషకాల యాజమాన్యం**

మన పరిసరాలలో మరియు పంట లభించే వ్యర్థ పదార్థాలను కుళ్ళింపచేసి వానపాములకు ఆహారంగా వేసి తద్వారా వచ్చిన వెర్మికంపోస్ట్ ఎరువులో ఈ క్రింది విధంగా పోషక విలువలు ఉన్నట్లు పరిశోధనలో గుర్తించారు.

**పోషకాలు :**

నత్రజని : 1.6%
భాస్వరం : - 0.7%
పొటాషియం - 0.5%
మెగ్నీషియమ్ - 0.2%
ఇనుము - 175.0 పి.పి.యం.
మాంగనీస్ - 96.0 పి.పి.యం.
జింక్ - 24.5 పి.పి.యం.
కాపర్ - 5.0 పి.పి.యం.

**వెర్మికంపోస్ట్ వాడే విధానము మరియు మోతాదు:**

పండ్లు, కూరగాయలు, పూలతోటలలో వెర్మికంపోస్ట్‌ను మొక్క మొదలులో వేసి దానిపై మట్టితో కప్పి పలుచగా నీళ్ళు ఇవ్వాలి.

**పంటలు :** 3-4 టన్నులు / హెక్టార్‌కు వేయాలి

**పండ్లతోటలు :** ప్రతి చెట్టుకు 5-10 కిలోలు వేయాలి

**పూలతోటలు :** ఏకరాకి 200-300 కిలోలు, గులాబీ మొక్కకి ఒక్కంటికి 200-300 గ్రాములు వేయాలి.

**వెర్మికంపోస్ట్‌ను వినియోగించడం వల్ల కలిగే లాభాలు:**

- వెర్మికంపోస్ట్‌ను పంటలపై వినియోగించడం వల్ల దానిలో ఉండే మిత్ర సూక్ష్మజీవులు భూమిలో అభివృద్ధి చెంది అక్కడ వాటి సంఖ్యను పెంచుకుంటూ నిర్జీవ భూములు నుంచి జనసహిత భూములుగా చేయటంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి.
- వెర్మికంపోస్ట్‌లో మొక్కకు అవసరమయ్యే అన్ని రకాల స్థూల సూక్ష్మపోషక పదార్థాలు కావల్సిన మోతాదుల్లో లభ్యమవుతాయి. పోషక పదార్థాలు పుష్కలంగా అందడం వల్ల వెర్మికంపోస్ట్ వాడి సాగు చేసిన పంటలు ఆరోగ్యవంతంగా ఎదుగుతాయి.
- దీనివల్ల ఆయా పంటలకు చీడపీడలను తట్టుకునే శక్తి ఎక్కువగా ఉంటుంది. అలాగే సస్యరక్షణ కొరకు వాడే మందుల వాడకం తగ్గుతుంది.
- వెర్మికంపోస్ట్‌లో సహజమైన హార్మోన్లు, విటమిన్లు లభిస్తాయి. వీటిని భూమిలో కలిపినప్పుడు పెరుగుతున్న మొక్కల వేర్ల పెరుగుదల, మొక్క బాహ్య అంతర లక్షణాలలో గణనీయమైన అభివృద్ధి జరిగి మొక్కలు బలంగా పెరుగుతాయి.
- వెర్మికంపోస్ట్‌ను ఉపయోగించి పండించిన పంటలు కోసిన తరువాత తాజాగా ఉండి ఎక్కువ కాలం నిలువ ఉంటాయి. వెర్మికంపోస్ట్‌ను వాడటం వల్ల స్వాభావిక పర్యావరణం కాలుష్యం అవకుండా ఉంటుంది.
- వానపాముల ఎరువు తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు:
- బెడ్లలో ప్లాస్టిక్ పదార్థాలను గాని, గాజు ముక్కలు, రాళ్ళు, కోడిగుడ్ల పెంకులు గాని ఉండరాదు.
- బెడ్‌పైన పక్షులు, ఉడతలు, తొండలు, ఎలుకలు ఆశించి వానపాములను తినకుండా గడ్డితో లేదా జాలితో లేదా గోనేతట్టుతో బెడ్లను అడుగు మందం కప్పాలి.
- వెర్మికంపోస్ట్ షెడ్ చుట్టూ జాలి కట్టి కాకులు, గద్దలు, కొంగలు, పాములు, ఎలుకలు రాకుండా చూసుకోవాలి.
- బెడ్లలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి.

**డా॥ ఆర్.సుభాష్‌రెడ్డి, డా.యస్.త్రివేణి, డా.ఎ.విజయ్ గోఅల్, బి.ప్రసన్న కుమార్, వై.నాగరాజు, కె.దామోదరాచారి, సూక్ష్మజీవుల విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30**



# బడుగు బలహీన వర్గాల పాలిటి పెన్నిధి
# ఎస్.ఆర్.శంకరన్, ఐఏఎస్

మనిషికి పుట్టుకతోనే కొన్ని లక్షణాలు వస్తాయి. ఆ లక్షణాలే జీవితాంతం వెంటాడుతుంటాయి. అందుకు దైవం కూడా తోడుగా ఆ వ్యక్తికి సహకరిస్తాడు. అదే ఏదో చేద్దామని మరేదో చేస్తూ జీవితం గడిపేస్తుంటారు. కొందరు పేరు కోసం ప్రాకులాడుతూ ఉంటారు. వీటన్నింటికి అతీతంగా వ్యవహరించుతూ సాధించుకున్న జీవితాన్ని నలుగురుకు ఉపయోగకరంగా ఖర్చు చేసిన వ్యక్తులలో ఎస్.ఆర్.శంకరన్, ఐ.ఏ.ఎస్ ఒకరు. ఆ కోవకు చెందిన ఐఏఎస్ అధికారులలో బ్రిటిషు దొరలు కూడా మనకు తారసపడుతుంటారు. అందులో హెమన్‌డార్ఫ్, లార్డ్ రిప్పిన్, కారన్ వాలీస్, కాటన్ దొరలైతే తదితరులెందరినో చెప్పుకొనవచ్చును. ఆ కోవకు చెందిన ఇండియన్ ఐ.ఏ.ఎస్. అధికారులు బిడిఎస్ శర్మ, ఎస్.ఆర్.శంకరన్, పి.ఎస్.కృష్ణన్ తదితరులను చెప్పుకొనవచ్చును. అంతకుముందు ఎంతో మంది ఐ.ఏ.ఎస్ అధికారులు పనిచేసిపోయిన కొందరినే ప్రజలు గుర్తుంచుకొంటారు. అలాంటి మహా వ్యక్తులలో ఎస్.ఆర్.శంకరన్‌ను పేర్కొనవచ్చును. ఈయనకే అంత ప్రాధాన్యత ఎందుకంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐఏఎస్ అధికారిగా ఎస్.ఆర్. ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. బీద బిక్కి జనంకు చదువుకొనే అవకాశంను కల్పించారు. చదువుకొనాలంటే విద్యార్థులకు తగిన వసతులు కూడు, గుడ్డ, బుక్స్, వసతి చదువుకు అయ్యే ఖర్చు వీటన్నింటిని సమకూర్చే విధంగా సంక్షేమ కార్యక్రమాలను తీర్చిదిద్దారు శంకరన్.

1. వసతి గృహ కల్పన/ ఏర్పాటు.
2. పుస్తకాలు ఇచ్చే బుక్ బ్యాంకులు స్థాపన.
3. వసతి గృహాలలో స్కాలర్ షిప్‌లు మంజూరీ.
4. వీలున్న చోట్ల బట్టలు సరఫరా.
5. భోజన సదుపాయం/ పౌష్టికాహారం క్రింద
6. ఈ సౌకర్యాలు ముందుగా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతుల వారికి కల్పించగా అనంతరం వాటిని వెనుకబడిన తరగతుల వారికి కూడా ఆ సౌకర్యాలను అందించడం జరిగింది. చదుకొనేందుకు కావలసిన అన్ని సదుపాయాలను స్కాలర్‌షిప్స్ క్రింద సంక్షేమ పథకం పేరుతో ప్రవేశపెట్టారు. అంతకు ముందున్న మేనేజ్‌మెంట్ (ప్రైవేటు వ్యక్తులు) హాస్టల్స్ స్థానంలో ప్రభుత్వ వసతి గృహాలను 1971లో శంకరన్ ప్రవేశపెట్టారు. అందుకు ప్రతిగా షె.కు./ షె.జా విద్యార్థులు ఎంతో కృతజ్ఞతతో పనిచేయకలుగుతారు అనేది ఆయన ఉద్దేశ్యం.

సివిల్ సర్వీసులకు తయారయ్యేందుకు అనేక మంది ఐఏఎస్/ ఐపిఎస్‌లకు ఎంపికయ్యారు. గతంలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు లక్నో, భోపాల్ సెంటర్స్‌కు వెళ్లడం జరిగేది. హైదరాబాద్‌లో ఐఏఎస్ ఫ్రీ కోచింగ్ సెంటర్‌లను స్థాపించారు శంకరన్. ఎంతో కమిట్‌మెంట్‌తో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి తన పేరుకు సార్థకనామధ్యేయంగా మారారు. శంకరన్ అంటేనే దళిత విద్యార్థులకు దేవుడు లాంటి వాడు. వేలాది మంది విద్యార్థులకు వసతి గృహాలు ఏర్పాటు చేశారు. వసతిగృహాలలో నక్సలైట్లు నివసిస్తున్నారు వసతి గృహాలు మూసేయాలని కొందరు ప్రతిపాదించగా ఎన్టీఆర్ ముఖ్యమంత్రి హాస్టల్స్ మూసేందుకు తయారయ్యారు. శంకరన్, సెక్రటరీగా ఆ ప్రతిపాదనలను తిరస్కరించి తన స్వంత కేడర్ త్రిపుర రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెళ్లారు. అనంతరం శంకరన్ కేంద్రంలో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా పనిచేసిన కాలంలో భూసంస్కరణలు అమలు చేసి బీదబిక్కి జనానికి భూమిని పంచేందుకు ప్రయత్నించి విజయవంతంగా లక్షల ఎకరాలు పంపిణీగావించారు. బీదలకు ఇళ్లస్థలాలు కేటాయించేందుకు దోహదం చేశారు. నెల్లూరు జిల్లాలో ఒక దళిత వాడకు శంకరన్ బస్తీగా కూడ నామకరణం చేసుకొన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఎన్నో వాడలకు ఆయన పేరు పెట్టుకొన్నారు.

విద్య ఒక్కటే మనిషిని పరిపూర్ణుడుగా చేయగలదు అని నమ్మిన వ్యక్తి శంకరన్. అదే దృష్టితో తన లక్ష్యాలను అమలు చేసేందుకు పనిచేసి విజయం పొందారు. ఆయనతో పని చేసిన ఎంతో మంది అధికారులు ఆయన గుణగణాలను వివరించడం జరిగింది. ఏది ఏమైనా ఒక పద్ధతి ప్రకారం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి పేదలకు తన సేవలను నిస్వార్థంగా అందించడం జరిగింది. ఆయన ద్వారా సహాయం పొందని దళిత విద్యార్థులు ఆ సంవత్సరాలలో లేరంటే అతిశయోక్తి కాదు.

దళితులకు స్కాలర్‌షిప్ అందలేదంటే చాలు తను వెరిపై చేసి ఇప్పించే వాడు మహానుభావుడు. అందుకే ఆయనను దేవుడి బాబు అని పిలుచుటలో తప్పు లేదు. అన్న దానం కంటే విద్యా దానం చాలా గొప్పది తెలింది. భూ సంస్కరణలు ప్రవేశపెట్టి దిగువ తరగతుల వారికి న్యాయం చేకూర్చే ఎన్నో కార్యక్రమాలకు ఆద్యులు.

ఐఏఎస్ అధికారుల సంఘం కూడా శంకరన్ సేవలను అధికంగా ప్రశంసించి తెలంగాణ రాష్ట్ర టిసిపార్డు తన బిల్డింగ్ బ్లాక్‌కు శంకరన్ మెమోరియల్‌గా నామకరణం చేశారు. అందుకే ఆయనను ఏ విధంగా పొగిడిన చేసిన సర్వీసుకు గుర్తింపు తక్కువునే.మానవ సేవే మాధవసేవగా నమ్మి మూగ జనుల సంక్షేమానికి కృషి చేసిన మహాయోగి శంకరన్.

– సిఎంపి., సిపార్డు


# భద్రతకు పూర్తి భరోసా

## • మహిళలు, బాలికలకు సంపూర్ణ రక్షణ • దేశంలోనే తొలిసారిగా ప్రయోగాత్మక కేంద్రం






మహిళలు, బాలికల రక్షణకు సంపూర్ణ భద్రత కల్పించే విషయంలో తమ ప్రభుత్వం రాజీపడదని తెలంగాణ రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు ఒక్క ఫోన్ కొడితే చాలు తక్షణమే ఆదుకునే 'భరోసా'ను తాము కల్పిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ పోలీసు శాఖ 'భరోసా' ఇస్తోందన్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో పని చేసే 'భరోసా' కేంద్రాన్ని హాకా భవన్‌లో మే7న ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ నగరం భద్రత, రక్షణతో కూడిన నగరంగా తీర్చిదిద్దేందుకు భరోసా కేంద్రం దోహదపడుతందున్నారు. ప్రపంచస్థాయి నగరాల్లో ఒకటిగా అన్ని రంగాల్లో రూపాంతం చెందుతున్న హైదరాబాద్ నగరంలో ఆపదలో ఉన్న మహిళలు, బాలికలను ఆదుకునేందుకు అవసరమైన తక్షణ సహాయాన్ని కేంద్రం అందిస్తుందని చెప్పారు. కేంద్రం ఏర్పాటు చేసినందుకు డిజిపి అనురాగ్‌శర్మ, హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ మహేందర్‌రెడ్డి తదితరులను మంత్రి అభినందించారు. భరోసా కేంద్రాన్ని త్వరలో అన్ని జిల్లాలకూ విస్తరించాలని హోంమంత్రి ఆదేశించారు. డిజిపి అనురాగ్ శర్మ మాట్లాడుతూ ఒకేచోట అన్ని రకాల సేవలు అందించేందుకు భరోసా కేంద్రం దోహదపడుతుందని చెప్పారు. అత్యవసరంగా ఆదుకునేందుకు, కుటుంబాల్లో వచ్చే మనస్పర్థలను తొలగించే కౌన్సిలింగ్ సదుపాయం, ప్రతి కేసును నిత్యం పర్యవేక్షించి




దానికి చక్కటి పరిష్కారం చూపించడం కోసం భరోసా కేంద్రం పని చేస్తుందని వెల్లడించారు. పోలీసు, వైద్య, న్యాయ, ప్రాసిక్యూషన్, మానసికంగా ఇబ్బందిపడుతున్న వారికి అవసరమైన కౌన్సిలింగ్ ఇవ్వడం వంటి అన్ని సేవలను అందించేందుకు 24/7 ఈ కేంద్రం పని చేస్తుందని డిజిపి తెలిపారు. హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బాధితులకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారానే కోర్టు విచారణ చేసేందుకు వీలుగా, వాంగ్మూలం ఇచ్చేందుకు ఆధునాతన సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న తాము మహిళలు, బాలికల కోసం ఈ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించిన సంగతిని గుర్తు చేస్తూ, ఆ మేరకే ఈ రోజు ఏర్పాటు చేసినట్లు సిపి వివరించారు. నగర అదనపు పోలీసు కమీషనర్ స్వాతిలక్రా మాట్లాడుతూ బాలికలు ఎవరైనా ఆపదలో ఉంటే 1098కి, మహిళలు ఆపదలో ఉంటే 100కి ఫోన్ చేస్తే వెంటనే తమ భరోసా కేంద్రం స్పందించి తక్షణ సహకారం అందిస్తుందని చెప్పారు. గృహహింస, లైంగిక వేధింపులు, ఆకతాయిల వేధింపులు, మహిళల అక్రమరవాణా, మహిళలపై యాసిడ్ దాడులు, మహిళలపై జరిగే అకృత్యాలు, నేరాలపై తక్షణమే స్పందించే విధంగా భరోసాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితులకు అవసరమైన స్వల్పకాలిక బస, న్యాయ సహాయం అందించడంతోపాటు కేసు పూర్తిగా తేలే వరకు తమ సంపూర్ణ సహకారం వారికి అందిస్తామని వివరించారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి మొదలుకుని నిందితులను కఠినంగా శిక్షించే వరకు భరోసా కేంద్రం అండగా ఉంటుందని స్వాతీ లక్రా స్పష్టం చేశారు. భరోసా, పునరావాసం కల్పించడం తమ ముఖ్య ఉద్దేశ్యంగా ఆమె తెలిపారు. బాధిత మహిళలకు అవసరమైన స్వల్ప ఆర్థిక సహాయాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ అందిస్తుందని, సాంకేతిక సహకారాన్ని తరుణి ఎన్‌జివో సంస్థ సమకూరుస్తుందని తెలియజేశారు. భరోసా కేంద్రానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు చాలా సంస్థలు ముందుకు రానున్నాయని తెలిపారు.



# ఫ్లోరైడ్ నీరు జన జీవితాలపై ప్రభావం

- ఫ్లోరైడ్ ప్రభావంతో గరళంగా మారుతున్న జలం
- పంటి నుండి ఎముకల వరకు గుల్ల
- సోకిన 5 సంవత్సరముల తరువాత ప్రభావం వెలుగులోకి
- పీడిత గ్రామాల్లో ప్రతి ఇంటా బాధితులే
- ఆహార అలవాట్ల మార్పుతోనే మహమ్మారికి అడ్డుకట్ట
- ప్రభావిత ప్రాంతాల ప్రజల ప్రాణాలతో మృత్యుకేళి ఆడుతున్న వైనం

ఫ్లోరైడ్' ఇది ఒక రసాయన మూలకం. నీటి ద్వారా, ఆహారం ద్వారా రెండింటి ద్వారా అధిక మోతాదులో ఫ్లోరైడ్ మానవుని శరీరంలోకి పోవడం ద్వారా వచ్చే వ్యాధే 'ఫ్లోరోసిస్'. ఈ వ్యాధి మనిషిని అణువణువునా దహించి వేస్తోంది. తెలుసుకొనే లోపే మనిషి శరీరమును పీల్చి పిప్పి చేస్తోంది. పెదవి దాటుతుందో లేదో... నొప్పి తెలియకుండా మెల్లగా నిలువెల్లా పాకుతుంది. పంటి దగ్గర నుండి మొదలుపెట్టి కాలి చిటికెన వేలు వరకూ విస్తరిస్తుంది. తరువాత పళ్లను, కీళ్లు, ఎముకలను, పేగులను, మూత్రపిండాలను, మెదడు, వెన్నెముక ఇలా సమస్త శరీర భాగములను దహించి వేసి మనిషిని ఎముకల గూడును చేస్తుంది. బ్రతికి ఉండగానే మరణమును చూపుతూ వణికిస్తుంది. ఇంతకంటే చావే మేలని ప్రార్థించేలా చేస్తుంది.

ఈ ప్రకృతిలో ఫ్లోరైడ్ ద్రవ/ఘన/ వాయు రూపములలో 3 రకములుగా లభిస్తుంది. భూగర్భ జలములలో ద్రవరూపంలోను, రాతి పొరల్లో ఘన రూపంలోను, రసాయనిక కర్మాగారముల నుండి వెలువడే వాయువులు, వ్యర్థ పదార్థములలో వాయురూపంలోను మనం ఫ్లోరైడ్‌ను గమనించవచ్చును. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నిర్దేశించిన ప్రమాణముల ప్రకారం ఒక లీటరు నీటిలో 0.5 మిల్లీగ్రాముల నుంచి 1.5 మిల్లీగ్రాముల (0.7 పీపియం నుంచి 1.2 పీపియం) వరకు ఫ్లోరైడ్ ఉండటం సముచితమని సూచించడం జరిగింది. ఈ మోతాదులో ఫ్లోరైడ్ నీటి ద్వారా గానీ, ఆహారం ద్వారా గానీ తీసుకొంటే ఎముకలకు, దంతములకు గట్టిదనం లభిస్తుంది. అంతకుమించి త్రాగేనీరులో, తద్వారా తీసుకొనే ఆహారంలో ఫ్లోరైడ్ ఉంటే అట్టి పదార్థముల విషతుల్యముగా మారి 'ఫ్లోరోసిస్' వ్యాధి సంభవిస్తుంది.

త్రాగునీటిలో ఫ్లోరైడ్ అధికమైతే ప్రజారోగ్యం క్షీణిస్తోంది అనే విషయం దక్షిణ భారతదేశంలో తొలిసారిగా 1937 సంవత్సరములో ప్రకాశం జిల్లా పొదిలి ప్రాంతంలో వెలుగుచూసింది. తరువాత దర్శి తదితర ప్రాంతములలో కూడా పలు చోట్ల ఈ ప్రభావం ఉంది అని గుర్తించారు. ఉష్ణ మండల దేశమైన భారతదేశంలో నీటిలో 0.5 పీపియం మించి ఫ్లోరైడ్ ఉండరాదు. అయితే తెలంగాణా రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో (10పీపియం) అనేక ప్రాంతములలో మరియు మహబూబ్‌నగర్ జిల్లా, వరంగల్, రంగారెడ్డి జిల్లాలలో కొన్ని ప్రాంతములలో ఫ్లోరైడ్ రక్కసి తరతరాలుగా ఊర్లకు ఊర్లపై కరాళ నృత్యం చేస్తోంది. ప్రజల ప్రాణాలను హరిస్తోంది. సాధారణంగా 0.7 పీపియం నుండి 1.2 పీపియం ఉండవలసిన ఫ్లోరైడ్ నల్గొండ జిల్లాలో అనేక ఆవాసాలలో 10 పీపియం వరకు ఉందంటే దీని దుష్ప్రభావం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

అయితే ఇది ఒక తెలంగాణా రాష్ట్రానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఒరిస్సా, హరియానా, పంజాబ్, ఢిల్లీ, గుజరాత్, జమ్మూకాశ్మీర్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబంగ్లా తదితర ప్రాంతములలోని ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటూ, వారి జీవన స్థితిగతులను అతలాకుతలం చేస్తుంది.

**ఫ్లోరోసిస్ వ్యాధిని గుర్తించడం ఎలా?:**



0.5 మిల్లీగ్రాముల ఫ్లోరైడ్ ఉంటుంది. ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండే నీటిని త్రాగేవారు టీలు అధికముగా త్రాగితే ఫ్లోరోసిస్ బారినపడే అవకాశం ఎక్కువగా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మనిషి శరీరంలోకి చేరిన ఫ్లోరైడ్ పరిమాణము తీవ్రతను బట్టి ఫ్లోరోసిస్ మరియు ఇతర వ్యాధులు వస్తాయని వైద్య నిపుణులు వివిధ పరిశోధనల ద్వారా గుర్తించారు.

ఒక లీటరు నీటిలో 1.50 మిల్లీ గ్రాముల ఫ్లోరైడ్‌కు మించితే దంతక్షయం, దంతములపై ఎనామిల్ దెబ్బతిని దంతములు గుంటలు పడి క్షీణిస్తాయి.

లీటరు నీటిలో 2.00 మిల్లీగ్రాములకు మించితే దంతముల పింగాణీపై రంగురంగుల చుక్కలు ఏర్పడతాయి. పసుపుపచ్చ గార ఏర్పడుతుంది. 5.00 మిల్లీగ్రాములు మించితే ఎముకలు ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతాయి.

8.00 మిల్లీగ్రాములపైన పేగులలో చేరితే ఇన్‌ఫెక్షన్, కండరాల నొప్పులు, ఎర్రరక్త కణములు క్షీణించడం, విరోచనలు, చర్మంపై దద్దుర్లు, తిమ్మిర్లు కలగడంతో పాటు పురుషులలో శుక్రకణముల సంఖ్య తగ్గుతుంది.

- మూత్రం, రక్తం పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధిని గుర్తించవచ్చును.
- పళ్ళపై పసుపు, గోధుమ, నలుగు రంగు చారలు కనిపిస్తే ఫ్లోరోసిస్ సోకినట్లు భావించాలి.
- ఎముకలలో ఫ్లోరోసిస్ వ్యాధిని గుర్తించడానికి సంబంధిత వివిధ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

**ఫ్లోరోసిస్ ఎలా వస్తుంది:**

1. నీరు, ఆహార పదార్థములలో నిర్ణీత ప్రమాణముల కంటే ఫ్లోరైడ్ అధికముగా ఉండటం వలన.
2. కాల్షియం, మెగ్నీషియం, విటమిన్-సి తక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వలన.
3. మూత్ర సంబంధమైన వ్యాధులతో ఫ్లోరైడ్ కారకములు ఎక్కువగా ఎముకలలో నిలిచిపోవడం వలన.
4. సాధారణంగా త్రాగేనీటిలో అతి స్వల్పముగా కనిపించే మూలకాలైన స్ట్రాన్సియం, యురేనియం తదితరములు ఎక్కువ స్థాయిలో ఉండటం.
5. అల్యూమినియం అధికముగా ఉండటం వలన ఫ్లోరైడ్ ప్రభావం మరింత ఎక్కువ అవుతుంది.
6. అల్యూమినియం ఫ్లోరైడ్ మంచినీటిలో ఎక్కువ కలవడం వలన అల్జీమర్స్ వ్యాధితో పాటు 'మోటోర్ న్యూరన్' అనే చికిత్స లేని వ్యాధికి దారి తీస్తుంది.
7. ప్రతిరోజూ మనం త్రాగే ఒక కప్పు టీలో సరాసరిన 0.3 నుంచి

**ఫ్లోరైడ్ ప్రభావము మనిషి శరీరంలోని అవయవములను ఏ విధంగా నాశనం చేస్తుందో చూద్దాం:**

**దంతములపై ప్రభావం:** మనిషి నిద్రలేవగానే చేసే పనులలో ఒకటి నీరుత్రాగడం మరియు పండ్లు తోముకోవడం. అందుకే అన్నింటికంటే మొదలు ఫ్లోరైడ్ ప్రభావం దంతములపై ఉంటుంది. ఫ్లోరైడ్ ప్రభావంతో మొదట పళ్ళపై గల ఎనామిల్ పొర దెబ్బతింటుంది. అందుచేత పళ్ళు త్వరగా పుచ్చిపోతాయి. ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. దంతముల పటిష్టత దెబ్బతింటుంది. ఇతర వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. దంతములకు ఈ వ్యాధి ఒక్కసారి సోకితే జీవితాంతము దంత సమస్యలతో బాధపడాల్సిందే. పళ్ళుగార పట్టి రంగు మారతాయి. దంత వైద్యులతో చికిత్స చేయించుకొన్న 50% వరకే ఫలితం ఉంటుంది తప్ప, పూర్తిస్థాయిలో ఫ్లోరైడ్ ప్రభావం పోదు.

చిన్నపిల్లలలో అయితే దంతములు పసుపువర్ణంలోకి మారి గారపట్టి నశ్యం రంగులోకి మారతాయి. ఇంకా మోతాదు పెరిగితే దంతములపై గుంతలు ఏర్పడి బలహీన పడతాయని వైద్యులు

# ఈ వయస్సులో ఏమిటి మాకీ శిక్ష....

అవసాన దశలో మమ్మల్ని సాకాల్సిన కన్నకొడుకు.. వృద్ధాప్యములో మాకు అండగా వుండాల్సిన కొడుకుకు నేను ఆధారం కావడం ఏమిటి? ఓరి భగవంతుడా ఏమిటి మాకీ శిక్ష! కన్న బిడ్డ యాదగిరి.... పుట్టినప్పుడు బాగానే ఉండేవాడు. ఐదేళ్ళప్రాయం నుండి ఫ్లోరైడ్ వెన్నాడింది. అప్పటివరకూ ఆడుతూ పాడుతూ గెంతుతున్న నా బంగారు కొడుకు ఒక్కసారిగా కాళ్ళనొప్పులు అని ఏడ్చేవాడు. హైదరాబాద్, వరంగల్, నల్గొండ లాంటి పట్టణాలకు తీసుకువెళ్లా. ఎంతో ఖర్చు చేశా. కానీ నా కుమారుడ్ని ఫ్లోరైడ్ బారి నుండి కాపాడుకోలేకపోయా! అందరికీ కొడుకులు పుట్టి సంతోషం మిగుల్చుతారు. నా కొడుకు పుట్టి నన్ను పుట్టెడు దుఃఖంలోకి నెట్టాడు. నా బిడ్డను ఎక్కడకు తీసుకువెళ్లాలన్నా నా భుజం మీద మోసుకు వెళ్లాల్సిందే. వృద్ధాప్యంలో నా భారం మోయాల్సిన కొడుకు నాకు భారంగా మిగలడం పుట్టెడు దుఃఖాన్ని కల్గిస్తుంది. నా బిడ్డ పరిస్థితి నాకు నిద్రలేని రాత్రులు మిగుల్చుతోంది. మేము బ్రతికి ఉన్న రోజులు నా బిడ్డను ఇలా ఎత్తుకొని చూస్తాం కానీ మేము కాలం చేస్తే పరిస్థితి ఏమిటి. ఈ విషయం తలుచుకుంటేనే గుండె చెరువవుతుంది. ఓరి దేవుడా నా కొడుకును ఫ్లోరైడ్ భూతం విడిచేదెలా నాలాగా మరో తండ్రి గుండెలు బాదుకోకుండా చూడు తండ్రీ!

**ఆనందాలకు అడ్డుకట్ట:** పిల్లలు లేని మాకు లేక లేక పుట్టాడు ఒక్కగానొక్క మగబిడ్డ రాజు. ఎంతో సంతోషపడ్డాం. కానీ ఆ ఆనందం మున్నాళ్ళ ముచ్చటే అయ్యింది. జీవితాంతం కన్నీళ్లు మిగిలేలా ఉన్నాయి. 3వ సంవత్సరం వచ్చేసరికి నా బిడ్డ రాజు అమ్మ కాళ్లనొప్పులు, నాన్న నడుంనొప్పి అంటుంటే ఏమిటో అనుకొన్నాము. తీరా డాక్టర్లకు చూపిస్తే ఫ్లోరోసిస్ వ్యాధి సోకిందని తేల్చేశారు. మీరు జాగ్రత్తలు తీసుకోవాలని బోర్లలో నీరు త్రాగకూడదని పులుపు, బలవర్ధక ఆహారం పెట్టాలని చెప్పారు. కానీ రెక్కాడితే గానీ డొక్కాడని బ్రతుకులు మావి. నా బిడ్డకు అంత ఖరీదైన తిండి, వైద్యం ఎలా చేయించగలం. రోజూ బిడ్డను తలుచుకొని కుమిలిపోతున్నాం. అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లాలన్నా చేయి పట్టుకుని తీసుకెళ్లాల్సిందే. బయటకు తీసుకెళ్లాలంటే చంకనపెట్టుకొని తీసుకు వెళ్ళాల్సిందే. నాకు లేక లేక బిడ్డ పుట్టిన ఆనందం ఆవిరైపోయింది. వాడి భవిష్యత్ తలుచుకుని బెంగా ఉంది. నా బిడ్డ బాగుపడితే అదే మా జన్మకు పదివేలు అని రాజు తల్లి రాములమ్మ వేయిదేవుళ్ళకు మొక్కుకొంటుంది.

హెచ్చరిస్తున్నారు. దీనినే 'మోటార్డ్ ఎనామిల్' అంటారు. అందుకే గర్భవతులు శిశువు గర్భస్థదశలో ఉన్నప్పుడు మరియు ఆ శిశువుకు 3 సంవత్సరముల వయస్సు వచ్చే వరకు ఫ్లోరైడ్ మోతాదు లేని నీటిని వినియోగించడం వలన ఈ ముప్పును తప్పించుకోవచ్చునని వైద్యులు పరిశోధనల ద్వారా సూచిస్తున్నారు.

**నియంత్రణ లేదా నివారణ:** బత్తాయి, నిమ్మ, కమలా, జామ, సీతాఫలం, ఉసిరికాయలు, చింతపండు, రాగులు, కరివేపాకు, ఆకుకూరలు, చామ తీసుకొంటే ఫ్లోరోసిస్ వ్యాధి నుండి దంతములను కాపాడుకోవచ్చును. పండ్లలోని పోషకములు పళ్ళు గారపట్టకుండా రక్షణగా పనిచేస్తాయి.

**కీళ్ళు, ఎముకలపై ప్రభావం:** ఫ్లోరోసిస్ ప్రభావము వలన ఎముకలు పెళుసుబారిపోతాయి. కీళ్ళు అరిగిపోతాయి. అందుకే ఫ్లోరోసిస్ వ్యాధి సోకిన వ్యక్తి పొరపాటున క్రింద పడితే కాలో చెయ్యో విరుగుతుంది. బోరు నీటిలోని ప్రమాదకర మూలకములు శరీరంలోని ఎముకలు, కీళ్ళకు చేరే కాల్షియం, మెగ్నీషియంలను వంటబట్టనీయవు. ఆకుకూరలు, విటమిన్-సి లభించే పండ్లు ఇతర పదార్థములను తీసుకొంటే ఎముకలు, కీళ్ళపై ఫ్లోరోసిస్ ప్రభావమును అడ్డుకొనవచ్చును. లేదంటే కాళ్ళు చేతులు వంకర్లు తిరిగి మనిషి నేలపై జోగాడే పరిస్థితికి చేరుకొంటాడు. 20 సంవత్సరముల వయస్సులోనే 60 సం॥ల వార్థక్యమును చవి చూడాల్సి ఉంటుంది.

**నియంత్రణ/ నివారణ:** ముఖ్యంగా వడపోసిన నీటిని త్రాగడానికి ఉపయోగించినట్లయితే చాలా వరకు నీటిలో ఉండే హానికారక రసాయన మూలకములను వేరు చేయవచ్చును. తద్వారా ఫ్లోరోసిస్ వ్యాధికి దూరంగా ఉండవచ్చును. చింతపండు ఎక్కువగా ఆహార పదార్థములలో, కూరలలో తీసుకోవలెను. ఆకుకూరలు, పాలు, పండ్లు అధికముగా తీసుకొంటే కొంతవరకు ప్రయోజనం కలుగుతుంది.

**వెన్నెముకపై ప్రభావం:** ఫ్లోరోసిస్ వ్యాధిసోకిన వ్యక్తికి వెన్నెముక త్వరగా దెబ్బతిని వంగిపోతుంది. క్రమంగా నడవలేని స్థితికి వచ్చి కాళ్ళుచేతులు వంకర్లు పోతాయి. నీటిలో ఉండే 15 మూలకములతో పాటు బెరీలియం, నైట్రేట్ తదితర ప్రమాదకర కారకాలు మనిషి ఆరోగ్యమును దెబ్బతీస్తాయి. హానికర కారకాలతో కూడిన నీటిని త్రాగడం వలన వెన్నెముకపై ప్రభావం పడుతుంది. వెన్నెముక చచ్చుబడిపోయి తలకూడా తిప్పలేని పరిస్థితి. వెనుకకు చూడలేని స్థితికి చేరతాడు. నిటారుగా ఉన్న మనిషి వంగిపోవడం, కర్ర సహాయం లేనిదే నడవలేకపోవడం చివరకు ఎముకల గూడుగా మారిపోవడం జరుగుతుంది. మెదడు, నరములు పూర్తిగా దెబ్బతిని మంచానికి పరిమితమవుతాడు.

**నియంత్రణ:** ఫ్లోరోసిస్ సోకిన వ్యక్తి కాల్షియం, మెగ్నీషియం, విటమిన్-సి అధికముగా ఉండే పదార్థములను తీసుకోవడం ద్వారా ఈ మహమ్మారిని నియంత్రించవచ్చును. పులుపు పదార్థమైన చింతపండు, సీతాఫలం, గుడ్లు, రాగులు, ఆకుకూరలు, పాలు, పండ్లు అధికముగా తీసుకొంటే ఫ్లోరైడ్ బారి నుండి రక్షణ పొందవచ్చును.

**కిడ్నీలపై ప్రభావం:** ఫ్లోరోసిస్ బాధితులలో ఎక్కువ మంది కిడ్నీ సంబంధిత వ్యాధులతోనే చనిపోతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణా జిల్లాలలో 400 మందికిపైగా మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో చనిపోగా అనధికారికంగా ఆ సంఖ్య 2000 వరకు ఉ

ఒడవచ్చునని అంచనా. ఫ్లోరైడ్ కారక నీరు త్రాగితే అది నేరుగా కిడ్నీలలోకి చేరుతుంది. దానితో కిడ్నీలు ఇన్‌ఫెక్షన్‌కు గురై పనిచేయడం మానేస్తాయి. దాని వలన మరణం సంభవిస్తుంది. ఒక్కోసారి ఇది క్యాన్సర్‌కు కూడా దారితీయవచ్చును.

**నియంత్రణ:** వాస్తవముగా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతములలో ప్రజలు బోర్ల నీటిని త్రాగకూడదు. కానీ ఆయా ప్రాంతాల ప్రజలు వేరే ప్రత్యామ్నాయం లేక బోర్ల నుండి వచ్చే నీటినే త్రాగి అన్యాయముగా ఫ్లోరోసిస్ బారిన పడుతున్నారు. అందుకే ఇలాంటి ప్రాంతాల ప్రజలు నీటి వడపోత యంత్రముల (డీఫ్లోరైడ్ ఫిల్టర్లు)ను తప్పనిసరిగా వినియోగించాలి. అంతేకాక బెల్లము, సీతాఫలం, జామపండ్లు మరియు కరివేపాకు ఎక్కువగా తీసుకోవాలి. దీనితో పాటు ఆహార కూరలలో చింతపండు అధికముగా తీసుకొంటే కిడ్నీలకు ముప్పు ఉండదు.

**మెదడుపై ప్రభావం:** స్త్రీలు గర్భవతులుగా ఉన్న సమయంలో ఫ్లోరైడ్ కల్గిన నీరుత్రాగితే ఆ ప్రభావం బిడ్డ మెదడుపై పడుతుంది. అదే జరిగితే పుట్టే బిడ్డ మతిస్థిమితం లేకుండానో, బుద్ధిమాంద్యంతోనో, అవయవలోపంతోనో, ఎదుగుదల లేకుండానో జన్మిస్తాడు. ఇటువంటి ప్రభావం 13 సంవత్సరముల చిన్నారులలో ఉంటుంది. కొన్ని సందర్భములలో పెద్దలకు సోకినట్లయితే మెదడు నరములు బలహీనపడి చిట్లిపోయి పక్షవాతం వచ్చే ప్రభావం ఉంటుంది.

**నియంత్రణ:** ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతములలోని మహిళలు గర్భం దాల్చినది మెదలు బిడ్డ పుట్టే వరకు చాలా జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. మెదడుకు బలమునిచ్చే ఆకుకూరలు, గుడ్లు, పాలు, రాగులుతో చేసిన పదార్థములను అధికంగా తీసుకొంటే ఇలాంటి ప్రమాదములకు దూరంగా ఉండవచ్చును. కాల్షియం, మెగ్నీషియం, విటమిన్–సి తదితర పదార్థములు ఫ్లోరైడ్‌ను సమర్థవంతముగా నియంత్రిస్తాయి. వీని లభ్యతను గురించి తెల్సుకుందాం!

**ప్రతి 100 గ్రాముల ఆహారంలో ఉండే పోషకములు మిల్లీగ్రాములలో**

| పదార్థం | కాల్షియం | మెగ్నీషియం | విటమిన్ – సి |
|---|---|---|---|
| కరివేపాకు | 836 | – | – |
| తోటకూర | 800 | 4.2 | 179 |
| అవిశాకు | 1130 | 169 | – |
| చేమ ఆకు | 1546 | 12.8 | – |
| రాగులు | 344 | – | – |
| గసాలు | 1584 | 9.9 | – |
| జొన్నలు | – | 171 | – |
| నువ్వులు | 1450 | 5.2 | – |
| జీలకఱ | 1080 | 475 | – |
| ఉసిరి | – | – | 600 |
| బెల్లం | 1638 | – | – |

ఫ్లోరోసిస్ వ్యాధి రాకుండా నివారించుటలో కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ –సి లు ప్రభావం చూపుతాయని తెలుసుకొన్నాము. తెలుగు రాష్ట్రములలో కంటే పంజాబ్, హరియాణా రాష్ట్రములలో ఫ్లోరైడ్ శాతం అత్యధికం. అయినా అక్కడి ప్రజలు తమ ఆహార అలవాట్లను మార్చుకొని తద్వారా ఫ్లోరైడ్ మహమ్మారిని సమర్థవంతముగా ఎదుర్కొనవచ్చునని నిరూపించారు. ఫ్లోరైడ్‌ను ఆహారపు అలవాట్ల ద్వారా నియంత్రించడంలో విజయం సాధించిన పంజాబ్, హరియాణ వానుల విజయం మనకు స్ఫూర్తిదాయకం కావాలి.

**నివారణ మార్గాలు:**

- బోర్లు, బోరు బావుల నుండి వచ్చే నీరు సురక్షితం కాదు. కనుక అట్టి నీటిని ఉపయోగించరాదు.
- నదులు, కాలువలు, చెరువులు, బావుల ద్వారా లభించే నీటిలో ఫ్లోరైడ్ చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. కనుక అటువంటి నీరు కొంత వరకు ఉపయోగించచ్చును.
- ఎల్లప్పుడూ శుద్ధి చేసిన సురక్షితమైన మంచినీరు త్రాగాలి.
- రైతులు వ్యవసాయ పనులకు పొలము వద్దకు వెళ్లినప్పుడు బోర్లలోని నీటిని త్రాగరాదు. తమ ఇంటి వద్ద నుండి సురక్షితమైన మంచినీటిని తెచ్చుకొని ఆ నీటినే త్రాగటానికి ఉపయోగించాలి.

**ఇతర జాగ్రత్తలు:** చిన్నపిల్లలు పళ్ళు తోముకొనేటప్పుడు టూత్‌పేస్టు మింగకుండా చూసుకోవాలి. ఎందుకంటే టూత్‌పేస్టులో 3 నుండి 7 పీపిఎం వరకు ఫ్లోరైడ్ ఉండి అది శరీరంలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతములలో అల్యూమినియం పాత్రలు అసలు ఉపయోగించరాదు. ఇటువంటి ప్రాంతములలో మట్టిపాత్రలు, ఇండాలియం మరియు స్టీలు పాత్రలను మాత్రమే వంట చేయుటకు వినియోగించవలెను.

**బాధ్యత ఎవరిది?:** ఫ్లోరైడ్ సమస్య మాది కాదంటే మాది కాదు అని ఆర్.డబ్ల్యు.ఎస్., ఐ.సి.డి.ఎస్., డి.ఆర్.డి.ఏ., రెవెన్యూ యాంత్రాంగం తదితర శాఖలు తప్పించుకోజూస్తూ అంతా వైద్య ఆరోగ్య శాఖపై నెపం నెట్టి తప్పించుకొంటున్నారు. సమన్వయలేమి, బాధ్యతారాహిత్యం సైతం సామాన్య ప్రజలు ముఖ్యంగా విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఈ విభాగములను సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమన్వయపర్చి పని చేయించగలిగితే మేలైన ఫలితములు లక్ష్యాలను సాధించవచ్చును. ప్రభుత్వములు సైతం తమ వంతు బాధ్యతగా రక్షిత మంచినీరు అందించుట ద్వారా సమస్య తీవ్రతను తగ్గించుటకు వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయి. ఒక్క నల్గొండ జిల్లాలోనే 1100 ఆవాసాల ప్రజలకు కృష్ణానది ద్వారా త్రాగునీరు అందించుటకు కోట్ల రూపాయలు వెచ్చించారు. అయినప్పటికీ ఫ్లోరైడ్ సమస్య పూర్తిగా సమసిపోలేదు. ప్రభుత్వ చర్యలకు తోడు ప్రజలు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఆహారపుటలవాట్లు, ఇతర విషయములలో కొన్ని జాగ్రత్తలు తీసుకొన్నట్లయితే ఫ్లోరైడ్ రక్కసిని శాశ్వతంగా పారద్రోలవచ్చు

**– కోమట్ల త్రినాథరెడ్డి,**
**ఎమ్.ఏ., ఎస్.ఆర్.పి.**
**– జి.జయపాల్‌రెడ్డి,**
**కన్‌సెల్‌టెంట్, టిసిపార్డ్**

# భగీరథ ప్రయత్నానికి పునాది

భగీరథయత్నానికి పునాది పడనున్నది. సమైక్య పాలనలోని సాగునీటి దోపిడీని అరికట్టడంతో పాటు రీడిజైనింగ్‌తో తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా రూపుదిద్దుకున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సాకారం కానున్నది. ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా ఆవిర్భవించనున్న ఈ ప్రాజెక్టుకు మే రెండో తేదీన శంకుస్థాపన, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తుండగా.. సంబంధిత పరిపాలనాపరమైన అనుమతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. గతంలోనే బ్యారేజీలకు ఉత్తర్వులిచ్చిన సర్కారు.. శుక్రవారం మూడు బ్యారేజీల వద్ద మూడు పంపుహౌజ్‌లు, ఇతరత్రా పనులకు సంబంధించి పరిపాలనాపరమైన అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రూ. 7998 కోట్లతో చేపట్టనున్న ఈ పనులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో అటు బ్యారేజీలు, ఇటు పంపుహౌజ్‌ల నిర్మాణానికి టెండర్లు పిలవడమే తరువాయిగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు సాక్షాత్తూ సీఎం కేసీఆర్ శాసనసభా వేదికగా సాంకేతిక అంశాలతో సహా దానిని తెలంగాణ సమాజానికి వివరించారు. అయితే ఈ ప్రాజెక్టు డిజైన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి తెలంగాణ ప్రయోజనాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ రీడిజైనింగ్ చేశారు. తమ్మిడిహట్టి వద్ద నిర్మించే బ్యారేజీ ద్వారా చేపట్టనున్న ప్రాణహిత ప్రాజెక్టును ఆదిలాబాద్ జిల్లాకే పరిమితం చేసి రెండులక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందించేలా ప్రణాళికను రూపొందించారు. గోదావరిజలాల్లో తెలంగాణ వాటాలో సింహభాగం వాడుకొని ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రీడిజైనింగ్‌లో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అత్యంత కీలకమైనది. మునుపెన్నడూలేని రీతిలో ఉప నదుల్లో ఉన్న నీటి లభ్యత ద్వారా ప్రధాననదికి జీవం పోసి తద్వారా బీడు భూములకు సాగునీరు అందించే నదీ మార్గంలోనే రివర్స్ పంపింగ్ ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. వేలగంటలపాటు, వందల సమీక్షలతో సుదీర్ఘ మథనం తర్వాతనే కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సమగ్ర రూపం వచ్చింది. వీటికి తోడు దేశంలోనే మొదటిసారిగా సాగునీటి ప్రాజెక్టుల కోసం నిర్వహించిన అధునాతన లైడార్ సర్వే ద్వారా కచ్చితమైన సాంకేతిక వివరాలతో ప్రాజెక్టు రూపుదాల్చబోతున్నది.

**21.29 టీఎంసీల నిల్వతో మూడు బ్యారేజీలు..**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గోదావరి ఉప నది అయిన ప్రాణహితపై మేడిగడ్డ వద్ద ప్రధాన బ్యారేజీని నిర్మించనున్నారు. ఇక్కడి నుంచి 160 టీఎంసీల నీటిని ఎల్లంపల్లికి తరలించడమనేది ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇందుకుగాను ఎగువన గోదావరి నదిపై అన్నారం వద్ద మరో బ్యారేజీని నిర్మిస్తారు. ఆతర్వాత దాని ఎగువన సుందిల్ల వద్ద మరో బ్యారేజీ.. ఇలా మూడు బ్యారేజీలను నిర్మించి రివర్స్ పంపింగ్ ద్వారా ఎల్లంపల్లికి నీటిని తరలిస్తారు. అయితే ఈ మూడు బ్యారేజీలకు సంబంధించి గతంలోనే ప్రభుత్వం అనుమతులిచ్చింది. రూ. 5,813 కోట్లతో మూడు బ్యారేజీల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. మూడు చోట్ల నీటినిల్వ 21.29 టీఎంసీలు.

**రూ. 7,998 కోట్లతో పంపుహౌజ్‌ల నిర్మాణం..**

మేడిగడ్డ నుంచి అన్నారం... అటు నుంచి సుందిల్ల తద్వారా ఎల్లంపల్లికి గోదావరిజలాల్ని తరలించేందుకు మూడు చోట్ల పంపుహౌజ్‌ల నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఎత్తిపోతల వ్యవస్థ, పంపుహౌజ్... అందులో పంపులు, ఎలక్ట్రో–మెకానికల్ పనులు, సివిల్ పనులు ఇలా మొత్తానికిగాను అంచనాలు రూపొందించారు. వాటిని పరిశీలించిన ప్రభుత్వం శుక్రవారం మూడు పంపుహౌజ్‌లకు వేర్వేరుగా పరిపాలనాపరమైన అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మేడిగడ్డ నుంచి అన్నారం వరకు నీటిని తరలించేందుకు కావాల్సిన పంపుహౌజ్, ఇతరత్రావాటికి రూ. 3524 కోట్లతో ప్రతిపాదనలు రాగా అంత మొత్తానికి అనుమతులు ఇచ్చింది. అన్నారం నుంచి సుందిల్ల వరకు నీటిని తరలించే పనులకు రూ. 2141 కోట్లతో ప్రతిపాదనలు రాగా రూ. 2040 కోట్లకు, సుందిల్ల నుంచి ఎల్లంపల్లి వరకు నీటి తరలింపునకు రూ. 2335 కోట్ల ప్రతిపాదనలకు రూ. 2334 కోట్లు... ఇలా మూడింటికిగాను రూ. 7,998 కోట్లకు అనుమతులు ఇచ్చింది.

**త్వరలో టెండర్లకు కసరత్తు**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించనున్న మూడు బ్యారేజీల్లో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ అంతర్రాష్ట్ర అంశంతో ముడివడి ఉంది. అయితే దీనిపై ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్ర సర్కారుతో సూత్రప్రాయంగా అంగీకారం చేసుకుంది. సంయుక్త సర్వే నివేదిక ప్రకారం మేడిగడ్డ వద్ద 101.5 మీటర్ల ఎత్తులో ఈ బ్యారేజీపై తుది నిర్ణయం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే అటు బ్యారేజీలు, ఇటు పంపుహౌజ్‌ల నిర్మాణానికి సంబంధించి అంచనాలు, పరిపాలనాపరమైన అనుమతులు కూడా శుక్రవారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో అధికారులు టెండర్లు పిలిచేందుకు కూడా అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పది, పదిహేను రోజుల్లో ఈ ప్రక్రియ మొదలుపెట్టే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది.

**ఉత్తర తెలంగాణకు చరిత్రాత్మకమైన రోజు**

దాదాపు 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా రూపుదిద్దుకుంటున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం కానున్నది. కొత్త ఆయకట్టుతో పాటు గతంలోని నిజాంసాగర్, ఎస్సారెస్పీ వంటి భారీ ప్రాజెక్టులకు సైతం అవసరమైతే ఇది ఊపిరిలూదనున్నది. ఈ నేపథ్యంలో ఇలాంటి ప్రాజెక్టుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసేందుకు ముహూర్తం ఖరారైంది. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష‘త్మకంగా చేపట్టిన ప్రాజెక్టుల రీడిజైనింగ్‌లో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం డిజైన్ అత్యంత ప్రధానమైనది. దీంతో ఆ రోజు ఉత్తర తెలంగాణకు ఓ చారిత్రక సుదినం కానుంది. రెండో తేదీన ఉదయం ఆరు గంటలకు కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం వద్ద తన మొక్కును తీర్చుకోనున్న సీఎం కేసీఆర్.. 7.30 గంటలకు కన్నెపల్లి వద్ద మేడిగడ్డ, అన్నారం పంపుహౌజ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆతర్వాత పది గంటలకు అంబటిపల్లి దగ్గర మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

**కరువు మాయం..**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పూర్తయి... ఇంత భారీస్థాయిలో నీటి నిల్వ జరిగినట్లయితే తెలంగాణ గడ్డపై కరువు అనేది మాయం కానుందనేది నిపుణులు సైతం అంగీకరిస్తున్న సత్యం. ఎందుకంటే గత ఏడాది తీవ్ర వర్షాభావం ఉన్నప్పటికీ గోదావరిలో తెలంగాణ మీదుగా దాదాపు 1400 టీఎంసీలకు పైగా జలాలు సముద్రం పాలయ్యాయి. ఇందులో కీలకమైన ప్రాణహిత, ఇంద్రావతిలోని నీటి లభ్యతను ఒడిసిపట్టేదే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. దీనిద్వారా అవసరమైతే దక్షిణ తెలంగాణకు కూడా నీటిని తరలించేలా వ్యవస్థను రూపొందించాలనే లక్ష్యం కూడా ప్రభుత్వం నిర్దేశించుకుంది. అంటే ఒక్కసారి ఇంత భారీస్థాయిలో నీరునిల్వ ఉన్నట్టయితే వరుసగా రెండు, మూడేండ్లపాటు వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ తాగునీటికి, సాగునీటికి ఢోకా ఉండదు.

**టిసిపార్థు / ఎన్.పి.ఆర్.**

# అంతర్జాతీయ స్థాయిలో డా॥ బి. ఆర్. అంబేద్కర్ ఆలోచనలకు గౌరవం




**భా**రతీయ వైతాళికునికి అంతర్జాతీయ గుర్తింపు రావడం ఇటీవల రెండవసారి జరిగింది. మొట్టమొదటిసారిగా స్వామి వివేకానంద ప్రపంచ మతాల సదస్సులో మాట్లాడి విశ్వమానవతను చాటి చెప్పారు. అదే రీతిలో డా॥ బి.ఆర్.అంబేద్కర్ 125వ జన్మదినాన్ని ఐక్యరాజ్యసమితి జరుపుకోవడం చెప్పుకోదగిన అంశం. ఒక దళిత మేధావికి అంతర్జాతీయ వేదికలో అంతటి గౌరవం లభించటం చరిత్ర అయింది. డా॥ అంబేద్కర్ వ్రాసిన భారత రాజ్యాంగం భారతీయ స్పృహా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వలను సంతరించుకుంది. ఇదే డా॥ బి.ఆర్.అంబేద్కర్‌ను విశ్వమానవుడిగా చేసింది. మనుషుల మధ్య తారతమ్యాలను తొలగించేందుకు జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు. డా॥ అంబేద్కర్‌కు గుర్తింపు మాత్రం ఆలస్యంగా వచ్చింది. 1989-90లో వి.పి.సింగ్ ప్రధానిగా ఉన్న కాలంలో డాక్టర్ అంబేద్కర్‌కు "భారతరత్న" పురస్కారం ఇచ్చారు. 1998-99 మధ్య కాలంలో వాజ్‌పాయ్ ప్రధానిగా ఉండగా 250 కోట్ల రూపాయలతో అంబేద్కర్ కేంద్రాన్ని నిర్మించేందుకు స్థలం 15 జనపథ్‌రోడ్ కొత్త ఢిల్లీలో కేటాయించారు. 2004లో డా॥అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్.సి.లకు ఉప ప్రణాళిక, ఎస్.టి.లకు ఉప ప్రణాళికలను విధానంగా చేశారు. కాని దళితులకు ఉప ప్రణాళికలను 28 రాష్ట్రాలలో సగం కూడ పాటించడం లేదని చెప్పాలి. డా॥అంబేద్కర్ ఆలోచనలకు ఇప్పుడిప్పుడే సంకుచిత రాజకీయాలను సైతం అంటగట్టి సొంతం చేసుకొనవలెననే ప్రయత్నానికి కూడా ఈ 125 సం॥లు పూనుకొన్నారు. ఆనాడు స్వాతంత్ర్యం పొందిన 52 ఆఫ్రికా ఆసియా దేశాలు తమ విధానాలను నిలకడగా నిలుపుకొన లేకపోయాయి. కాని మన దేశం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంను ఎంచుకొని మరోదానికి తావులేకుండా నడిపించుకొంటున్నాం. అది మన రాజ్యాంగం యొక్క గొప్పతనం. అందుకు ప్రాణం పోసిన అంశాలలో అందరికి ఓటు హక్కు 21 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించడం, బీద, బిక్కి, విద్యవంతుడు అని తేడా లేకుండా అందరికి ఓటు హక్కు కల్పించుట వలన 'దళితుల' ప్రాథమిక హక్కులు నిలిచాయి. లేకుంటే దళితులను ఎవరు పట్టించుకొనేవారు కారు.

మన రాజ్యాంగం అస్పృశ్యతను నిషేధించింది. 17వ ఆర్టికల్ క్రింద శిక్షార్హం చేసింది. అయినా 70 సంవత్సరాల నుండి సాగుతూనే అంటరానితనం నడుస్తుంది. దళితులకు నేటికి కొన్నిచోట్ల దేవాలయ ప్రవేశం లేదు. స్వేచ్ఛ సమానత్వాలున్న వాటిని పాటించే వారు లేరు. రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతూనే ఉంది. దళిత మహిళల మీద అత్యాచారాలు జరుగుతున్నాయి. కనుక నేటి మన రాజ్యాంగ సూత్రాలను శ్రద్ధతో అమలు చేయాలి. కాని ఎవరు చేయరు. పట్టదు. ప్రభుత్వమే కుల వ్యవస్థను ప్రోత్సహిస్తుందని అంటారు. అంటే కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడం. రాజ్యాంగంలోని పీఠికను గూర్చి వివరించుతూ డా॥ అంబేద్కర్ "సార్వభౌమాధికార, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యాం" అన్నారు. ఆయన సెక్యులర్, సోషలిస్టు మాటలను రాజ్యాంగ పీఠిక నందు చేర్చుటకు ఒప్పుకొనలేదు.

ముఖ్యంగా సోషలిస్టు మాటను అంబేద్కర్ రాజ్యాంగంలో చేర్చుటకు ఎందుకు ఒప్పుకొనలేదంటే ఆయన సోవియట్ సోషలిస్టు వ్యవస్థను రాజ్యాంగంలో చేర్చేందుకు వ్యతిరేకించాడు. పేకమేడ వలె ఎప్పుడైన ..... కూలిపోవచ్చునని జోస్యం చెప్పాడు. మన కళ్ళ ముందే 70 సంవత్సరాల కమ్యూనిస్టు సోవియట్ యూనియన్ కూలిపోయింది. ఆ విధంగా డాక్టర్ అంబేద్కర్ దార్శనికతకు ఇదో నిదర్శనం.

**ఐక్యత వాది**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశ ఐక్యతను కోరుకున్నాడు. జిన్నావలె ప్రత్యేక ముస్లిం రాజ్యంలను కోరుకొనలేదు. ఆనాడు కోరుకొనుంటే తప్పక దళితులకు ప్రత్యేక రాజ్యం వచ్చిందేది. కాని

అంబేద్కర్ ఆ పని చేయలేదు. కేవలం ఇండియానే యూనియన్‌లో భాగంగా 12 కోట్ల మంది దళితులను కొనసాగించాడు. తనను, అంటరానివాడిగా చూచినా కూడా అంబేద్కర్ దేశ ఐక్యతను కోరుకున్నాడు. దేశం విచ్ఛిన్నం కాకుండా పాలనలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ప్రధాన న్యాయమూర్తి, అయ్యే స్థితి రాజ్యాంగం నందు పొందుపరచాడు. అదే విధంగా కేంద్ర సర్వీసులు ఐఏఎస్, ఐపిఎస్‌లను కేంద్రం వద్దనే ఉంచాలని, మిలిటరీ దళాలు, పారామిలిటరీ దళాలుగా కేంద్రం పరిధిలో ఉంచారు.

**న్యాయ సమీక్ష**

ప్రధాన న్యాయమూర్తిని సుప్రీం కోర్టు రాజ్యాంగ రక్షణలో చేర్చారు. న్యాయవ్యవస్థను ప్రధాన బాధ్యురాలుగా చేశారు. అందుకే రాజకీయ కార్య నిర్వాహకవర్గం శాసననిర్మాణ వర్గం ఉంది. అదే విఫలమైతే న్యాయ వ్యవస్థ ఆదేశాలను జారీ చేస్తోంది. డెమోక్రటిక్ సెటప్‌ను సుస్థిరంగా ఉంచేందుకు డా॥ బి.ఆర్.అంబేద్కర్ కృషి చేశారు. అదే విధంగా దేశ ఐక్యతను కాపాడే దిశలో డా॥ అంబేద్కర్ 370 ఆర్టికల్‌ను వ్యతిరేకించారు. కాశ్మీరు రాష్ట్ర ప్రత్యేక రాయితీలు ఉండక్కర్లేదని వాదించాడు. అదే విధంగా జమ్ముకాశ్మీర్ విషయంలో నెహ్రూ నిర్ణయాలను సమర్థించలేదు. అంటే ఆయన దూరదృష్టి ఎంతవరకు ఉందో గమనించవలెనని మనవి. దేశం మొత్తం ఒకేపౌరన్యాయం (యూనిఫారం సివిల్ కోడ్)ను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గట్టిగా సమర్థించారు. కాని ఆనాటి పార్లమెంటు వివిధ కారణాల వల్ల మద్దతు లభించలేదు. డా॥ అంబేద్కర్‌ను ఐక్యతవాది, దేశం ఐక్యంగా ఉండాలని కోరుకొని తను నమ్మిన సిద్ధాంతాలను విడనాడలేదు. దీనిని మిగతా దళిత నాయకులు సమర్థించారు.

**సాంఘిక ఐక్యత**

భారతీయ సమాజం శాంతి, సమాధానాలతో ఉండాలని డా॥బి.ఆర్.అంబేద్కర్ కోరుకున్నారు. దేశ ఐక్యతను సమర్థించుటంతో ఐక్యంగా ఉంటూ మన బుగ్మతలను తొలగించుకొనవలయుని అంబేద్కర్ ఆశించారు. ఇంత పెద్ద దేశంలో అందరికి న్యాయం చేకూరాలంటే సమిష్టి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. బంజరు భూములను బీదవారికి పంపిణీ చేయాలన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కొరత ఉన్న వస్తువులను ప్రజలకు అందించాలని కోరారు. కరువు, కాటకాలు, క్షామ సమయాలలో ప్రభుత్వం ప్రజలను ఆదుకొనవలెనని సూచించారు.

దేశంలో నుండి 'కులం' ఆధిపత్యం క్రమంగా తొలగించవలయునని సూచించారు. అందుకు అంబేద్కర్ 'ఎనిహిలేషన్ ఆఫ్‌కాస్ట్'ను ప్రచురించారు. కార్మిక శ్రేయస్సుకే గాక కులనిర్మూలనకు కూడా ఒక మంచి కార్మిక వ్యవస్థ తోడ్పడుతుందని భావించారు. కార్మిక భద్రతకు సమన్యాయం ఉండాలన్నారు. అదే విధంగా 14 గంటలు రోజులో పని చేయుటను 12 గంటలకు కుదించడం ఆ తరువాత 10 గంటలు తగ్గించడంలో డా॥ అంబేద్కర్ ప్రముఖ పాత్ర వహించారు. మహిళా హక్కుల కోసం సమానత్వం స్వేచ్ఛగా వ్యవహరించవలెనన్నారు. మహిళలకు హక్కులు కల్పించుట డాక్టర్ అంబేద్కర్ లీడ్‌రోల్ ప్లే చేశారు. కాని దక్కవలసినంత గుర్తింపు దక్కలేదు. ఈ మహిళా స్వేచ్ఛా విషయంలో డాక్టర్ అంబేద్కర్, జ్యోతిబా పూలే, సావిత్రిబా పూలేను ఆదర్శంగా తీసుకొని 'స్త్రీ విద్య', అవసరం అని వాదించారు. అయినా సనాతన హిందుత్వ వాదులు డాక్టర్ అంబేద్కర్ తీసుకొన్న విషయాలను ప్రక్కన బెట్టి సంప్రదాయ పద్ధతిలోనే వాదించారు. అంబేద్కర్ సూచించిన స్త్రీ విద్యను తిరస్కరించారు. అదే విధంగా మహాత్మాగాంధీ ఆదర్శంగా ఎంచుకొన్న స్వయం సమృద్ధి గ్రామ భావనను అంబేద్కర్ వ్యతిరేకించారు. ఎందుకంటే స్వయం పాలన ఉన్న గ్రామాలలో అసమానతలు అధికంగా ఉంటాయంటారు అంబేద్కర్. తద్వార దళితుల మీద అత్యాచారాలు జరుగుతాయంటారు. సమానత్వం సాధించుటకు కాలం అధికంగా తీసుకొంటారు.

బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 125 సంవత్సరిక ఉత్సవాలను ఐక్యరాజ్యసమితి అధికారికంగా జరుపుటకు నిశ్చయించడం ద్వారా బహుముఖ ప్రయోజనాలు నెరవేరి డా॥అంబేద్కర్‌ను విశ్వమానవుడిగా గుర్తించడం కద్దూ! అదే విధంగా హిందూ ఇతిహాసాలను వ్రాసిన వ్యాసుడు మహాభారతం, వాల్మీకి రామాయణంను రచించిన వారు గిరిజనులే. హారిజనుడు అయిన డా॥ బి.ఆర్.అంబేద్కర్ ' భారత రాజ్యాంగం'ను వ్రాయడం యాదృచ్ఛికమే. మార్టిన్ లూథర్ కింగ్ (జూ), థామస్ హాబ్స్, రూసో లాంటి హక్కులను కలుగజేసిన మహామేధావులతో డాక్టర్ అంబేద్కర్‌ను చేర్చడం ఐక్యరాజ్యసమితి ఉత్సవాలు జరుపుకొనడం సమర్థనీయమే!

జై భీమ్

డాక్టర్ కె.ఆసయ్య

## త్రాగునీటి పథకాల నిర్వహణపై టిసిపార్డులో వర్క్‌షాపు

ప్రపంచ బ్యాంకు, తెలంగాణ ప్రభుత్వ గ్రామీణ నీటి సరఫరా శాఖ సంయుక్తంగా త్రాగునీటి పథకాల నిర్వహణపై 29.04.2016 ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించటం జరిగింది. టిసిపార్డులో నిర్వహించిన ఈ వర్క్‌షాపులో తెలంగాణ ఆర్.డబ్ల్యు.ఎస్&ఎస్ చీఫ్ ఇంజనీరు శ్రీరాములు నాయక్ వరల్డ్ బ్యాంకు తరుపున సలహాదారు శ్రీ జె.వి.ఆర్.మూర్తి ఈ వర్క్‌షాపును నిర్వహించారు.

మహారాష్ట్రలో వివిధ గ్రామాలలోని నీటి పథకాల నిర్వహణ గురించి శ్రీ సమీలహసన్ మరియు సెనెగల్ దేశంలో గ్రామీణ నీటి పథకాల నిర్వహణ గురించి ప్రపంచ బ్యాంకు నిపుణులు ఉమర్‌దయల్లో విశదీకరించారు. తెలంగాణాలోని వివిధ జిల్లాల్లోని గ్రామీణ నీటి పథకాల నిర్వహణ గురించి చర్చించడం జరిగింది.

ఈ వర్క్‌షాపులో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు, సర్పంచ్‌లు, పంచాయతీరాజ్ శాఖ మరియు ఆర్.డబ్ల్యు.ఎస్&ఎస్ శాఖలోని వివిధ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపును టిసిపార్డు నీరు మరియు పారిశుధ్యం కేంద్రం వారు సమన్వయపరిచారు.

సిఎంపి, టిసిపార్డు.






# తెలంగాణ రాష్ట్రంలో బహిరంగ మలవిసర్జన లేని (ODF)

# జిల్లాగా కరీంనగర్ సాధించే దిశగా ప్రగతిలో మొదటిస్థానం

**క**రీంనగర్ జిల్లా విస్తీర్ణం 11,823 చ॥కి॥మీ, 57 మండలములు, 1207 గ్రామపంచాయతీలు, శాసనసభా నియోజకవర్గాలు 13 కల్గి మొత్తం కుటుంబాలు 9,76,022. జిల్లా మొత్తం జనాభా (2011) 37,76,269తో యున్న జిల్లా డిసెంబర్ 2016 నాటికి 100% వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచే విధంగా ప్రగతి ప్రణాళికాబద్ధంగా ప్రజల భాగస్వామ్యం, అధికారుల అంకితభావం, ప్రజాప్రతినిధుల సమర్థ నాయకత్వంతో కలిసి సమన్వయంతో సాగుతుంది.

గ్రామీణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ప్రజాఆరోగ్యం కాపాడుటకు అవసరమైన చర్యలలో బహిరంగ మల, మూత్రవిసర్జన, వ్యక్తి కుటుంబ, సమాజ స్థాయిలో లేకుండా పారిశుద్ధ్య బాధ్యత మన అందరిది. అట్లే ఇది ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ఇప్పటికే జిల్లాలోని 13 నియోజకవర్గాలలో 1. సిరిసిల్లా, 2. వేములవాడ, 3. పెద్దపల్లిలు 100% ODF ప్రకటించబడినాయి. అట్లే 100% అయి వినియోగం చేస్తున్న మండలాలు 11, 81-100% అయిన మండలాలు 10, 51-80% పూర్తిచేసిన మండలాలు 24, 45-50% నిర్మాణం దాటిన మండలాలు 12.

ప్రస్తుతం నియోజకవర్గాల వారిగా కాకుండా పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలలో ప్రతి ఇంటికి, పాఠశాలకు, ప్రభుత్వ కార్యాలయాల్లో ISL నిర్మాణమునకు కార్యచరణ ప్రణాళిక ప్రకారం శ్రీయుత జిల్లా కలెక్టర్ నీతూకుమారి ప్రసాద్ గారు అందరికీ అవగాహన కల్పిస్తూ ఇది అందరి బాధ్యతగా స్వీకరించి చేయుటకు నియోజకవర్గాల వారికి ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన (IEC) కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

టిఎస్‌లో కరీంనగర్ జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఈ దిగువ పట్టిక ద్వారా

## 2012-2016 వరకు 4 సం॥రాల IHHLS ప్రగతి వివరాల పట్టిక

| క్ర.సం | జిల్లా పేరు | ప్రగతి | ప్రగతి | ప్రగతి | ప్రగతి | ర్యాంక్ |
|---|---|---|---|---|---|---|
| | | 2012-13 | 2013-14 | 2014-15 | 2015-16 | |
| 01 | కరీంనగర్ | 62146 | 51636 | 21499 | 56083 | ఫస్ట్‌ప్లేస్ |
| 02 | ఆదిలాబాద్ | 12027 | 27986 | 25740 | 15902 | |
| 03 | ఖమ్మం | 24392 | 13527 | 406 | 11580 | |
| 04 | మహబూబ్‌నగర్ | 22908 | 9701 | 8932 | 16963 | |
| 05 | మెదక్ | 46113 | 27020 | 13379 | 36109 | |
| 06 | నల్గొండ | 13280 | 23299 | 27736 | 19480 | |
| 07 | నిజామాబాద్ | - | 19598 | 6590 | 24967 | |
| 08 | రంగారెడ్డి | 8311 | 7915 | 5052 | 1582 | |
| 09 | వరంగల్ | - | - | 21391 | 12367 | |
| | మొత్తం | 189177 | 180682 | 130725 | 195093 | |

పై పట్టిక పరిశీలన విశ్లేషణ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో ప్రథమస్థానంతో ప్రగతి వైపు ప్రయాణిస్తూ డిసెంబర్-2016 వరకు 100% ఈ క్రింది ఆచరణాత్మక కార్యాచరణ ప్రణాళిక లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

పై విధంగా లక్ష్యంతో సమన్వయంతో ODF ను సాధించేందుకు విశేష కృషి చేస్తూ నిరంతర పర్యవేక్షణ, ఆన్‌జాబ్ సపోర్ట్‌తో కృషి చేస్తున్నారు.

- NGP అవార్డులు 2011-13 వరకు తెలంగాణ రాష్ట్రంలోని 9 జిల్లాలకు 479 రాగా అందులో 90 NGP అవార్డులు సాధించటం జరిగినది. AIP టార్గెట్ 2015-16 వరకు 95.19% సాధించటం గొప్ప విజయం. మొదటిస్థానంలో నిలిచి అన్ని టిఎస్ జిల్లాలకు ఆదర్శంగా నిలిచింది.

**టిఎస్ రాష్ట్రంలో ప్రథమస్థానంలో ISL నిర్మాణాలు జరుగుటకు అమలు పరుస్తున్న వ్యూహాలు/విధానాలు/సమన్వయ విధానాలు:**

- స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్) SBM-(G) పై అట్లే పారిశుద్ధ్య సాధనకు తోడ్పడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై (i.e.) మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ గ్రామీణా త్రాగునీటి పథకం (NRDWP) సర్వశిక్షా అభియాన్ (SSA), జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (NRHM), సాక్షరభారత్, గ్రామీణ పేదరిక నిర్మూలన (DRDA) మొదలగు ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో విస్తృతస్థాయిలో సమాచార పంపిణీ, సమావేశాలలో, సమాలోచనలు చేసి సకాలంలో లబ్దిదారులకు అన్ని విధాల చేయుతనందిస్తున్నారు.
- గ్రామ పంచాయతీ విధులలో త్రాగునీరు & పారిశుద్ధ్యం అతి ముఖ్యమైనది. గ్రామపంచాయతీ అంటే గౌ॥ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామజ్యోతి కార్యచరణ కమిటీలు కార్యదర్శి ఇతర అందరూ సిబ్బంది సమిష్టిగా రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్‌లో స్థానిక ప్రభుత్వాలకు కేటాయించిన 29 అంశాలపై సమన్వయంతో సమగ్ర చర్చలు 'గ్రామసభ'లలో జరిపి వాటితో పాటు పారిశుద్ధ్యం (ODF) పై ప్రత్యేక శ్రద్ధ కనపరుచుచున్నారు.
- ప్రజల సమీకరణ - భాగస్వామ్యం పెంచుటకు అందివచ్చిన అవకాశంగా "గ్రామ ఉదయ్ సే భారత్ ఉదయ్ యోజన" జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా 14.04.2016 నుండి 24.04.2016 వరకు ప్రత్యేక గ్రామసభలు, నిర్దేశించిన లక్ష్యాలతో పాటు ODF జిల్లాపై శ్రద్ధ కనపరిచారు.

**"ప్రభుత్వ శాఖలు - పారిశుద్ధ్యం - సాధనలో సమన్వయం"**

- వయోజన విద్యా కేంద్రాలను (AES) ప్రజలకు అనేక కేంద్ర/


**IHHLS ఇంకనూ నిర్మించాల్సిన గృహాలు జిల్లాలో 170160 ఉన్నాయి.**

| క్ర.సం. | SBM-G (JHHLS) | 2016 |
|---|---|---|
| | నెలవారిగా లక్ష్యం | మాసం/నెల |
| 01 | 17000 | ఏప్రిల్-16 |
| 02 | 18000 | మే-16 |
| 03 | 18000 | జూన్-16 |
| 04 | 19000 | జూలై-16 |
| 05 | 20000 | ఆగస్టు-16 |
| 06 | 20000 | సెప్టెంబర్-16 |
| 07 | 20000 | అక్టోబర్-16 |
| 08 | 20000 | నవంబర్-16 |
| 09 | 18160 | డిసెంబర్-16 |
| మొత్తం(టార్గెట్) డిసెంబర్-16: నైన్‌మంత్స్ - 1,70,160 | | |

రాష్ట్ర పథకాల అమలు/ ప్రయోజనాలు బోధించే కేంద్రాలుగా మార్చి ప్రజల మన్ననలు పొందుతూ సంపూర్ణ అక్షరాస్యత – సాక్షర భారత్ – MCOs, VCOs, గ్రామస్థాయి సిబ్బందితో సమన్వయంతో జిల్లాలో నిరక్షరాసులైన 593253 (పు:235171, స్త్రీ: 358082) వారికి స్వచ్ఛంద వాలంటీర్లను గుర్తించి (65,278 వాలంటీర్లు) వారి సేవలను సంపూర్ణ పారిశుద్ధ్యం – అక్షరాస్యతపై వినియోగించడం జరుగుతుంది.

- పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత కార్యక్రమాల నిర్వహకురాలు అయిన డిఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అరుణశ్రీ గారు మహిళల ఆత్మగౌరవం పెంపుదల కోసం SBM(G) పై స్వశక్తి, గ్రామైఖ్య, మండల సమాఖ్య, జిల్లా సమైఖ్యలలోని ప్రతి సభ్యురాలుకు తమ సమావేశాలలో సామూహిక, బృంద, ముఖాముఖి కమ్యూనికేషన్ విధానాల ద్వారా పారిశుద్ధ్యంపై చైతన్యం నింపుతూ నిరుపేద SHG సభ్యులకు ISL నిర్మాణం కోసం రూ. 5000/- ఋణ సౌకర్యం కల్పిస్తూ SERP, CBO ల ద్వారా నియమించబడిన సిబ్బందికి – లబ్దిదారుల గుర్తింపు సర్వేలో, నిర్మాణం అయిన తరువాత పారితోషిక చెల్లింపులో (రూ. 12000) తమ వంతు చేయూతనందించుటకు కోరినారు. నిరుపేదలకు ఇది గొప్ప ఆర్థిక చేయూత.
- ప్రాజెక్ట్ డైరెక్టర్ – DWMA గణేష్ గారు తమ శాఖ సిబ్బంది అయిన టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్ (FA) ద్వారా SBM(G) డాటా అప్‌లోడ్, నిర్వహణ అనుమతులు, కమెన్స్‌మెంట్ లేఖలు ప్రతి గ్రామం మొత్తం ఒకేసారి నిర్దేశించిన ప్రోఫార్మాలలో పొందిన తరువాత మార్క్అవుట్ మొదటి ఫోటో క్యాప్చర్డ్‌కు రూ. 6000/- నిర్మాణం మధ్యలో 2వఫోటోతో రూ. 4800/- పూర్తి నిర్మాణం – తరువాత 3వ ఫోటో రూ. 1200/- మొత్తం రూ. 12000/- పారితోషికం డబ్బు చెల్లింపు విధానము అమలుకు జిల్లా వ్యాప్తంగా సమిష్టి కృషి చేస్తున్నారు.
- గౌ॥ జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ శ్రీమతి తుల ఉమ గారు జిల్లాలోని మహిళ ZPTCs, MPPs, MPTCs, సర్పంచ్, వార్డు సభ్యులకు మరియు మహిళ ఉద్యోగులందరికీ పారిశుద్ధ్య ఉద్యమానికి మన అందరం చేయూతనందించాలని పిలుపునిచ్చి ప్రతి కార్యక్రమంలో పాల్గొని ప్రోత్సహిస్తున్నారు. పురుష ప్రజాప్రతినిధులకు శ్రీ రాజిరెడ్డి గారు (VCZP) కృషి చేస్తున్నారు.
- ZPP-CEO గారు శ్రీ సూరజ్‌కుమార్ గారు, DY. CEO శ్రీ గౌతమ్‌రెడ్డి గారు వీరి అధీనంలో గల సమస్త సిబ్బందిని భాగస్వాములను చేస్తూ ముఖ్యంగా MPDOs లను EO(PR&RD) లను, పంచాయతీ కార్యదర్శులకు ఎప్పటికప్పుడు తగు సలహాలు, సూచనలు ఇస్తూ వీరి అధీనంలో గల జెడ్పి ట్రైనింగ్ సెల్‌లో DTMలు శ్రీ కోట సురేందర్, సంతోష్‌లను SERWS కన్సల్‌టెంట్స్ మునిందర్ గారు, రమేష్, రాఘవులులను టీమ్‌గా చేసి ప్రజాప్రతినిధులకు, సమస్త జిల్లాలోని సిబ్బందికి అవగాహన సదస్సులు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తూ జాయింట్ కలెక్టర్స్ శ్రీ నాగేంద్ర గారు, ఫౌసమిబాసు గారలు ప్రతివారం వీడియో కాన్ఫరెన్స్‌ల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణతో ముందుకు తీసుకెళ్లుతున్నారు.
- శ్రీయుత జిల్లా కలెక్టర్ గారు, ట్రైనీ కలెక్టర్ గౌతమ్‌కుమార్ గారు జిల్లాలోని అన్ని ప్రసార సాధనాలతో ప్రజలకు సమాచారాన్ని చేరవేస్తూ, 'వాట్సప్' ద్వారా ఫోటోలు, ఆదేశాలు, సందేశాలు ఇస్తూ కళాజాత, సంస్కృతిక సారధి బృందాలతో చైతన్యపరుస్తున్నారు.
- గ్రామాలలోని ఇళ్ళలో, పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాలలో నిర్మించిన ISL లను వినియోగించుకోనుటకు ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి ఉదయం 5 నుండి 7 గం॥ల వరకు గస్తీ తిరగటం, విజిల్స్ వేయటం, వారి ప్రవర్తనలో, అలవాట్లలో మార్పుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు.
- నూతనంగా పాఠశాల విద్యార్థులను బృందాలుగా చేసి బహిరంగ మల విసర్జనకు వెళ్లిన వారి చెంబు/లోట నీరు పారబోస్తే రూ. 10 నుండి 20 బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.
- బహిరంగ మల, మూత్ర విసర్జన రమిత జిల్లాగా సాధించి గ్రామీణ ప్రజల ఆరోగ్యం, రక్షణ, వ్యాధులకు చెల్లించుతున్న లక్షలాది రూపాయలు ఆదా చేయటం, వికలాంగులకు, గర్భిణీ స్త్రీలకు, గ్రామీణ కళాశాలల విద్యార్థులకు ముఖ్యంగా వ్యాధిగ్రస్తులకు ISL శీఘ్రగతిన నిర్మాణం చేసి చేయూతనందిస్తూ – ఒక్కరు మరుగుదొడ్డి కట్టుకోకున్నా అందరిపై ప్రభావం ఉంటుందని కనుక గ్రామం మొత్తంగా ఒకేసారి నిర్మాణం అయ్యేందుకు కృషి చేస్తూ 'బంగారు తెలంగాణ'కు బాటలు వేస్తున్నారు. అందరు కలిసి ప్రతిజ్ఞ తీసుకొన్నారు. ప్రగతికి బాటలు వేస్తున్నారు.
- రాష్ట్రంలోని దత్తత తీసుకొన్న గ్రామాలలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఒక్క 'క్షణం' ఆలోచించి ప్రజలందరి భాగస్వామ్యంతో చిత్తశుద్ధితో మన తల్లులు, అక్కలు, చెల్లెలు అనునిత్యం సిగ్గుతో, ఆత్మవంచనతో బహిర్గమికి వెళ్లి బాధపడవల్సిన పరిస్థితిని మార్చలేమా!? 'మార్చగలము'.
- ఉత్త ఉపన్యాసాలు కాకుండా ఉత్తమ ఆచరణలతో ఇచ్చిన మాటను నిలబెట్టుకోనే విధంగా ఆచరిస్తూ మనగౌరవం పెంపొందించుకొంటూ పారిశుద్ధ్య సాధనలో మన పాత్రపై 'ఆత్మవిమర్శ చేసుకొని – ఆత్మవంచన' మానుకొని నిజాయితీగా స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాలను సాధించే బాధ్యత ఏ ఒక్కరిదో అని వదిలి వేయకుండా అది 'మన అందరి బాధ్యత – సామాజిక బాధ్యత' అని ప్రతి పౌరుడు తెలుసుకొని భాగస్వామి అయి గాంధీజీ పుట్టిన రోజు – అక్టోబర్ 2, 2019 నాటికి స్వచ్ఛతెలంగాణ – స్వచ్ఛభారత్‌ను సాధించేందుకు ప్రతి ఒక్కరం ప్రతినభూని పారిశుద్ధ్య ఉద్యమంలో పాల్గొందాం.

**– కోట సురేందర్,**
జిల్లా శిక్షణ మేనేజర్
కరీంనగర్ జిల్లా.








# రాంప్యారీ – పైడిజయరాజ్

## మూకీ యుగంలో ముంబాయిలో మన తారలు

1908లో హైదరాబాదులో మూసినదికి పెద్దఎత్తున వరదలు వచ్చి జననష్టం,ఆస్థినష్టం భారీగా జరిగింది. ఈ వరదల దృశ్యాలను చిత్రీకరించడానికి ఆరవ నిజాం మహబూబ్అలీ పాషా కలకత్తాకు చెందిన జె.ఎఫ్.మదన్ బృందాన్ని రప్పించి సినీ కెమెరాలతో వరద దృశ్యాలను షూట్ చేయించారు. ఆ తరువాత ఈ దృశ్యాలను ప్రజల కోసం ప్రదర్శించారు కూడా. వీటి గురించి ఆ రోజుల్లో హైదరాబాదు ప్రజలు కథలు కథలుగా చెప్పుకునేవారు. ఇక్కడొక విషయం గమనించాలి. దీంతో నిజాం స్టేట్‌లో 1908కి ముందే సినిమాల గురించిన పరిచయం ఉందని రుజువవుతున్నది. లేకుంటే నిజాం జె.ఎఫ్.మదన్‌ని పిలిచి చిత్రీకరణ జరిపించి వుండేవాడు కాదు. ఖచ్చితంగా హైదరాబాదులో 1908కి ముందే ఫిలిం స్క్రీనింగ్స్ జరిగినవి. ఇది కాదనలేని సత్యం. 1908లోనే బాబూ పి.ఎస్ అనే ఒకాయన తెలంగాణ అంతటా తిరిగి 'ఇంపీరియల్ బయోస్కోప్ కంపెనీ' పేరున మూకీ సినిమాలు ప్రదర్శించారు. ఈయన 1935లో తయారైన 'శ్రీకృష్ణ తులాభారం'లో కృష్ణుడుగా నటించిన ఎస్.జైసింగ్‌కి తండ్రి. ఈ బాబూ పి.ఎస్. ఎక్కడివాడో తేలాల్సి ఉంది. దీంతో 1908కి ముందే తెలంగాణ సినిమా ప్రారంభమైనదని రూఢీ అవుతున్నది. అదే తెలుగు సినిమా పితామహుడుగా చెప్పుకునబడుతున్న రఘుపతి వెంకయ్య 1909లో సినిమా ప్రదర్శన మొదలు పెట్టిన విషయం ఇక్కడ గమనార్హం.

పోతే, ఇటీవల 2010లో లండన్ సేజ్ పబ్లికేషన్స్ వారు ప్రచురించిన 'బయోస్కోప్' అనే గ్రంథంలో హైదరాబాదులోని మూకీల నాటి కొన్ని చారిత్రక వాస్తవాలు వెలుగులోకి వచ్చినవి. ఇవన్నీ కూడా 1908కి ముందే హైదరాబాదులో స్క్రీనింగ్స్ జరిగినట్లు రుజువు పరుస్తున్నవి. 1896 సెప్టెంబర్ మొదటి వారంలోనే సికింద్రాబాదు నుండి చిన్న సినిమాల (మూకీలు)తో కూడిన పీప్ హోల్ షోస్ మద్రాసు వెళ్లినట్లుగా స్టీఫెన్ పుట్నాం హ్యూస్ రాశారు. అంతేగాకుండా 1897, ఆగస్టులో స్టీవెన్‌సన్ అనే విదేశీ మూకీ చిత్రాల ప్రదర్శకుడు దక్షిణ భారతదేశమంతటా పర్యటిస్తూ హైదరాబాద్ జంట నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చినట్లు when film came to madras అనే అధ్యాయంలో రాశారు. పై విషయాలన్నీ 1896 సెప్టెంబర్ 2, 1897 ఆగస్టు 31 నాటి మద్రాసు మేయిల్ అనే దినపత్రికలలో రిపోర్టు అయినవి. ఈ స్టీవెన్‌సన్ హైదరాబాదులో ధనవంతుల కుటుంబాల వారికి ప్రైవేటుగా కూడా ఆ రోజుల్లో సినిమా ప్రదర్శనలు వేసి చూపాడు. ఇవి హైదరాబాదులో మూకీల చరిత్రకు బలమైన సాక్ష్యాధారాలు. దీంతో 120 ఏళ్ళ కిందనే తెలంగాణలో సినిమా ఉందనేది రుజువవుతున్నది.

ఏడవ నిజాం (1911) పాలనకు వచ్చిన తరువాత కూడా సినిమా పట్ల తమ ఆదరణను ప్రకటిస్తూ వచ్చారు. 1920లోనే సెలక్ట్ టాకీస్ కట్టించారాయన. ఇదే సంవత్సరం బీడ్ జిల్లా పర్భనీలో

సర్దార్‌ఖాన్ "దక్కన్ సినిమా" అనే థియేటర్‌ని నిర్మించారు. కాగా మొన్నటి దాకా తెలుగు నాట నిర్మించిన తొలి థియేటర్‌గా విజయవాడలో "మారుతి"ని చెప్పుకున్నా అది 1921 అక్టోబర్‌లో మొదలైంది. దీంతో థియేటర్ల నిర్మాణంలో కూడా తెలంగాణనే ముందున్నదని తేలిపోయింది. సినిమాల ప్రదర్శన రంగంలో భారతదేశంలో ఎక్కడా జరగని ప్రక్రియ హైదరాబాదులో జరిగింది. అదే మహమూద్‌మియా సినిమా బండి.

1908 ప్రాంతంలోనే సికిందరాబాదు సైనిక పటాలానికి కొత్తగా విలియమ్స్ అనే బ్రిటిష్ ఆర్మీ అధికారి లెఫ్టినెంట్‌గా కలకత్తా నుండి బదిలీపై వచ్చాడు. భార్య, ఇద్దరు పిల్లలతో సికిందరాబాదులో మకాం వేసిన ఆయన తన పిల్లలకు తొలుత 8 ఎం.ఎం. కెమెరాతో ఒక డైనమో సాయంతో చిన్న చిన్న మూకీ సినిమాలు చూపేవాడు. ఆ తరువాత 16 ఎం.ఎం. కెమెరాను కూడా తెప్పించున్నారాయన ఈ ప్రదర్శనకు వాళ్లింట్లో పనిచేసే పిల్లవాడు మెహమూద్‌మియా డైనమో తిప్పుతూ సహకరించేవాడు. 1928లో లెఫ్టినెంట్ విలియమ్స్ బదిలీపై ఇంగ్లాండ్‌కి తిరిగి వెళ్లాల్సి వచ్చింది. అప్పుడు ఆయన భార్య అన్నేళ్ల పాటు తమకు సహకరించిన ఆ పిల్లవాడికి ఏదైనా ఉపాధి చూపాలని 5×3 ఫీట్ల కొలతలతో ఒక తోపుడు బండిని చేయించి చుట్టూ పరదాలు కట్టించి ఒకవైపు తెర, దానికి ఎదురుగా డైనమో ప్రొజెక్టర్‌లని అమర్చి, వీటికిరువైపులా ముగ్గురు చొప్పున సినిమా చూసేలా ఆరు రంధ్రాలు చేసి బండిని అతనికిచ్చింది తమ బహుమతిగా. ఆ మెహమూద్‌మియా 1928 నుండి 1957 వరకు 30 ఏండ్ల పాటు అర్ధాణా, అణాకి సిద్దిఅంబర్ బజార్, ఛత్రి బేగంబజార్, విమెన్స్ వెల్ఫేర్ సెంటర్ వంటి ప్రాంతాల్లో పిల్లలకు, పెద్దలకి 10, 12 నిముషాల నిడివి వున్న చిన్న సినిమాలు చూపించి పొట్ట పోసుకున్నాడు. పోలీస్‌యాక్షన్ తరువాత సిటీలో థియేటర్లు పెరగడంతో మెహమూద్‌మియా సినిమా బండికి ఆదరణ తగ్గి చౌకీదార్‌గా మారిన మెహమూద్‌మియా ఆ తరువాత సినిమా అభిమానులెవరికీ కనిపించలేదు. ఇలా మెహమూద్‌మియా సినిమా బండి తెలంగాణ సినిమా చరిత్రలో ఒక అధ్యాయంగా నిలిచిపోయింది. ఇలాంటిదొక ప్రక్రియనేది వొకటుందని మొదటగా వెలుగులోకి తెచ్చినది ఈ వ్యాసకర్తనే.

## రామ్‌ప్యారీ హైదరాబాదీ మూకీల కాలంలో తొలి తెలుగునాయిక

ముంబై వెళ్లిన తొలి, తెలుగు వారి విషయంలో వాద వివాదాలున్నాయి. ఇప్పటిదాక సీమాంధ్రులు కృష్ణా జిల్లాకు చెందిన ఎల్.వి.ప్రసాద్‌ను ముంబై వెళ్లిన తొలి తెలుగు వ్యక్తిగా ప్రచారం చేసుకుంటూ వచ్చారు. 1930లో ఎల్.వి.ప్రసాద్ ముంబై వెళితే 1929లోనే కరీంనగర్ నుండి ముంబై వెళ్లి మూకీల్లో నటించిన పైడి జైరాజ్‌ను సీమాంధ్ర వాళ్లు తెలుగువాడిగా పరిగణించలేదు. అయితే వీరిద్దరి కన్నా ముందుగానే హైదరాబాద్ నుండి ముంబై వెళ్లిన రామ్‌ప్యారీ అనే సినీతార గురించి ఈ తరం వారెవరికీ తెలియదనే అనాలి.

107 ఏండ్ల క్రితం 1908 డిసెంబర్‌లో రామ్‌ప్యారీ హైదరాబాద్‌లోని నాగులచింతలో పుట్టింది. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ నగరానికి భారీ వర్షాల కారణంగా వరదలు వచ్చి ప్రజల జీవితాలు అస్తవ్యస్థమైనాయి. హైదరాబాద్‌కు మూకీ కెమెరా పరిచయమైన 1908లోనే రామ్‌ప్యారీ పుట్టింది. ఆమె తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలు మాట్లాడగలిగేది. ఇంకా దక్కనీ భాషలైన మరాఠీ, కన్నడలో కూడా ప్రవేశముండేది. 1918లో ఆమె మద్రాసు వెళ్లి అక్కడ భరతనాట్యం నేర్చుకున్నది. 1926లో కోహినూర్ ఫిలిం కంపెనీ వారి సినిమాల్లో నటించడానికి బొంబాయి వెళ్లిందామె. అలా బొంబాయి



వెళ్లిన ఆమె 1927లో చందులాల్ షా తీసిన 'గుణసుందరి' మూకీలో మొదటగా నటించింది. ఆ తర్వాత వైల్డ్ ఉమెన్ (1928)లో కూడా కనిపించిన ఆమె ఆ తరువాత సిల్వర్‌క్లౌడ్, నీలంమనేక్, కుంజ్ కిశోరి, హామ్లెట్, డ్రీమ్‌లాండ్, డిటెక్టివ్‌కుమార్ (1928), రెవల్యూషన్, రాజ్‌హంస, మిస్ డాలి, జై సోమ్‌నాథ్, హతీంతాయ్, ఫిమేల్‌ఫీట్, ఫ్రెండ్ ఆర్ ఫీండ్, డేరింగ్ రాథోడ్ (1929), యాస్మినా, ది వాయ్‌లెంట్, డేర్ డెవిల్, ఇమ్మోర్టర్ గ్లోరి (1930), లయనెస్, డాషింగ్ యూత్ (1931) వంటి మూకీల్లో నటించింది రామ్‌ప్యారి. టాకీల్లో ఆమె ఉర్దూలో సంభాషణలు పలకడంలో ఒక ప్రత్యేకతను ప్రదర్శించేది. కారణం దఖనీ ఉర్దూ పలకడంలో ఆమెను మించిన వారులేరు. టాకీలు వచ్చిన మొదటి యేడాది 1931లోనే మూడు టాకీల్లో నటించిందామె. వరుసగా అవి "పాక్ దామన్", "లైలామజ్ను", "ఘర్‌కీ లక్ష్మి". ఆ తరువాత గుణసుందరి (1934), మీఠీనజర్, జీవన్ నాటక్, అజాద్ అబల, అపరాధి (1935), బండిట్ ఆఫ్ ఎయిర్, సెనెహరాసంసార్ జాన్‌బాజ్ మలీక్(1936), మిలాప్, సముందీశ్వరి (తమిళం), ఖుదాయి ఖిద్మత్‌దార్ (1937), ప్రేమ్‌సాగర్ (1939), బారాత్ (1942), ఆశీర్వాద్ (1943), ఘజల్ (1945), గీత్‌గోవింద్, కౌన్‌పర్‌దేశి (1947), మంజూర్ (1949) వంటి చిత్రాల్లో రామ్‌ప్యారీ నాయికగా, ఇతర ప్రధాన పాత్రధారిగా నటించింది. పృథ్వీరాజ్ కపూర్, మాధవ్‌కాలే, జైరాజ్ వంటి హీరోలు ఆమెతో కలిసి నటించింది. దేవకీబోస్ దర్శకత్వంలో 'విద్యాపతి' చిత్రంలో నటించిందామె.

సినిమా రంగంలో విరివిగా అవకాశాలు రావడంతో 1930 నాటికి రామ్‌ప్యారీ బొంబాయిలోనే స్థిరపడిపోయింది. దాంతో ఆమెకు హైదరాబాదులో సంబంధాలు దాదాపుగా తెగిపోయినవి. అయితే ఆ తరం హైదరాబాదు సినిమా అభిమానుల హృదయాలకు మాత్రం దూరం కాలేదు. హైదరాబాదు నుండి వెళ్లిన అభిమానులతో దఖనీ ఉర్దూ, ఇంగ్లీషుల్లో ఆప్యాయంగా పలకరించేది. వివాహం తరువాత సినిమాలకు దూరమైందామె. పై విషయాలు ఎల్వీ ప్రసాద్, పైడి జైరాజ్‌ల కన్నా ముందుగానే హైదరాబాద్ నుండి బొంబాయి వెళ్లిన సినీతార రామ్‌ప్యారీనే అని మనకు రూఢీ అవుతున్నది.

## పైడి జైరాజ్ బాలీవుడ్‌లో మన తొలిహీరో

బొంబాయిలో 1929లో కాలుమోపి మూకీల్లో నటించిన తొలి తెలుగు వాడు మన తెలంగాణ వాడు పైడి జైరాజ్. 1909 సెప్టెంబర్ 28న కరీంనగర్‌లో పుట్టిన జైరాజ్ సరోజినీనాయుడికి స్వయానా మేనల్లుడు. మహవీర్ ఫిలిం కంపెనీలో పని చేసే మిత్రుడి ప్రోత్సాహంతో సినిమాలపై ఆసక్తి పెంచుకుని బొంబాయి వెళ్లిపోయాడు. అక్కడ 1929లో 'జగ్‌మగాతీ జవానీ' అనే మూకీలో తొలిసారిగా నటించాడు.

# టిసిపార్డు దత్తత గ్రామం నాగులపల్లి




తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి సంస్థ (టిసిపార్డు) వారు మహబూబ్‌నగర్ జిల్లాలోని ఫారుఖ్‌నగర్ మండలంలోని నాగులపల్లి గ్రామంను దత్తత తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి కొనసాగిస్తున్నారు. ఈ నాగులపల్లి గ్రామానికి ఒక శివారు గ్రామం రాచమల్లాగూడెం ఉంది. ఈ నాగులపల్లి గ్రామ పంచాయతీలో 757 మంది స్త్రీలు 768 మంది ఓటర్లున్నారు. ఈ నాగులపల్లి గ్రామ పంచాయతీలో మొత్తం వార్డుల సంఖ్య 10. వీటిలో ఎస్.సి.లు 4, బి.సి.లకు 6 సీట్లు రిజర్వు చేసినారు.

నాగులపల్లి గ్రామ పంచాయతీ జనాభా 2088. పురుషులు 1058, స్త్రీలు 1038. వీరు నిష్పత్తి శాతం 98/100. వీరిలో 576 కుటుంబులుండగా 331 మంది ఎస్.సి.లు, ఎస్.టిలు 3, ఎస్‌సి జనాభా 660, పురుషులు 331, స్త్రీలు 329 మంది ఎస్.టి. జనాభా మొత్తం 14 మంది పురుషులు 4, స్త్రీలు 10 మంది.

మొత్తం ఇండ్ల సంఖ్య 552, ఆర్‌సిసి ఇళ్ళు 272, పెంకుటిళ్ళు 193, సిమెంటు రేకులు 85, పూరిగుడిసెలు 2, స్వంత ఇండ్లు 540, అద్దె ఇండ్లు 12 ఉన్నాయి. ఈ నాగులపల్లి గ్రామంలో ఉన్నత విద్య నేర్చిన వారు లేరు. ఉద్యోగుల (ప్రభుత్వం) సంఖ్య 9, ప్రైవేటు ఉద్యోగం చేయువారు 36 మంది. నాగులపల్లి గ్రామ పంచాయతీకి స్వంత భవనం ఉంది. కాంపౌండ్‌వాల్ కూడా లేదు. త్రాగునీటి సదుపాయం లేదు. మరుగుదొడ్డి సదుపాయం కూడా లేదు. ఊరికి కరెంట్ ఉంది. ఒక పంచాయతీ కార్యదర్శి ఉన్నారు. త్రాగునీటి సౌకర్యం బోరు బావి ద్వారా సరఫరా అవుతాయి. ఊరికి త్రాగునీరు సమస్య ఉంది. సీజనల్‌గా ఉంది. సమస్య వచ్చినప్పుడు బయటి నుండి త్రాగునీరు అందించడం జరుగుతుంది.

మొత్తం ఊరిలో 552 కుటుంబాలలో కుళాయి సౌకర్యం ఉన్నవారు 240 కుళాయిలేని వారు 312 కుటుంబాలు, 24 నీటి సరఫరా అగుటకు తగిన కరెంటు సదుపాయం కూడా ఉంది. వీధి కుళాయిలు రెండు. మురుగు నీటి పారుదల సౌకర్యం పాక్షికంగా ఉంది. గ్రామంలో డ్రైనుల పొడవు 1734 మీటర్లు. కమ్యూనిటీ మరుగుదొడ్డిలు ఊరులో లేవు. ప్రత్యేక మరుగుదొడ్డి సదుపాయం మహిళలకు కూడా లేదు. చెత్తవేసే స్థలం కూడా లేదు.

గ్రామంలో వీధి దీపాల సంఖ్య 94, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు మొత్తం 180 వరకు ఉన్నాయి. తక్కువ వోల్టేజీ సమస్యలేదు. మొత్తం 598 రేషన్ కార్డులుండగా వాటిలో 558 తెల్లరేషన్ కార్డులు 40 పేదల కార్డులు. ఊరిలో వృత్తి పనివారి సంఖ్య కల్లుగీత 5, వడ్రంగి 10, బంగారు పనివారు లేరు, చర్మకారులు 2, దర్జీ 5, వెదురు పనివారు 3, రజకులు 3, రాతిపనివారు 30, కమ్మరులు 2, వ్యవసాయదారులు మొత్తం 250 మంది. పురుషులు 150, స్త్రీలు 100 మంది మార్జినల్ కూలీలు 20, 20 స్త్రీలు లేరు. ఊరిలో పశువులు 273 స్వదేశీ, క్రాస్‌బీడ్ 11, క్రాస్‌బీడ్ గేడెలు 51, మేకలు 204, గొర్రెలు 915. గ్రామంలో పశు వైద్య కేంద్రం లేదు.

గ్రామంలో పాఠశాలలు 2 ఉన్నాయి. ఒకటి బలహీనవర్గాలకు, మరొకటి అందరికను. అంగన్‌వాడీలు 3. ఒకటి గ్రామంలో మరొకటి బలహీనవర్గాల వారికి ఒక ప్రైవేటు పిఎంపి / ఆర్ఎంపిలు ఐదుగురు ఉన్నారు. మహిళా వైద్యం తెలిసినవారు ఐదుగురు. ఒక సంచార వైద్యశాల ఉంది.

గ్రామంలో గ్రామ వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉంది. పౌరసరఫరా కేంద్రం ఒకటి ఉంది. కేబుల్ టెలివిజన్ సదుపాయం నాగులపల్లి గ్రామంకు ఉంది. స్మశాన వాటికలు నాలుగు ఉన్నాయి.

నాగులపల్లి గ్రామంలో ఇతర సౌకర్యాలను గూర్చి సేకరించవలసి ఉంది. సాగునీరు కమిటీల మీద సమాచారం కొరకు డ్రిప్ ఇరిగేషన్ సదుపయాలు లేవు.


కె.ఏ.

రసీలీ రాణి అనే మూకీలో మొదటగా హీరోగా నటించాడు. ఆ తర్వాత మహాసాగర్ మోతీ, క్వీన్ ఆఫ్ ప్యారీస్, మాతృభూమి, ఆల్ ఫర్ లవర్, ఫ్లైట్ ఇన్ టూ డెత్ అనే మూకీల్లో నటించాడాయన. టాకీలు వచ్చిన తర్వాత షికారీ (1932), మాయాజాల్ (1933), దర్దే దిల్, వాసవదత్తా (1934), షేర్ దిల్ ఔరత్ (1935), గరీబ్ పరివార్ (1936), సాథి (1937), భాబీ, మధుర్ మిలన్(1938), బిజిలీ, జువారీ, లెదర్ ఫేస్ (1939) వంటి సినిమాల్లో 1960 వరకు దేవికారాణి, నిరూపారాయ్, మధుబాల, నర్గీస్ వంటి హీరోయిన్లతో కలిసి హీరోగా నటించాడు. ఆయన మొత్తం 300కు పైగా సినిమాల్లో నటించాడు. ఆయన సినీ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1981లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుతో గౌరవించింది. ఆ మహానటుడు 2000, ఆగస్టు 11న కన్నుమూశారు.

ఈ నేపథ్యంలో బాలీవుడ్‌లో తెర ముందు, తెర వెనుక ఒక వెలుగు వెలిగిన వారిలో అజిత్, చంద్రశేఖర్, జుబేదాబేగం, నిగార్ సుల్తానా వంటి నటీనటులు, శంకర్ జైకిషన్, ఇక్బాల్ ఖురేషీ వంటి సంగీత దర్శకులు, ఎం.ఎ.రహమాన్ వంటి కెమెరామెన్‌లు, కేకే రెడ్డి వంటి దర్శకుడు ఇంకా చాలామంది ఉన్నారు.

1940 నాటికి హైదరాబాదులో "మహబీర్‌సింగ్" స్టూడియో తయారైంది. అప్పట్లో సినిమాల నిర్మాణం జరిగిన దానికి నేటికీ స్టూడియో ఆనవాళ్లు అంబర్‌పేట ప్రాంతంలో కనిపిస్తాయి. అయితే కన్నడ, తమిళ, మలయాళ చిత్రాలకు కూడా కేంద్రమైన మద్రాసులో తెలుగు సినిమా రంగం స్థిరపడింది. కారణం.. ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి కేంద్రం కావడం. అయితే మద్రాసు నుండి వారంతా హైదరాబాదు రావడానికి 60 ఏళ్లు పట్టింది. ఈ కాలంలో తెలుగు సినిమాపై కృష్ణా ఉభయ గోదావరి, గుంటూరు, నెల్లూరు, రాయలసీమ జిల్లాల వారు పూర్తిస్థాయి పట్టు సాధించిన పరిస్థితి.

**హెచ్.రమేష్‌బాబు,** 94409 25814
(ఫ్రీలాన్స్ ఫిలిం జర్నలిస్ట్)



# పాడిపశువుల మేపులో అజొల్లా ప్రాముఖ్యత



అజొల్లా నీటిలో తేలియాడుతూ పెరిగే ఫెర్న్ జాతికి చెందిన మొక్క అజొల్లాలో అనబీనా అనబడే నీలి ఆకుపచ్చ నాచు బాక్టీరియా ఉండి వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరించడం వలన అధిక మాంసకృత్తులు కలిగి ఉంటుంది. మన ప్రాంతంలో పెరిగే అజొల్లాని శాస్త్రీయంగా "అజొల్లా పిన్నేటా" అని పిలుస్తారు.

వాతావరణంలో నత్రజనని గ్రహించే శక్తి ఉండడం వల్ల వరిలో జీవన ఎరువుగా, పశువులకు, కోళ్ళకు మరియు చేపలకు దాణాగా దోమలను అరికట్టే మొక్కగా మరియు బయోస్కావెంజర్‌గా బహుళ ప్రయోజనాలు కలిగి ఉన్న ఈ అజొల్లాను రైతు స్థాయిలోనే అభివృద్ధి చేసుకొని వాడుకుంటే దాణాపై ఖర్చు తగ్గి ఆదాయపరంగా బాగుంటుంది.

### అజొల్లాలో పోషక విలువలు

| | |
|---|---|
| మాంసకృత్తులు | : 25-30% |
| అమైనోఅమల్లాలు | : 10.0% |
| నత్రజని | : 5.0% |
| కాల్షియం | : 0.1. - 1.0% |
| భాస్వరం | : 0.5% |
| ఇనుము | : 0.26% |
| పొటాషియం | : 2.0% - 4.5% |
| చెక్కర | : 3.4 - 3.5% |
| పిండి పదార్థం | : 6.5% |

### దాణాగా అజొల్లా

- ఈ మధ్య కాలంలో పశువుల దాణాగా మరియు కోళ్ళకు మేతగా అజొల్లా వాడకం పెరిగింది. అజొల్లాలో 25-30% ప్రోటీన్లు, అమైనోఅమల్లాలు, లవణాలు, విటమిన్లు మరియు బీటాకెరోటిన్ వంటి పశువులకు అత్యంత అవసరమైన మూలకాలు ఉన్నాయి.
- రోజూ ఒకటిన్నర నుండి రెండు కిలోల అజొల్లాను పాడి పశు వులకు పెడితే పాల దిగుబడి, నాణ్యత పెరగడమే కాక పశువుల ఆరోగ్యాన్ని వృద్ధి చేస్తుంది.
- అజొల్లాను పశువుల దాణాలో వాడినప్పుడు పాల దిగుబడిలో 15-20 శాతం పెరుగుదల, పాలలోని క్రొవ్వు 10 శాతం, క్రొవ్వు కాని ఘన పదార్థాలు 3 శాతం పెరిగినట్లు గమనించడమైనది.
- అజొల్లాలను దాణాగా వాడడం వల్ల దాణా ఖర్చు (20-25%) తగ్గించవచ్చును.
- గొర్రెలు, మేకలు, బాతులు, చేపలు, కోళ్ళు వంటి వాటికి కూడా అజొల్లాను మేతగా ఉపయోగించవచ్చు.
- అజొల్లాలో లిగ్నిన్ శాతం తక్కువగా ఉండడం వలన పశువులకు బాగా జీర్ణమవుతుంది.
- కోళ్ళమేతగా అజొల్లాను వాడినప్పుడు కోళ్ళ బరువు మరియు గ్రుడ్డు పెరిగినట్లు పరిశోధనలో తేలింది. అంతే కాకుండా అజొల్లాను మేతగా వాడినప్పుడు వచ్చే గ్రుడ్లలో బీటాకెరోటిన్ మరియు ఒమేగా క్రొవ్వు అమ్లాలు ఎక్కువగా ఉండడం గమనించడం జరిగినది.
- అజొల్లాను మేతగా వాడడం వలన తెగుళ్ళను తట్టుకునే కోళ్ళలో పెరుగుతుంది.

### అజొల్లా పెంపకం / అజొల్లా తయారీ విధానం

- అజొల్లాను పెంచడానికి నీరు నిలువని, సూర్యరశ్మి తక్కువగా (50% మాత్రమే) ప్రసరించే ప్రాంతంలో అనగా చెట్ల నీడలోగాని షెడ్ నెట్‌లోగాని స్థలం ఎంపిక చేసుకొని కలుపును తొలగించి సమానంగా చదును చేసుకోవాలి.
- 2.5 మీ. పొడవు × 1.5 మీ. వెడల్పు × 20 సెం.మీ.లోతుగల గుంతలు తవ్వుకొనిగానీ లేదా ఇటుకలనుపేర్చిగాని తొట్టెను తయారు చేసుకోవాలి. సిమెంటు తొట్టెలలో కూడా అజొల్లాను పెంచుకోవచ్చు.
- ఈ గుంతలలో 150 జి.ఎస్.ఎమ్. మందం గల సిల్లాలిన్ లేదా కొంచెం మందమున్న ప్లాస్టిక్ షీటును వేసి, షీటు చివరల ఇటుకలపై

అంచులు బయటకు వచ్చేలా పరవాలి. (సుమారుగా 3 మీ × 2 మీ సైజు గల షీటు)

- తరువాత 10-15 కిలోల జల్లెడ పట్టిన మెత్తటి సారవంతమైన మట్టి సమానంగా పాలిథీన్ షీటుపై పరవాలి.
- 2-5 కిలోలు 2 రోజులు నిల్వ ఉంచిన పేడ, 40 గ్రాముల సూపర్ ఫాస్ఫేటు లేదా రాక్ ఫాస్ఫేట్ 10 లీటర్ల నీటిలో కలిపి ఆ మిశ్రమాన్ని గుంతలో పోసి బాగా కలపాలి. 10 సెం.మీ. నీటి మట్టం ఉండేలా మరింత నీటిని పోసి గుంతలో మట్టిని, నీటిని బాగా కలియబెట్టాలి.
- 0.5 - 1.00 కిలోల స్వచ్ఛమైన మదర్ కల్చర్‌ని ఈ బెడ్ మీద అంతా సమానంగా పడేలా వేయాలి. ఆ తరువాత మంచి నీటిని అజొల్లాపై చిలకరించి అజొల్లా మొక్కలు పైకి నిటారుగా ఉండేలా చేయాలి.
- వేసిన 7 నుంచి 10 రోజుల్లో అజొల్లా గుంత అంతా అభివృద్ధి చెందుతుంది.
- ప్రతి వారం రోజులకు 20 గ్రాముల సూపర్‌ఫాస్ఫేటు 1 కిలో పేడను గుంతలో నీటికి కలిపితే అజొల్లా త్వరగా పెరుగుతుంది.
- మెగ్నీషియం, ఇనుము, కాపర్, సల్ఫర్ కలిపిన సూక్ష్మపోషక మిశ్రమాన్ని (మైక్రోన్యూట్రియంట్స్) 20 గ్రా. ప్రతివారం గుంతలో నీటికి కలిపితే అజొల్లా పెరుగుదల బాగుంటుంది.
- 30 రోజులకొకసారి 5 కిలోల మట్టిని తీసివేసి 5 కిలోల కొత్తమట్టిని వేయాలి.
- ప్రతి పదిరోజులకు 25-30 శాతం నీటిని తీసివేసి మంచినీటిని నింపినట్లయితే అజొల్లా అరోగ్యంగా పెరుగుతుంది.
- 6 నెలల కొకసారి గుంతను మొత్తం శుభ్రపరచి, కొత్త మట్టి పేడతో, అజొల్లాను అభివృద్ధి చేసుకోవాలి.
- పెరిగిన అజొల్లాను రంధ్రాలు కలిగిన ప్లాస్టిక్ జల్లెడలో తీసుకొని చిన్న అజొల్లా మొక్కలను తిరిగి గుంతలో వేయాలి.
- అజొల్లా దిగుబడి వర్షాకాలం మరియు శీతాకాలంలో ఎక్కువగా ఉంటుంది.

## అజొల్లా పెంపకంలో జాగ్రత్తలు

- ఉష్ణోగ్రత $20^0$-$28^0$ సెంటిగ్రేడు మధ్యలో ఉండేలా, నేరుగా సూర్యకాంతి పడే చోట కాకుండా నీడ గల ప్రదేశంలో అజొల్లాను పెంచాలి.
- అజొల్లా గుంతలను ఆకురాలని ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలి.
- ఆకు రాలితే అజొల్లా కుళ్ళిపోయే ప్రమాదముంది.
- అజొల్లా పెంచు గుంతల్లో ఉదజని సూచిక 5.5 - 7.5 మధ్య ఉండాలి.
- నీటిమట్టం 5-15 సెం.మీ. ఉండి ప్రతి మూలలో సమానంగా ఉండాలి.
- పెరిగిన అజొల్లాను ఎప్పటికప్పుడు తీసి వాడుకోవాలి. అజొల్లా సాంద్రత ఎక్కువైతే జబ్బులు వచ్చే అవకాశముంది.
- నీటిని, మట్టిని అవసరం మేరకు మారుస్తూ, ఆవుపేడ, ఖనిజలవణాల లెక్క సరిగా అందిస్తే అజొల్లా ఆరోగ్యంగా పెరుగుతుంది.

## అజొల్లాలో పురుగు, తెగుళ్ళ నివారణ

- పురుగులు మరియు తెగుళ్ళ ఉధృతి అజొల్లాలో తక్కువగా ఉంటుంది. బెడ్‌లో అజొల్లా ఎక్కువగా ఉన్నట్లయితే పురుగులు మరియు తెగుళ్ళ వచ్చే అవకాశం ఉంటుంది. పురుగుల నివారణకు 5 మి.లీ. వేపనూనెను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తెగుళ్ళ నివారణకు సూడోమోన్‌ఫోరిసెన్స్ మరియు ట్రైకోడెర్మా విరిడిలను 100 గ్రా. చొప్పున వాడాలి.

## అజొల్లా వినియోగం

- వేసిన 7-10వ రోజు నుంచి రోజుకు 1 కిలో వరకు అజొల్లా అభివృద్ధి చెందుతుంది. ఒకపాడి పశువుకు రోజుకు 1-2 కిలోల వరకు అజొల్లా మేపవచ్చు.
- అజొల్లా ఫ్లేక్స్ తయారు చేసి కోళ్ళ దాణాగా కూడా వాడవచ్చు.
- అజొల్లాను 1:1 నిష్పత్తిలో ఇతర దాణాలతో కలిపి వాడుకోవాలి.
- అజొల్లా పెంపకంలో పేడ వాడతాం కాబట్టి, అజొల్లా కొంచెం పేడ వాసన వస్తుంది. కాబట్టి మంచి నీటిలో బాగా కాడిగి పశువుల దాణాగా వాడుకోవాలి.
- మొదట్లో పశువులు అజొల్లాను అంతగా ఇష్టపడకపోయినా చిన్న చిన్న ముక్కలుగా చేసిన పశుగ్రాసం లేదా తౌడుతో కలిపి పెడితే అలవాటవుతుంది.

## అజొల్లా తయారీ ఆదాయ వ్యయాలు

ఒక ఆవు గేదెకు ఒక తొట్టె నుంచి లభించే అజొల్లా సరిపోతుంది. ఈ లెక్కన ఆవులు, గేదెల సంఖ్యను బట్టి ఎన్ని తొట్టెలు అవసరమవుతాయో నిర్ణయించుకోవాలి. అజొల్లా గుంత నిర్మాణానికి 1500 - 2000 రూపాయల వరకు ఖర్చు అవుతుంది. అందుబాటులో ఉన్న వనరులతో ఇంకా తక్కువ ఖర్చులో కూడా నిర్మించుకోవచ్చు. అజొల్లా ఉత్పత్తి కోసం కనీసం రెండు గుంతలను నిర్మించుకోవడం మంచిది. ఒక వేళ పశువులు ఎక్కువగా ఉండే పశువుల సంఖ్యను బట్టి ఏర్పాటు చేసుకోవాలి. సొంతంగా తయారు చేసుకునే రైతులకు కూలీ ఖర్చు కూడా ఉండదు కాబట్టి ఖర్చు తగ్గుతుంది. అజొల్లాను సొంతంగా తయారు చేసుకోవడం వలన దాణాపై పెట్టే ఖర్చు గణనీయంగా తగ్గడమే కాకుండా పాల ఉత్పత్తి నాణ్యత పెరగడం వలన ఆదాయం పెరుగుతుంది.

ఈ నేపథ్యంలో పశుగ్రాసాల సాగుకు ప్రత్యేకంగా భూమిని కేటాయించలేని పరిస్థితులలో చిన్న సన్నకారు రైతులందరూ తమ పెరిటిలో లేదా పశువుల కొట్టాల దగ్గర అజొల్లా పెంపకం చేపట్టి సంవత్సరం పొడవునా పాడి పశువులకు సమీకృత దాణా అందించి తద్వారా సుస్థిర ఆదాయం పొందవచ్చు.

**డా॥ఆర్.సుశీల, డా॥ ఆర్.వి.టి.బాలాజీ నాయక్,**
**డా॥ యమ్.అనురాధ, డా॥ యమ్.శాంతి, డా॥టి.శశికళ**
**పశుగ్రాస విభాగం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్**

Printed & Published by: Anita Ramachandran, Commissioner, on behalf of TSIPARD, Printed at Navatelangana Printers Pvt.Ltd. M.H.Bhavan, Near RTC Kalayanamandapam, Hyderabd.-20. Published at TSIPARD, Rajendranagar, Hyderabad- 500 030. Editor : Anita Ramachandran

Regd. No. HSE/929/2014-2016
Published on 20-05-2016

Sthanika Palana
Date of posting May, 2016

RNI No.APTEL/27888/2009.
Licenced to post without prepayment
No.R&D/HSE/929/WPP/2015-16




తాజా సమాచారం కోసం www.tsipard.gov.in

మరియు YouTube facebook /tsipard

టోల్ ఫ్రీ నెం.: 1800 425 7070



పిసా చట్టం పై టిసిపార్డులో జరిగిన టిఓటి శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న టిసిపార్డు జాయింట్ డైరెక్టర్
శ్రీ కె.యాదయ్య గౌడ్



టిసిపార్డు దత్తత గ్రామం నాగులపల్లి గ్రామస్థులతో సమావేశమైన టిసిపార్డు అధికారులు



తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాలపై అవగాహన నిమిత్తం టిసిపార్డులో శిక్షణ తీసుకునేందుకు విచ్చేసిన
చత్తీస్‌ఘడ్ ప్రజాప్రతినిధిలు మరియు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న టిసిపార్డు జాయింట్ డైరెక్టర్ శ్రీ యాదయ్యగౌడ్